ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

సోమవారం 23 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 157 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

నేపాల్ ప్రధాని భారత్ పర్యటన

సోమవారం ప్రధాని మోదీతో చర్చలు 2





పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

అమెరికా ఎఫ్-16పై ఇరాన్ క్షిపణి దాడి.. ఖండించిన అమెరికా 2

పాలించడానికా..? తిట్టడానికా?

ప్రజలు అధికారమిచ్చింది పాలించడానికి.. సమస్యలు పరిష్కరించడానికి.. ఎన్నికల హామీలు అమలు చేయడానికి. అంతేకానీ ప్రత్యర్థులను, చివరకు సొంత పార్టీ నాయకులను సైతం అవమానించడానికి కాదు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి మాటల్లో హుందాతనం, పాలనలో బాధ్యత ప్రజలు ఆశిస్తారు. కానీ తెలంగాణలో పాలనా ఫలితాల కంటే రాజకీయ విమర్శలు, వివాదాస్పద వ్యాఖ్యలే ఎక్కువగా చర్చకు వస్తున్నాయి.

(స్టేట్ బ్యూరో - సింగిడి)

ప్రజలు అధికారమిచ్చిందెందుకు.. రేవంత్ సాబ్

హామీల అమలుకన్నా వివాదాస్పద వ్యాఖ్యలే ఎక్కువ

సొంత పార్టీ ఎమ్మెల్యేలకూ తప్పని అవమానాలు

కేసీఆర్ పాలనలో తప్పలుంటే.. మూడేళ్లుగా అదే పాటనా..

కాళేశ్వరం సాకుతో ఇంకెన్నాళ్లు గతాన్నే తవ్వుతారు?

నష్టమెవరికి.. కాంగ్రెస్‌కా? తెలంగాణకా?

బలపడుతున్న బీఆర్ఎస్.. నాటి పాలనే నయమంటున్న పబ్లిక్



పదేళ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత మార్పు కోరుకున్న ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. ఆరు గ్యారంటీలు, వందలాది హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మూడేళ్లకు చేరువవుతున్నా.. హామీల అమలుపై పూర్తి స్పష్టత కంటే ముఖ్యమంత్రి మాటతీరే ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. రైతు భరోసా, రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, అభివృద్ధి పనులపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే ప్రాధాన్యమిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రతిపక్షం నుంచి సొంత పార్టీ వరకు.. అవే తిట్లు.

నవంబర్ 19న సిద్దిపేట సభలో కొందరికి పిచ్చికుక్కలు కరిచినట్లుందని, కాంగ్రెస్ కార్యకర్తలు వారిని ఎర్రగడ్డకు తీసుకెళ్తారని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న సొంత పార్టీ ఎమ్మెల్యేలనే ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారన్న చర్చ మొదలైంది.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధుల కేటాయింపులో వివక్షను ప్రశ్నిస్తుండగా, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అధికారుల అవినీతి, కాంట్రాక్టర్ల బిల్లుల వ్యవహారంపై ఆరోపణలు చేస్తున్నారు. వీటిపై విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు అవమానాలు సమాధానం కావు. 2



'కాపు'ల అడ్డా..

కరీంనగర్ గడ్డ

ఎలగందల్ పై రాజకీయ ఆధిపత్యం

ప్రధాన పార్టీల్లో కీలక పదవులు... సత్తా చాటుతున్న బీఆర్ఎస్, బీజేపీ

2009 నుంచి కాంగ్రెస్‌కు అందని అధికారం 2

(బోయిని సంపత్ కుమార్ - కరీంనగర్ జిల్లా ప్రతినిధి - సింగిడి)

కరీంనగర్ రాజకీయ ముఖచిత్రం మారింది. ఒకప్పుడు వెలమ సామాజికవర్గానికి పట్టున్న జిల్లా కేంద్రం.. ఇప్పుడు బీసీలకు, ముఖ్యంగా మున్నూరు కాపులకు రాజకీయ వేదికగా మారింది. గత రెండు దశాబ్దాలుగా ఎమ్మెల్యే స్థానం నుంచి ఎంపీ, మేయర్ పదవుల వరకు ఈ సామాజికవర్గం నేతలే కీలక స్థానాల్లో కొనసాగుతుండటం విశేషం. పార్టీలు వేరైనా ప్రాతినిధ్యం మాత్రం ఒకే సామాజికవర్గం నుంచి ఉండటం కరీంనగర్ రాజకీయాల్లో ప్రత్యేకతగా నిలుస్తోంది.





ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

వికారాబాద్ జిల్లాలో ఘటన 2



కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్

2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం

కాంగ్రెస్ హామీల అమలులో విఫలం: కేటీఆర్

హనుమకొండలోని 'జన చైతన్య' బహిరంగ సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు 2

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, మరో 500 రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హనుమకొండలోని కేడీసీ మైదానంలో బీఆర్ఎస్ నిర్వహించిన 'జన చైతన్య' బహిరంగ సభలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పెన్షన్లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోందని, గతంలో ఉన్న పెన్షన్లను తొలగించి ఇప్పుడు కొత్తగా కొన్నింటిని మంజూరు చేయడాన్ని ఘనంగా ప్రచారం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ కార్పొరేటర్లు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్ అభివృద్ధికి పెద్దపీట వేశామని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ కంటే భవిష్యత్తులో వరంగల్ నగరానికే గొప్ప అవకాశాలు ఉంటాయని, అది ఫ్యూచర్ సిటీగా ఎదుగుతుందని పేర్కొన్నారు. గతంలో వరంగల్‌కు అనేక ఐటీ కంపెనీలను తీసుకొచ్చామని, 24 అంతస్తులతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, రవీంద్ర భారతికి దీటుగా కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా అనేక కంపెనీలు నగరానికి వచ్చాయని తెలిపారు.

- వరంగల్, నవంబర్ 22 (సింగిడి)

మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టార్గెట్..90 సీట్లు, కోటి ఓట్లు

రాష్ట్రంలో 15 లోక్‌సభ సీట్లు సాధిస్తాం

పార్టీలో కష్టపడ్డవారికి పదవి దానంతట అదే వస్తుంది

చెడగొట్టేవాళ్లను మాత్రం గుర్తుంచుకుంటాం

సంక్రాంతి తర్వాత 5 నెలలు ప్రజాబలం కార్యక్రమం

ప్రజా ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా పంటల్ని కాపాడాం

అధికారం కోసం బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు

పీఏసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

కేసీఆర్ హయాంలోనే ఏపీ పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు

టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్



గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 95 లక్షల ఓట్లు, 65 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు 119 స్థానాలకే జరిగితే.. తమ టార్గెట్ కోటి ఓట్లు, 90 సీట్లు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 17 లోక్‌సభ సీట్లలో 15 సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడాలని.. వ్యూహాలు, ఎత్తుగడలను తాము చూసుకుంటామని చెప్పారు. పార్టీలో కష్టపడ్డవాళ్లను తప్పనిసరిగా గుర్తిస్తామని, చెడగొట్టేవాళ్లను గుర్తుపెట్టుకుంటామని స్పష్టం చేశారు.

- హైదరాబాద్, నవంబర్ 22 (సింగిడి) 2

కేసీఆర్ హయాంలోనే ఏపీ ప్రాజెక్టులకు శ్రీకారం

299 టీఎంసీల నీటి వినియోగానికి అప్పుడే సంతకం

కాంగ్రెస్ వచ్చాక ఒక్క ప్రాజెక్టూ చేపట్టలేదు: సీఎం రేవంత్‌రెడ్డి 2



పంచాయతీల్లో ఏకగ్రీవాలకు ప్రోత్సాహం

పంచాయతీ ఎన్నికలపై పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

పంచాయతీల్లో ఏకగ్రీవాల కోసం గ్రామ నేతలతో మాట్లాడాలని ఎమ్మెల్యేలకు సూచన 2

ఏకగ్రీవ పంచాయతీలకు జనాభాను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు

పార్టీ నేతల మధ్య పంతాలు వీడి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు



ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను విస్తృతంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో తాజాగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, ఏకగ్రీవాల ఆవశ్యకత తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇటీవల పార్టీ గుర్తులపై జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన ఆమోదమని పేర్కొన్నారు.

- అమరావతి, నవంబర్ 22 (సింగిడి)

షర్మిలను అడ్డుకున్న పోలీసులు

బెంగళూరు ఎయిర్‌పోర్టు వద్ద షర్మిల కాన్వాయ్ అడ్డగింత

యలహంక ప్యాలెస్ లోకి నో ఎంట్రీ 2



మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 95 లక్షల ఓట్లు, 65 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు 119 స్థానాలకే జరిగితే.. తమ టార్గెట్ కోటి ఓట్లు, 90 సీట్లు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 17 లోక్‌సభ సీట్లలో 15 సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడాలని.. వ్యూహాలు, ఎత్తుగడలను తాము చూసుకుంటామని చెప్పారు. పార్టీలో కష్టపడ్డవాళ్లను తప్పనిసరిగా గుర్తిస్తామని, చెడగొట్టేవాళ్లను గుర్తుపెట్టుకుంటామని స్పష్టం చేశారు.
పార్టీ లైన్‌లో ఉన్నవారికి పదవి దానంతట అదే వస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారాల ద్వారా అధికారంలోకి రావాలని చూస్తోందని విమర్శించారు.అప్పట్లో కేసీఆర్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లేదని, పార్టీని పెరగనివ్వకుండా అడ్డుకుంటానని విర్రవీగారని.. కానీ ఇప్పుడు వాళ్ల బీఆర్ఎస్ పార్టీకే భవిష్యత్తు లేకుండా పోయిందని పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడే ఏపీ పల్నాడు వాటర్ గ్రిడ్ పథకం ప్రారంభించిందని చెప్పారు. ఆదివారం ఉదయం గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాలు, సలహా కమిటీల ఉమ్మడి సమావేశం, సాయంత్రం విస్తృత కార్యవర్గ సమావేశం జరిగాయి. సీఎం రేవంత్



ఈ రెండు సమావేశాల్లో పార్టీ నాయకులకు దిశానిర్దేశనం చేశారు. తాను టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిననాటికి.. అప్పటి సీఎం కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి చాలా మంది ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకున్నారని రేవంత్ గుర్తు చేశారు. నయానా, భయానా గ్రామ స్థాయి నుంచి ఎంపీల వరకు నాయకులను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని.. రాష్ట్రంలో కాంగ్రెస్ లేదని, పార్టీని పెరగనివ్వకుండా అడ్డుకుంటానని విర్రవీగారని పేర్కొన్నారు. తాను టీపీసీసీ చీఫ్ అయ్యాక కాంగ్రెస్ డిజిటల్ సభ్యత్వం కార్యక్రమం చేపట్టి 90 రోజుల్లో 48 లక్షల సభ్యత్వం చేశామని, అది దేశంలోనే అత్యధికమని చెప్పారు. రాష్ట్రంలోని 45 లక్షల మంది క్రియాశీల సభ్యులు అదనంగా ఒక్కో ఓటు తీసుకువచ్చినా 90 లక్షల ఓట్లు, 65 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆనాడే చెప్పానని గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బీజేపీకి 240 సీట్లు దాటబోవని చెప్పానని.. ఎన్నికల్లో బీజేపీ 240 దగ్గరకి వచ్చి ఆగిపోయిందని చెప్పారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరో పాతిక లోక్‌సభ సీట్లు వచ్చినా, బీజేపీకి పాతిక సీట్లు తగ్గినా.. కేంద్రంలో ఇండి కూటమి అధికారంలో ఉండేదన్నారు.

నమ్మకంతో పనిచేసినవారికి గుర్తింపు..

రాజకీయాల్లో విశ్వాసం, నమ్మకం వెయ్యి ఏనుగుల బలాన్ని ఇస్తాయని రేవంత్‌రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలపై కొట్లాడాలని, బీఫామ్ ఇంటికి తీసుకువచ్చి ఇస్తామని వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, బీర్ల అయిలయ్య వంటి బలహీన వర్గాల నాయకులకు చెప్పామని వివరించారు. నమ్మకంతో పనిచేసిన వారికి ఇళ్లకే బీఫామ్‌లు పంపామన్నారు. అలాగే కష్టకాలంలో పార్టీ జెండా మోసిన 70శాతం డీసీసీ అధ్యక్షులకు బీఫారాలను ఇంటికి పంపామని.. వారు గెలిచి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, విప్‌లుగా అయ్యారని చెప్పారు. టికెట్లు ఇవ్వలేక పోయినవారిని తర్వాత ఆదుకుంటామని మాటిచ్చామని.. అలా పార్టీ మాట విన్న బల్మూరి వెంకట్‌ను ఎమ్మెల్సీగా, అనిల్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా చేశామని వివరించారు. పార్టీ కార్యకర్తల బాగోగులు తాను చూసుకుంటే.. తన బాగోగులు పార్టీనే చూసుకుంటుందని నమ్మిన మహేశ్‌గౌడ్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి దక్కిందన్నారు. అధికారంలోకి రావాలంటే ఉపాయాలూ ఉండాలని చెప్పి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్దకు వెళ్లానని.. రాహుల్‌గాంధీ నాయకత్వంపై నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరాలని చెప్పానని.. ఇప్పుడు ఆయన మంత్రిగా ఉన్నారని వివరించారు. సంజీవరెడ్డికి టికెట్ త్యాగం చేసిన సురేశ్ షెట్కార్ ఎంపీ అయ్యారని.. పార్టీని నమ్మితే గుర్తింపు ఉంటుందనడానికి ఇవన్నీ ఉదాహరణలని వివరించారు.వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడ్డవాళ్లను గుర్తిస్తామని, చెడగొట్టేవాళ్లను గుర్తు పెట్టుకుంటామని చెప్పారు. ''పార్టీలో ఎవరెవరు కష్టపడుతున్నారన్నది నిశితంగా గమనిస్తున్నాం. ప్రతి ఒక్కరి కృషి, మాటతీరు, ముందు ఏం మాట్లాడుతున్నా.. వెనుక ఏం మాట్లాడుతున్నరన్న సమాచారం పార్టీ దగ్గర ఉంది అన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఎన్ని పరిశ్రమలను తీసుకొచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. ఉన్న పరిశ్రమలను కూడా కాపాడుకోలేకపోతోందని విమర్శించారు.

మళ్లీ అధికారంలోకి వస్తాం

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్‌కు భారీగా నిధులు కేటాయించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కేటీఆర్ తెలిపారు. సభలో గత ప్రభుత్వ హయాంలో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ కీలక పాత్ర పోషించిందని, కాకతీయుల పౌరుషం, కాళోజీ పోరాట స్ఫూర్తి, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు ఈ నేలతో ముడిపడి ఉన్నాయని గుర్తుచేశారు. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించిన అనంతరం తొలి సభను ఇదే కేడీసీ మైదానంలో నిర్వహించారని ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు

హామీలు అమలు చేస్తే రాజకీయం వదిలేస్తా - రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో జన చైతన్య సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ సహా ఆ జిల్లా ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చారని, కనీసం లక్షాధికారులను చేయాలని సూచించారు. కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే రాజకీయం వదిలేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. వరంగల్‌లో కనీసం వెయ్యి ఉద్యోగాలైనా కల్పించాలనే ఉద్దేశంతో 4 ఐటీ కంపెనీలు తెచ్చామని పేర్కొన్నారు.

మహిళలకు రూ.87,500 బకాయి

ఎన్నికల సమయంలో మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరించిందని కేటీఆర్ ఆరోపించారు. కనీసం మహిళలను లక్షాధికారులుగా అయినా చేయగలిగారా అని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి 36 నెలలు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. ఈ లెక్కన ఒక్కో మహిళకు రూ.87,500 బకాయి పడినట్లేనని పేర్కొన్నారు. పెన్షన్ల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు.

నేపాల్ ప్రధాని భారత్ పర్యటన

సోమవారం ప్రధాని మోదీతో చర్చలు

న్యూఢిల్లీ, నవంబర్ 22 (సింగిడి)

నేపాల్ ప్రధాని బాలెన్ షా తొలి పర్యటనలో భాగంగా ఆదివారం భారత్ చేరుకున్నారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు స్వాగతం పలికారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలెన్ షా సమావేశం కానున్నారు. ఇంధనం, జలవిద్యుత్, రైల్వేలు, కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల రంగాలతో పాటు ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరుగనున్నాయి. కాగా, నేపాల్‌లో పలు ప్రాజెక్టులను ఇరు దేశాల ప్రధానమంత్రులు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అలాగే ఆర్థికవృద్ధి, సామాజిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పు వంటి సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తున్నది. భారతదేశం నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య, రవాణా, పెట్టుబడి భాగస్వామి ఉన్నది. భారత మార్కెట్‌లోకి పన్ను రహిత ప్రవేశాన్ని కూడా ఆ దేశం పొందుతున్నది. మరోవైపు నేపాల్, భారత్ మధ్య చాలా కాలంగా సరిహద్దు వివాదం కూడా ఉన్నది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపాని ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ స్థిరంగా వాదిస్తున్నది. మే నెలలో నేపాల్ ప్రధాని బాలెన్ షా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడానికి చైనా, బ్రిటన్ దేశాల ప్రమేయాన్ని ఆయన కోరారు. అయితే మూడో పక్షాల పాత్రను భారత్ తిరస్కరించింది. సరిహద్దు సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించుకోవడానికి ఇరు దేశాల మధ్య ఒక సుస్థిరమైన ద్వైపాక్షిక యంత్రాంగం ఉన్నదని పేర్కొంది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

అమెరికా ఎఫ్-16పై ఇరాన్ క్షిపణి దాడి.. ఖండించిన అమెరికా

న్యూఢిల్లీ, నవంబర్ 22 (సింగిడి)

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. పర్షియన్ గల్ఫ్‌పై ప్రయాణిస్తున్న అమెరికా ఎఫ్-16 యుద్ధవిమానంపై క్షిపణి ప్రయోగించినట్లు ఇరాన్ సైన్యం శనివారం ప్రకటించింది. విమానం దెబ్బతినడంతో పైలట్ అత్యవసరంగా ల్యాండ్ అయ్యాతెలిపింది. ఎంక్యూ-9 రీపర్ సహా ఇప్పటివరకు 58 అమెరికా డ్రోన్లను కూల్చివేసినట్లు పేర్కొంది. అయితే ఈ ఆరోపణలను అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్కామ్) ఖండించింది. పశ్చిమాసియాలో తమ యుద్ధవిమానాలేవీ దాడికి గురికాలేదని తెలిపింది. మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ.. శుద్ధి చేసిన యురేనియాన్ని మరో దేశానికి అప్పగించే ప్రసక్తే లేదన్నారు. శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత అమెరికా మళ్లీ దాడి చేయబోమని హామీ ఇవ్వాలని కోరారు. కేవలం యుద్ధం ముగించేందుకు ఏ ఒప్పందానికీ అంగీకరించబోమని, దీర్ఘకాలిక పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. గత జూన్‌లో కాల్పుల విరమణ కుదిరిన 15 రోజులకే మళ్లీ పోరు మొదలైందని గుర్తుచేశారు.

కేసీఆర్ హయాంలోనే

ఏపీ ప్రాజెక్టులకు శ్రీకారం

హైదరాబాద్, నవంబర్ 22 (సింగిడి)

ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన పలు ప్రాజెక్టులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే శ్రీకారం చుట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. పల్నాడు వాటర్ గ్రిడ్ పథకం కేసీఆర్, వైఎస్ జగన్ ప్రభుత్వాల హయాంలోనే 2022లో ప్రారంభమైందని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.1,580 కోట్లకు సంబంధించిన జీవో కూడా అప్పుడే విడుదలైందని వివరించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సైతం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదని స్పష్టం చేశారు. 299 టీఎంసీల నీటి వినియోగానికి కేసీఆర్ సంతకం ఆధారంగానే ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారని ఆరోపించారు. తెలంగాణలో పలు ప్రాజెక్టుల భూసేకరణకు సైతం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు.

చెడు విషయాలను చెవిలో చెప్పాలి

కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని, తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తల కోసమే మరోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంచి విషయాలను మైక్‌లో చెప్పాలని, చెడు విషయాలను చెవిలో చెప్పాలని నాయకులకు సూచించారు.



తెలంగాణలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్, వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన పలు పథకాలను సైతం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

కేంద్రం సహకరించకపోయినా సంక్షేమం

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఐకమత్యంతో పనిచేయడం వల్లే గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిందని ఏఐసీసీ ఇన్‌ఛార్జి బీఎం సందీప్‌కుమార్ అన్నారు. అదే స్ఫూర్తితో ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లోనూ విజయాలు సాధించామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో కరవు పరిస్థితులు నెలకొన్నప్పటికీ, రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు తగిన సహాయ సహకారాలు అందించడం లేదని విమర్శించారు. కేంద్రం సహకరించకపోయినా ప్రజల అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ శ్రేణులంతా మరింత ఉత్సాహంతో, ఐకమత్యంతో పనిచేయాలని సూచించారు. ఎక్కువ స్థానాల్లో విజయం సాధించి భారీ మెజార్టీతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పనితీరు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని అన్నారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీని దేశంలో తిరిగి అధికారంలోకి తీసుకురావడంతోపాటు రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలని సందీప్‌కుమార్ పిలుపునిచ్చారు. సోనియాగాంధీ రచించిన 'బిలాంగింగ్' పుస్తకానికి దేశవ్యాప్తంగా విశేష ప్రాధాన్యత లభించిందని తెలిపారు. సోనియాగాంధీ చేసిన త్యాగాలు, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల బలిదానాలు దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని కాంగ్రెస్ పార్టీ సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు.



పంచాయతీల్లో

ఏకగ్రీవాలకు ప్రోత్సాహం

అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఈ ఏకపక్ష ప్రజాభిప్రాయాన్ని ప్రతిపక్ష వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన విమర్శించారు. పార్టీ ప్రాతిపదికన జరిగిన పోరు ముగిసిందని, ఇక గ్రామాల్లో అభివృద్ధి ధ్యేయంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ అదే విజయస్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. పంచాయతీలు పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయని, కాబట్టి అక్కడ రాజకీయ ఘర్షణలకు తావులేకుండా ఏకగ్రీవాలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామాలు ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక నజరానాలు అభివృద్ధి పనులకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. గతంలో కనీస నజరానా రూ.5 లక్షలుగా ఉంటే దానిని ఇప్పుడు రూ.15 లక్షలకు, గరిష్ఠ నజరానాను రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5 వేల నుంచి 10 వేల మధ్య జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షల ప్రోత్సాహకం అందుతుందని ఆయన గుర్తుచేశారు. గ్రామ స్థాయిలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు తీవ్ర పట్టుదలతో ఉంటారని, అటువంటి చోట్ల నేతలతో సంప్రదింపులు జరపాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. నాయకుల మధ్య పంతాలు, వ్యక్తిగత పట్టింపులకు తావులేకుండా ఐక్యతను ప్రదర్శించాలని సూచించారు. జడ్పీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రత్యర్థి పార్టీ పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని పేర్కొన్న సీఎం, అదే సమయంలో తమ పార్టీలోని నేతలే రెండు వర్గాలుగా విడిపోయి పోటీపడే పరిస్థితి రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ, గ్రామాల సమగ్ర వికాసానికి ఏకగ్రీవాలే మార్గమని ప్రజలను ఒప్పించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

'కాపు'ల అడ్డా.. కరీంనగర్ గడ్డ

ఒకప్పుడు కరీంనగర్ రాజకీయాల్లో ఒకప్పుడు వెలమ నాయకులదే ప్రధాన పాత్ర. కాంగ్రెస్ నుంచి జువ్వాడి చొక్కారావు, ఎంఎస్సార్, ఆనందరావు, టీడీపీ నుంచి దేవేందర్ రావు, జువ్వాడి చంద్రశేఖర్ రావు వంటి నాయకులు రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. 2004లో చివరిసారిగా కాంగ్రెస్ నుంచి ఎంఎస్సార్ విజయం సాధించారు. ఆ తర్వాత 2009 నుంచి కరీంనగర్ ఎమ్మెల్యే స్థానంలో మున్నూరు కాపు నాయకుడైన గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

బీసీల మధ్యే ప్రధాన పోటీ.

తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్‌కు కరీంనగర్ జిల్లాలో విశేష ఆదరణ లభించింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టీడీపీ ప్రభావం తగ్గగా, కాంగ్రెస్ కూడా జిల్లా కేంద్రంలో పుంజుకోలేకపోయింది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన పొన్నం ప్రభాకర్ 2014, 2018 ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి మూడో స్థానానికి పరిమితమయ్యారు. 2023లో హుస్నాబాద్ నుంచి గెలిచి మంత్రి అయ్యారు.

బీఆర్ఎస్–బీజేపీ మధ్యే పోటీ.

2009లో టీడీపీ నుంచి గెలిచిన గంగుల కమలాకర్ ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారు. మరోవైపు బీజేపీ నుంచి బండి సంజయ్ గంగులకు గట్టి పోటీ ఇచ్చారు. 2018, 2023 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. అయితే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా విజయం సాధించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ రెండు పార్టీల మధ్యే ప్రధాన రాజకీయ పోటీ కొనసాగుతుండగా, కాంగ్రెస్ మాత్రం ఎమ్మెల్యే ఎన్నికల్లో మూడో స్థానానికే పరిమితమైంది.

అగ్రస్థానాల్లో మున్నూరు కాపులే.

ప్రస్తుతం కరీంనగర్ రాజకీయాల్లో మున్నూరు కాపు సామాజికవర్గం ప్రాధాన్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్, ఎంపీగా బండి సంజయ్, మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ కొనసాగుతున్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ కూడా ఇదే సామాజికవర్గానికి చెందినవారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గంగుల కమలాకర్, బీజేపీ నుంచి బండి సంజయ్, కాంగ్రెస్ నుంచి పురుమల్ల శ్రీనివాస్ పోటీ చేయడం మరో విశేషం.ఇదే సామాజికవర్గానికి చెందిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్ మంత్రి వర్గ విస్తరణలో ఆయనకు అవకాశం దక్కుతుందనే చర్చ కూడా సాగుతోంది.

2009 నుంచి కాపుల ప్రాబల్యం.

మొత్తంగా చూస్తే.. 2004లో వెలమ నాయకుడైన ఎంఎస్సార్ విజయంతో ముగిసిన రాజకీయ అధ్యాయం తర్వాత 2009 నుంచి మున్నూరు కాపు నాయకుల ప్రాబల్యం కొనసాగుతోంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య పోటీ ఉన్నప్పటికీ, రెండు పార్టీలకు చెందిన కీలక నాయకులు ఒకే సామాజికవర్గానికి చెందినవారే కావడం కరీంనగర్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం. ఒకప్పుడు వెలమల ఆధిపత్యానికి చిరునామాగా ఉన్న కరీంనగర్.. ఇప్పుడు మున్నూరు కాపుల రాజకీయ ప్రాబల్యానికి కేంద్రంగా మారింది.

పాలించడానికా..? తిట్టడానికా?

కేసీఆర్ తప్పులున్నాయి

కేసీఆర్ పదేళ్ల పాలనలో తప్పులు జరగలేదని ఎవరూ చెప్పడం లేదు. కొన్ని సందర్భాలలో కెసిఆర్, కేటీఆర్ తో పాటు ఆ పార్టీ అగ్ర నాయకులు కూడా తమ పాలనలో నూటికి నూరు శాతం మంచి జరిగిందని చెప్పడం లేదంటూ స్వయంగా ఒప్పుకున్నారు. కాళేశ్వరం సహా అనేక అంశాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందే. కానీ మూడేళ్లుగా గత ప్రభుత్వ తప్పులనే పదేపదే ప్రస్తావిస్తూ, కాళేశ్వరం పేరుతో రాజకీయ విమర్శలు కొనసాగిస్తే ప్రజలకు ఒరిగేదేమిటి? గతాన్ని తవ్వడం తప్ప ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్నదేమిటి? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణకు అందించిన కొత్త పాలనా ఫలితాలేమిటి? అనేవి ప్రజలడుగుతున్న ప్రశ్నలు.

గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం మాత్రమే పాలన కాదు. వాటిని సరిదిద్ది మెరుగైన ప్రత్యామ్నాయాన్ని చూపించడమే అసలైన పాలనా సామర్థ్యం. కేసీఆర్ పాలనలో జరిగిన తప్పులను సరిదిద్దుతూనే, తాము ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది.

కాంగ్రెస్‌కు గండం.. బీఆర్ఎస్‌కు అవకాశం.

సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి, ముఖ్యమంత్రి వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో సమన్వయ లోపాలను బయటపెడుతున్నాయి. ఈ పరిణామాలను బీఆర్ఎస్ తనకు అనుకూలంగా మలుచుకుంటోంది. పదేళ్ల పాలనపై వచ్చిన వ్యతిరేకతను అధిగమించాల్సిన కాంగ్రెస్, తన రాజకీయ వ్యవహారశైలితో బీఆర్ఎస్‌కు కొత్త అవకాశాలు కల్పిస్తోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కొన్ని రోజులుగా ప్రతిరోజు సోషల్ మీడియాలో ... నాటి బీఆర్ఎస్ పాలనే నయమనే అభిప్రాయాలు కొందరిలో వ్యక్తమవుతున్నాయంటే అది కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం. గత ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నంత మాత్రాన ప్రస్తుత ప్రభుత్వానికి శాశ్వత ప్రజామోదం లభించినట్లు కాదు. ప్రజలు పోల్చేది గత పాలనను మాత్రమే కాదు.. ప్రస్తుత పాలనను కూడా!

నష్టమెవరికి.. కాంగ్రెస్‌కా? తెలంగాణకా?

ముఖ్యమంత్రి పదవి వ్యక్తిగత ఆధిపత్యాన్ని ప్రదర్శించే వేదిక కాదు. కోట్లాది ప్రజల ఆశలకు ప్రతీక. ప్రతిపక్షాలను మాటలతో ఎదుర్కోవడం కంటే పాలనా ఫలితాలతో సమాధానం చెప్పాలి. సొంత పార్టీ నాయకులను అవమానించడం కంటే ముందు వారి సమస్యలను పరిష్కరించాలి.కాంగ్రెస్‌లో విభేదాలు పెరిగితే రాజకీయంగా ఆ పార్టీ నష్టపోవచ్చు. కానీ పాలన గాడి తప్పితే నష్టపోయేది తెలంగాణ ప్రజలే. హామీల అమలు, ఉద్యోగాల భర్తీ, రైతుల సమస్యలు, అభివృద్ధి, సంక్షేమం.. ఇవే ప్రభుత్వ ప్రాధాన్యతలు కావాలి. అధికారం శాశ్వతం కాదు.. పదవులు శాశ్వతం కాదు. కానీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులు, మాట్లాడిన మాటలే చరిత్రలో నిలిచిపోతాయి. ప్రజలు అధికారమిచ్చింది పాలించడానికి.. తిట్టడానికి కాదని ముఖ్యమంత్రి రేవంత్ గుర్తించాల్సిన అవసరముంది.

షర్మిలను అడ్డుకున్న పోలీసులు

బెంగళూరు , సింగిడి

బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కర్ణాటక పోలీసులు అడ్డుకున

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలెన్నో!



కామారెడ్డి ప్రతినిధి
నవంబర్ 21 సింగిడి)

కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, గాంధారి, లింగంపేట, సదాశివనగర్, మాచారెడ్డి, రాజంపేట, దోమకొండ తదితర మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో రైతులు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో ధాన్యం తూకం, తేమ శాతం, నాణ్యత పరీక్షలు, గన్నీ సంచుల కొరత, రవాణా వంటి అంశాలు రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోతుందనే భయం మరోవైపు వెంటాడుతోంది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ అద్దెలు, రవాణా భారం పెరుగుతుండటంతో రైతులకు ఆర్థికంగా మరింత నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దళారుల జోక్యానికి అడ్డుకట్ట వేయాలి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకునే అవకాశం రైతులకు పూర్తిస్థాయిలో కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి నష్టం జరిగే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.కొనుగోలు కేంద్రాల్లో తూకం పారదర్శకంగా నిర్వహించాలని, నాణ్యత పరీక్షలను నిబంధనల ప్రకారం చేపట్టాలని, రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్నదాతకు అండగా నిలిచేది ఎవరు?

రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర లభించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్న పాలకులు, క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లింగంపేట మండలంలో రైతులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ లేవనెత్తిన ప్రశ్నలు ఇప్పుడు అన్నదాతల ఆవేదనకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర ఎప్పుడు లభిస్తుంది? కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితికి ఎప్పుడు ముగింపు పలుకుతారు? రైతుల కన్నీళ్లు తుడిచే బాధ్యత ఎవరు తీసుకుంటారు? అన్న ప్రశ్నలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. కామారెడ్డి జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై సమగ్ర పరిశీలన చేపట్టాలని, రైతుల సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రతి రైతుకు అందినప్పుడే వ్యవసాయానికి నిజమైన భరోసా లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

కరీంనగర్ వైద్య కళాశాల వసతులపై నేడు సమీక్ష

కరీంనగర్, నవంబర్22(సింగిడి)

ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల, విద్యార్థుల వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సోమవారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు పాల్గొన నున్నారు.వైద్య కళాశాల అసంపూర్తి భవన నిర్మాణ పనుల పూర్తి, విద్యార్థులకు వసతి, రవాణా సదుపాయాల కల్పనపై చర్చించి, పనులను వేగవంతం చేసేందుకు నిర్ణయాలు తీసుకోనున్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను త్వరగా అందుబాటులోకి తెస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వారంరోజుల్లో పంపిణీ చేయాలి



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 22(సింగిడి) :

సిరిసిల్ల పట్టణం లోని శాంతినగర్ లో కట్టిన డబల్ బెడ్ రూమ్ లు వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో డబల్ బెడ్ రూములు అర్హులైన వారికి అందించాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ డబల్ బెడ్ రూములు కట్టి ఐదు సంవత్సరాలు అవుతున్నా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.కట్టిన డబల్ బెడ్రూంలు పంపిణీ చేయకపోవడం వల్ల పాడై పోవడం జరుగుతున్నాయని వారం రోజుల్లో డబల్ బెడ్ రూమ్ లు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో ఇల్లు లేని అర్హులైన నిరుపేదలను తీసుకెళ్లి డబల్ బెడ్ రూమ్ లో ఉంచడం జరుగుతుందని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఇల్లు లేని నిరుపేదల పక్షాన పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజా సమస్యలు పూర్తిగా పట్టించుకోవడం లేదని వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా శాంతినగర్ లో కట్టిన డబల్ బెడ్ రూమ్లు పంపిణీ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు సూర పద్మ, శ్రీరాముల రమేష్,చంద్ర,సిపిఎం పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, సిపిఎం నాయకులు నక్క దేవదాస్,దాసరి రూప,నాయకులు మోర తిరుపతి, నల్ల లావణ్య, నాగుల సత్యనారాయణ, చీకట్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్



కరీంనగర్, నవంబర్22(సింగిడి)

పప్పు దినుసులు సాగు చేసే రైతులకు కనీస మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ అందించేలా చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఈ విధానంపై జిల్లావ్యాప్తంగా ప్రచారం కల్పించాలని, ఇతర సహకార సంఘాలు కూడా అమలు చేసేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ,ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నందున రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. పప్పు దినుసులు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగును ప్రోత్సహించాలని, పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.పశు గ్రాసం కొరత నివారణకు పథకం కింద 200 ఎకరాల్లో పశుగ్రాసం సాగుకు చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల పెంపునకు గ్రామాల్లో ఇంకుడు గుంతలు, పొలాల్లో నీటి కుంటలు, బోర్లకు నీటి పునరుద్ధరణ పనులు చేపట్టాలని, జలసిరి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పథకాలపై రైతులకు అవగాహన కల్పించి, అవసరమైన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ

(కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 22 సింగిడి)

ఎల్లారెడ్డి: నిజాంసాగర్ మాజీ జడ్పీటీసీ ప్రదీప్ మాతృమూర్తి మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి నియోజక వర్గ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాంతో కలిసి ఆదివారం ప్రదీప్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బిక్కనూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పరంధాములు, అఫిజ్ పటేల్, బాలకిషన్, నీల రవి తదితరులు పాల్గొన్నారు.



జైలుకు వెళ్లొచ్చినంత మాత్రాన నేరస్తుడు కాదు!

న్యాయస్థానంలో నేరం నిరూపితమయ్యే వరకు ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉంది నిందితుడిగా మారినంత మాత్రాన నేరస్తుడిగా ముద్ర వేయడం సమంజసం కాదు.. చట్టం ముందు అందరూ సమానమే

కామారెడ్డి ప్రతినిధి
నవంబర్ 21 సింగిడి)



సమాజంలో ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉంది. అయితే, అనుకోని పరిస్థితుల్లోనో, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకుల కారణంగానో కొందరు వ్యక్తులు కేసుల్లో చిక్కుకుంటుంటారు. అటువంటి సందర్భాల్లో పోలీసుల విచారణ అనంతరం కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు వెళ్లాల్సి రావచ్చు. కానీ జైలుకు వెళ్లొచ్చినంత మాత్రాన ఒక వ్యక్తిని నేరస్తుడిగా ముద్ర వేయడం ఎంతవరకు సమంజసం? న్యాయస్థానం తీర్పు వెలువడకముందే సమాజం ఒక వ్యక్తిని దోషిగా నిర్ణయించడం న్యాయవ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధం కాదా?నిందితుడు వేరు.. నేరస్తుడు వేరు!ఒక వ్యక్తిపై కేసు నమోదైనంత మాత్రాన అతడు నేరం చేసినట్లు నిర్ధారణ అయినట్టు కాదు. ఎఫ్ఐఆర్‌లో పేరు ఉండటం, పోలీసులు అరెస్టు చేయడం, కోర్టు రిమాండ్‌కు పంపించడం వంటి పరిణామాలు న్యాయప్రక్రియలో భాగాలు మాత్రమే. నేరానికి సంబంధించిన వాస్తవాలు, సాక్ష్యాధారాలను పరిశీలించి, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం న్యాయస్థానం తీర్పు వెలువరిస్తుంది.అందువల్ల, కేసు నమోదైన వ్యక్తిని నేరస్తుడిగా పిలవడం, అతడిని సమాజంలో చులకనగా చూడటం, అతని కుటుంబాన్ని అవమానించడం వంటి చర్యలు బాధ్యతాయుతమైన సమాజానికి తగవు. చట్టం ముందు నేరం నిరూపితమయ్యే వరకు ప్రతి నిందితుడికీ నిర్దోషిగా పరిగణించబడే హక్కు ఉంటుంది.జైలు నుంచి బయటకు వచ్చినా.. సమాజంలో శిక్ష ఎందుకు?ఒక వ్యక్తి కేసులో రిమాండ్‌కు వెళ్లి తిరిగి బయటకు వచ్చిన తర్వాత అతడిని సమాజం మరోసారి శిక్షించడం ప్రారంభిస్తే, అతడు సాధారణ జీవితాన్ని ఎలా కొనసాగించగలడు? కుటుంబాన్ని పోషించుకోవడం, ఉద్యోగం చేసుకోవడం, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం వంటి బాధ్యతలను ఎలా నిర్వర్తించగలడు?కేసు నమోదైందన్న కారణంతో అతడిని దూరంగా పెట్టడం, అతని పిల్లలను అవమానించడం, కుటుంబ సభ్యులను అనుమానంగా చూడటం వంటి చర్యలు వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీస్తాయి. ఒక వ్యక్తిపై వచ్చిన ఆరోపణలకు అతని కుటుంబం బాధ్యత వహించాల్సిన అవసరం లేదు.తీర్పు వెలువడే వరకు ఓపిక అవసరంన్యాయస్థానంలో విచారణ కొనసాగుతున్న సమయంలో నిందితుడిపై అనేక ఆరోపణలు వినిపించవచ్చు. కానీ ఆరోపణలు నిజమా కాదా అనేది సాక్ష్యాధారాల ఆధారంగా కోర్టు నిర్ణయించాల్సిన విషయం. కేవలం ప్రచారాలు, వదంతులు, వ్యక్తిగత అభిప్రాయాల ఆధారంగా ఒక వ్యక్తి జీవితాన్ని తీర్పు చెప్పడం సరైన పద్ధతి కాదు.అయితే, నేరం నిరూపితమై కోర్టు శిక్ష విధించిన సందర్భంలో చట్టం తన పని తాను చేస్తుంది. అదే సమయంలో, నిర్దోషిగా విడుదలైన వ్యక్తికి సమాజంలో తిరిగి గౌరవంగా జీవించే అవకాశం కల్పించడం కూడా మనందరి బాధ్యత.మార్పుకు అవకాశం ఇవ్వాలిజీవితంలో ప్రతి ఒక్కరికీ తప్పులు జరిగే అవకాశం ఉంది. తప్పు చేసిన వ్యక్తి చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సిందే. కానీ ఒక వ్యక్తి జీవితాంతం నిందితుడిగానే మిగిలిపోవాలా? అతడికి మార్పు చెందే అవకాశం ఉండకూడదా? అనే ప్రశ్నలు సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉంది.వ్యక్తి చేసిన తప్పును విమర్శించడం వేరు.. అతడి వ్యక్తిత్వాన్ని పూర్తిగా తక్కువ చేసి చూడటం వేరు. చట్టాన్ని గౌరవిస్తూ, న్యాయవ్యవస్థపై విశ్వాసంతో, మానవీయ విలువలను కాపాడుతూ వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.సమాజం మారాలి.. ఆలోచనా విధానం మారాలి!జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తిని చూసి అతడు నేరస్తుడని నిర్ణయించుకోవడం కంటే, అతడి కేసులో వాస్తవాలు ఏమిటి? న్యాయస్థానం ఏం చెప్పింది? అనే విషయాలను తెలుసుకోవడం ముఖ్యం. వ్యక్తులపై ముద్రలు వేయడం సులభం.. కానీ ఆ ముద్రను చెరిపివేయడం ఎంతో కష్టం.న్యాయస్థానం తీర్పు వెలువడే వరకు నిందితుడిని నేరస్తుడిగా చూడకూడదు. జైలు నుంచి బయటకు వచ్చిన వ్యక్తికి గౌరవంగా జీవించే అవకాశం ఇవ్వాలి. ఎందుకంటే ఒక వ్యక్తి గతం మాత్రమే అతడి భవిష్యత్తును నిర్ణయించకూడదు. న్యాయం, మానవత్వం, సామాజిక బాధ్యత కలిసినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది.



కామారెడ్డి కరస్పాండెంట్ రవీందర్

మేదరమెట్లలో పేదోళ్ల ఇండ్ల కల కల్లా..

8 ఏళ్ల క్రితం తొలి స్పీకర్ శంకుస్థాపన..
నేటికీ పూర్తికాని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు
సర్పంచ్ అభ్యర్థులకు ఎన్నికల వరంగా మారిన పాడుబడ్డ ఇండ్లు
ఇందిరమ్మ ఇండ్లలో చేర్చాలని ప్రజల డిమాండ్

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 21 (సింగిడి)

స్వరాష్ట్రం సిద్ధించిన తొలి రోజుల్లో తెలంగాణ తొలి శాసనసభాపతిగా ప్రమాణం చేసిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే సిరికొండ మధుసూదనాచారి మొగుళ్ళపల్లి మండలం మేదరమెట్ల గ్రామంలో పేదల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. పేదలందరూ "మాకు ఇండ్లు వస్తున్నాయి" అని సంబరపడ్డారు. కానీ ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. నాటి నుండి నేటి వరకు ఆ ఇండ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. నామమాత్రంగా పిల్లర్లు వేసి వదిలేశారు. నాణ్యత లేని పనులతో కట్టిన గోడలు కూలిపోతున్నాయి. అక్కడికి తెచ్చిన సిమెంట్, ఇనుము, ఇసుక అంతా దొంగల పాలయ్యింది. ఇప్పుడు మిగిలింది కేవలం పాడుబడ్డ గోడలు మాత్రమే. ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పుడు రాజకీయ నాయకులకు వరంగా మారాయి. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల ముందు "నేను సర్పంచ్ గా గెలిస్తే అర్హులైన అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తాను" అని నమ్మబలికి సర్పంచ్ అభ్యర్థులు ఓట్లు దండుకున్నారు. ఎన్నికలొస్తే చాలు ఈ ఇండ్ల పేరు చెప్పి హామీలు ఇవ్వడం, ఎన్నికలు అయిపోయాక మర్చిపోవడం పరిపాటిగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ అసంపూర్తి ఇండ్లు గ్రామానికి పెద్ద సమస్యగా మారాయి. సాయంత్రం అయితే చాలు మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలు చేసేవారికి అడ్డాగా మారాయని మహిళలు, గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆడబిడ్డలు, చిన్న పిల్లలు ఆ దారిలో వెళ్లాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొంది.

ప్రస్తుత భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పందించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాడుబడ్డ ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రద్దు చేసి, వాటి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతున్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చేర్చి, పేదల చిరకాల సొంతింటి కలను నెరవేర్చాలని వేడుకుంటున్నారు. నాటి నుండి నేటి వరకు మేదరమెట్ల గ్రామంపై రాజకీయ వివక్ష కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా రంగపేట ఐకేపీ

రైతులకు తప్పని ఇబ్బందులు
ధాన్యం కుప్పల పక్కనే బీర్ బాటిళ్ల ముక్కలు

మానకొండూర్, నవంబర్22(సింగిడి)



మండల పరిధిలోని రంగపేట గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు కేంద్రం వద్ద మద్యం సేవించి, బీర్ బాటిళ్లను పగలగొట్టి అక్కడే పడిలివెళ్తున్నారని స్థానికులు వాపోతున్నారు.రైతులు ఎంతో కష్టపడి పండించిన వడ్లను ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి కుప్పలుగా పోస్తుండగా, వాటి పక్కనే బీర్ బాటిళ్ల పగిలిన గాజు ముక్కలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో రైతులు, హమాలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాజు ముక్కల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు భయాందోళన చెందుతున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రాత్రి వేళల్లో మద్యం సేవించే వారిపై నిఘా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బోధించు సమీకరించు పోరాడు నినాదంతో ముందుకు..

ఎంపీ గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి ప్రతినిధి,
నవంబర్ 22 (సింగిడి):



ప్రస్తుత సమాజంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రజల గొంతుకను నొక్కేస్తూ నియంతృత్వ పాలన కొనసాగుతోందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలో 'బోధించు – సమీకరించు – పోరాడు' అనే నినాదంతో దళితులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం' 50 ఏళ్ల స్వర్ణోత్సవ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అంతకు ముందు పెద్దపల్లి బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎంపీ వంశీకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, సభ్యులు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.విభజించు – పాలించు కుట్రలను తిప్పికొట్టాలిమహాసభను ఉద్దేశించి ఎంపీ వంశీ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సంఘం సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఏకపక్ష నిర్ణయాలతో పాలన సాగించడం అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. అధికార దాహంతో కొందరు బ్రిటిష్ వారి తరహాలో 'విభజించు – పాలించు' అనే కుట్రపూరిత విధానాన్ని అనుసరిస్తూ, కులాల మధ్య చిచ్చుపెట్టి సమాజాన్ని చీల్చాలని చూస్తున్నారని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ, అవహేళన చేసే రాజకీయాలను ఏమాత్రం సహించేది లేదని, అంబేద్కర్ వాదులం దరూ ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలని కోరారు.రాజ్యాంగాన్ని మార్చేందుకు జరుగుతున్న కుట్రలను ఎదుర్కోవాలంటే దళితుల ఐక్యతే ఏకైక ఆయుధమని ఎంపీ స్పష్టం చేశారు. చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి అందరూ ఒకే తాటిపైకి వచ్చినప్పుడే మన హక్కులను, ఆత్మగౌరవాన్ని కాపాడుకోగలమని పేర్కొన్నారు. విద్య, నిధుల కేటాయింపుల్లో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.నిరుపేద దళితుల విద్యాభివృద్ధి కోసం నాడు కాకా వెంకటస్వామి అంబేద్కర్ విద్యాసంస్థలను స్థాపించారని గుర్తు చేశారు. ఆ కళాశాలల్లో చదువుకున్న ఎంతో మంది నేడు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వంటి ఎందరో మేధావులు ఆ విద్యాసంస్థల నుంచే వచ్చారని కొనియాడారు. దళిత సమాజ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంపీ వంశీకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మేధావులు, యువత, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుడితే రూ.2 వేలు..
ఆపద కుటుంబానికి రూ.5 వేలు

హామీలను చేతల్లో చూపుతున్న సర్పంచ్..
రూటే వేరు!
సొంత నిధులతో నిరుపేదలకు అండగా అనిల్ నాయక్.. ప్రజా సమస్యల పరిష్కారంలోనూ ముందడుగు

గాంధారి, నవంబర్ 22 (సింగిడి):



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎన్నికలకే పరిమితం కాకూడదు.. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే నిజమైన నాయకుడి లక్షణం. ఈ మాటకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు కామారెడ్డి జిల్లా గాంధారి మండలం రామలక్ష్మణపల్లి గ్రామ సర్పంచ్ అనిల్ నాయక్. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తన సొంత నిధులను వెచ్చిస్తూ నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.ఆడపిల్ల పుడితే రూ.2 వేల ఆర్థిక సాయం,గ్రామంలోని నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్ల జన్మిస్తే రూ.2 వేల ఆర్థిక సాయం అందిస్తానని ఎన్నికల సమయంలో అనిల్ నాయక్ హామీ ఇచ్చారు. ఆ హామీని ఆచరణలో పెడుతూ గ్రామంలో ఏ నిరుపేద కుటుంబంలో ఆడపిల్ల పుట్టినా తన సొంత నిధుల నుంచి రూ.2 వేలు అందిస్తున్నారు. ఆడపిల్ల పుట్టిన శుభవార్తను కుటుంబానికి ఆర్థిక భరోసాగా మారుస్తూ తనవంతు సహకారం అందిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో ఎవరైనా మరణిస్తే ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5 వేల ఆర్థిక సాయం అందిస్తానని ఇచ్చిన మాటను కూడా నిలబెట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా తాజాగా గ్రామానికి చెందిన ఓ నిరుపేద వ్యక్తి మరణించడంతో బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

సొంత ఖర్చుతో సేవ

ప్రభుత్వ పథకాలు, నిధులతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా తన సొంత నిధులను వెచ్చించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం సాధారణమే అయినా, ఎన్నికల అనంతరం వాటిని గుర్తుంచుకుని ఆచరణలో పెట్టడం అరుదైన విషయమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఆడపిల్ల జన్మించినప్పుడు కుటుంబానికి సంతోషాన్ని పంచడం, మరణం సంభవించినప్పుడు బాధిత కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడం వంటి కార్యక్రమాలతో అనిల్ నాయక్ గ్రామ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆయన సేవలను చూసి మండలంలోని పలువురు సర్పంచులు, నాయకులు అభినందనలు వ్యక్తం చేస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్య..

గ్రామ ప్రజల వ్యక్తిగత అవసరాలకే పరిమితం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ సర్పంచ్ అనిల్ నాయక్ చొరవ చూపుతున్నారు. కామారెడ్డి నుంచి నల్లమడుగు, గాంధారి మీదుగా రాకపోకలు సాగించే బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నిత్యం వందలాది మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, తిరిగి గ్రామాలకు చేరుకునేందుకు బస్సులపై ఆధారపడుతున్నారు.ఈ సమస్యను ఇటీవల ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్.. బస్సుల సమయపాలన లేకపోవడం వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ముఖ్యంగా ఆధార్ కార్డుకు సంబంధించిన ఉచిత సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్న గ్రామాల ప్రజల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు బస్సుల రాకపోకల విషయంలో చర్యలు తీసుకోవాలని సూచించగా, ఆర్టీసీ యాజమాన్యం కూడా సానుకూలంగా స్పందించి మూడు ట్రిప్పులు నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీంతో వి

ఎడిటోరియల్

Editorial

సత్య సాయి సేవా మార్గం
ప్రపంచానికి మార్గదర్శకం

సత్య సాయిబాబా (నవంబరు 23, 1926 – ఏప్రిల్ 24, 2011) భారతదేశం లోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక గురువు. ఆయన తన జీవిత కాలంలో లక్షలాది మంది భక్తులను ఆకర్షించారు. ప్రేమ, సేవ, శాంతి, సత్యం, ధర్మం వంటి ఆధ్యాత్మిక సూత్రాలను బోధించి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను ప్రారంభించారు.

శ్రీ సత్య సాయిబాబా 1926 నవంబర్ 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పుట్టపర్తి అనే చిన్న గ్రామంలో జన్మించారు. బాల్యంలో ఆయన అసాధారణమైన ఆధ్యాత్మిక సామర్థ్యాలు ప్రదర్శించారు. అనేక భక్తులు ఆయనలో శక్తి ఉందని భావించారు. 14 సంవత్సరాల వయసులో సత్య సాయిబాబా, తాను శిర్డీ సాయిబాబా పునర్జన్మ అని ప్రకటించి, భక్తుల జీవితాలను మారుస్తూ ఆధ్యాత్మిక గురువుగా మారారు.

సత్య సాయిబాబా బోధనల హృదయం ప్రేమ, మానవత్వం, సమానత్వం వంటి విలువల చుట్టూనే తిరుగుతుంది. ఆయన 5 సూత్రాలు సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా సూచించారు.

జీవితంలో నిజాయితీ, సత్యవంతత ముఖ్యమైన ఆధ్యాత్మిక గుణాలని ఆయన బోధించారు. కర్తవ్యాలను నిబద్ధతతో నిర్వహించడం, సమాజం పట్ల న్యాయంగా వ్యవహరించడం అవసరం అని అన్నారు. అంతర్గత ప్రశాంతతను సాధించడం ద్వారా మనిషి నిజమైన ఆనందాన్ని పొందగలడని ఆయన వివరించారు. పాత మతాలు, భిన్నత్వాల కతీతంగా ప్రేమతో జీవించమని సందేశం ఇచ్చారు. ఎలాంటి హింస లేకుండా శాంతియుత జీవితం గడపమని ఆయన కోరారు.
సత్య సాయిబాబా సేవా మార్గం ప్రపంచానికి గొప్ప మార్గదర్శకంగా నిలిచింది.
సత్య సాయిబాబా అనేక విద్యా సంస్థలను స్థాపించారు, అక్కడ నాణ్యమైన విద్యతో పాటు ఆధ్యాత్మిక విలువల్ని బోధిస్తారు. విద్య వ్యాపారం కాకుండా సేవగా ఉండాలని ఆయన స్పష్టంగా చెప్పారు. ఆయన స్థాపించిన సుపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో అత్యాధునిక వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించ బడతాయి. పేదలకు, బాధితులకు ఉచిత చికిత్స అందించడంలో ఈ ఆసుపత్రులు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. సత్య సాయిబాబా ఎన్నో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులు కోట్లాది మందికి మేలు చేకూర్చాయి.
సత్య సాయిబాబా భక్తుల ముందు అనేక అద్భుతాలను ప్రదర్శించారు. విభూతి (పవిత్ర బూడిద) ను చేయి నుంచి ప్రత్యక్షంగా సృష్టించడం, వస్తువులను క్షణాల్లో ఉత్పత్తి చేయడం వంటి అద్భుతాలు ఆయన భక్తులకు విశ్వాసాన్ని కలిగించాయి. ఈ అద్భుతాలు కొందరి విమర్శలకు గురైనా, భక్తులు వాటిని ఆయన ఆధ్యాత్మిక శక్తులుగా భావించారు.

ఆయన బోధనల ద్వారా అనేక మంది జీవిత విధానంలో మార్పు తీసుకువచ్చి సమాజ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఆయన బోధించిన నైతిక విలువలను తమ రోజువారీ జీవితాల్లో ఆచరిస్తున్నారు.

సత్య సాయిబాబా స్థాపించిన సత్య సాయిబాబా ఆర్గనైజేషన్ 100 కంటే ఎక్కువ దేశాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థలు విద్య, ఆరోగ్యం, తాగునీటి సరఫరా వంటి రంగాల్లో ముఖ్యమైన సేవలు అందిస్తున్నాయి.

సత్య సాయిబాబా బోధనలు అన్ని మతాలకు ఒకే తీరున ప్రామాణికతను చూపాయి. ఆయన సందేశం అన్ని మతాల ప్రాథమిక విలువలను అనుసరిస్తూ, మతసామరస్యం మరియు సమానత్వం గురించి చర్చించేది.

సత్య సాయిబాబా తన జీవితకాలంలో పలు విమర్శలను ఎదుర్కొన్నారు. ఆయన చేసే అద్భుతాలను కొందరు మాయా జాలంగా అభివర్ణించారు. ఆయనకు వ్యతిరేకంగా కొన్ని ఆర్థిక అక్రమాల ఆరోపణలు కూడా వచ్చాయి. అయితే, ఆయన భక్తులు ఈ విమర్శలను తోసిపుచ్చి, ఆయనను భగవంతుని అవతారంగా భావిస్తూ తమ విశ్వాసాన్ని కొనసాగించారు. విమర్శలు ఆయన ఆధ్యాత్మిక ప్రభావాన్ని తగ్గించలేక పోయాయి.

2011 ఏప్రిల్ 24న సత్య సాయిబాబా తన భౌతిక దేహాన్ని విడిచారు. ఆయన మరణం భక్తులకు చాలా బాధాకరమైన విషయం. అయితే, ఆయన స్థాపించిన సంస్థలు, ఆశయాలు మరియు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.
సత్య సాయిబాబా జన్మస్థలం పుట్టపర్తి, ఇప్పుడు ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. సాయిబాబా సమాధి దగ్గర అనేక భక్తులు ప్రతిరోజూ ప్రార్థనలు చేస్తూ ఆయన బోధనలను గుర్తు చేసుకుంటారు. విద్యా మరియు ఆరోగ్య సేవలు ఆయన మరణం తర్వాత కూడా ఆయన స్థాపించిన విద్యా, ఆరోగ్య సేవా సంస్థలు ప్రతిభావంతమైన విద్యార్థులకు విద్యను, పేదలకు వైద్య సేవలను అందిస్తున్నాయి.
"మానవ సేవే దేవ సేవ" అన్న ఆయన సందేశం ప్రజల హృదయాల్లో గాఢంగా నిలిచి పోయింది. ఆయన స్థాపించిన సేవా కార్యక్రమాలు ప్రపంచానికి వెలుగునిచ్చే దీపాలుగా కొనసాగు తున్నాయి. సత్య సాయిబాబా జీవితం ఒక ఆదర్శంగా ఉంది. ఆయన చూపించిన మార్గం, బోధనలు ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయి. ఆధ్యాత్మికత, సేవ, ప్రేమ కలిసిన జీవితమే సత్య సాయిబాబా జీవన దర్శనం. ఆయన సేవా భావం మరెన్నో తరాల వరకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494



అపర అన్నవరం...
మరో శబరి మల

22 నుండి గూడెం సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర

"శ్రీ రత్నగిరీశాయ గౌతమీ తీరవాసినే, ఆదినారాయణాయ శ్రీసత్య దేవాయ మంగళమ్", తెలంగాణ ప్రాంతంలోనే అరుదైనదై, పవిత్ర గోదావరి నదీ తీరాన గుట్టపై వెలసి, సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి 11కిలో మీటర్ల దూరాన మంచిర్యాల జిల్లా సరిహద్దున దండేపెల్లి మండలం గూడెం వద్ద భక్తుల పాలిటి వరదునిగా వాసి కెక్కిన సర్వజన బాంధవుడైన గూడెం రమా సహిత సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర వేడుకలు నవంబర్ 22 నుండి అత్యంత వైభవంగా జరుగ నున్నాయి.

పూర్వము గూడెం గ్రామ వాస్తవ్యుడైన శ్రీ గోపర్ధన పెరుమాండ్ల స్వామి అనే చాత్తాద శ్రీ వైష్ణవునికి శ్రీ స్వామి, స్వప్న దర్శనం గావించి, మీగ్రామ శివారు రాట్నపు చెవులు కొండపై వెలిశాను అని చెప్పారట. అది స్వప్నమే కదా! అని విశ్వసించక మిన్నకుండి నాడట. కాని మరునాడు స్వప్నములో మళ్ళీ స్వామి రావడంతో... పెరుమాండ్ల స్వామి కొండ ఎక్కి స్వామి వెలిసిన చోటు కోసం వెతక నారంభించి తిరిగి తిరిగి ఎంత వెతికినా 'జాడ తెలియక పోవడంతో సాయంత్రం ఇంటి కేగి నిద్రకు ఉపక్రమించగా, నీవుండే జాడ తెలుసుకునేంత జ్ఞానము నాకెక్కడిది స్వామి? నన్ను మన్నించి దర్శనమివ్వు! అని మనసులో తలచుకొని నిద్రించడం జరిగింది. ఆ రాత్రి స్వప్నములో స్వామి అగుపించి ఆ కనపడుతున్న అదే రాట్నపు చెవుల కొండపై ఒక చిన్ననీటి కొలను (సారితే) దానికి దగ్గరగా ఉత్తర దిశలో ఉన్న గుహలో నేనున్నాను అని చెప్పి అదృశ్యమైనాడు. తెల్ల వారగానే ఆతృత పట్ట జాలక కొండపై వేగి కలలో అగుపించిన గుహలో వెదికితే, గుహలో చిన్న విగ్రహం దర్శన మిచ్చింది. విగ్రహాన్ని వెంటనే పెరుమాళ్లు పరుగున వెళ్ళి గోదావరిలో శుచిగా స్నానమాచరించి పూజా ద్రవ్యాలతో కొండ చేరుకొని విగ్రహమున్నచోట శుభ్రపరచి స్వామివారికి అభిషేకాదులు, పూజలు జరిపి నైవేద్యం పెట్టగా, విషయం తెలుసుకున్న. గ్రామ ప్రజలు కొండను చేరుకొని స్వామి దర్శనం చేసుకున్నారు. దైవ ప్రభావము చేత వారి కోరికలన్నియు తీరాయట. ఇలా కొండ పై దేవుడు వెలిశాడన్న వార్త ఊరూరా పాకి అందరూ దర్శనానికి రావడం మొక్కడము భక్తుల కోర్కెలు తీరడము, పెరుమాండ్లు ప్రతి రోజు స్వామి వారికి పూజాధికాలు, నిర్వహించడము ద్వారా స్వామి మహత్యము తొందరలో అందరికి తెలిసిపోవడము జరిగింది.



రోజులు గడిచిన కొలది శ్రీ పెరుమాండ్లు స్వామి ఆలోచించి శ్రీ సత్యనారాయణ స్వామి, రమాదేవి విగ్రహాలు పెద్దవి చేయించి భక్తుల సహకారముతో ఆలయ నిర్మాణము గావించి శ్రీ క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి (1964) లో విగ్రహ ప్రతిష్ట చేశారు. కొండ పైకి వెళ్ళుటకై దారి, మంచి నీటి బావి త్రవ్వించారు. నాటి నుండి అసంఖ్యాక భక్తుల కోర్కెలు తీర్చుతూ శ్రీ స్వామి వారు నిత్య వినూత్న కళలతో వెలుగొందు చున్నాడు. ఈ దేవాలయము తెలంగాణలో ఎంతో ప్రసిద్ధి గాంచిన ఏకైక శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయము.

కొండకు దాదాపు 1.కి.మీ. దూరాన పరమ పవిత్రమైన గోదావరి నది ప్రవహిస్తున్నది. భక్తులు అందు స్నానమాచరించి శ్రీ స్వామి వారిని దర్శించుకొనుట పరిపాటి. ఈ దేవస్థానములో ఎక్కువ సంఖ్యలో శ్రీ స్వామి వారి ప్రతమును చేసుకుంటారు. కుంకుమార్చనలు, అష్టోత్తరములు, అభిషేకము, హారతులు, ఇత్యాది అర్చనలు చేయించుకొని భక్తులు భగవదనుగ్రహ పాత్రులు అవుతున్నారు.

గోదావరి తీరాన ఒక గుట్టపై సత్యనారాయణ స్వామి, అదే ప్రాంతంలో పక్కన ఎత్తైన ప్రదేశంలో అయ్యప్ప స్వామి వెలసి, తెలంగాణలో అపర అన్నవరంగా, మరో శబరిమలైగా పెరిన్నకగన్న గూడెం గుట్ట విశేష ప్రాధాన్యత కలిగి ఉంది.

ఈ నెల 22నుండి 24వరకు కార్తీక పౌర్ణమి జాతర నిర్వహణకై దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, అర్చకులు, కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణకై తగు ఏర్పాట్లు గావిస్తున్నారు.

మారహిత శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీన విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనము, అంకురారోపణము, అగ్ని ప్రతిష్ఠ, నిత్య హవనము, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, గోధూళిక సమూహూర్తమున తులసీ కల్యాణం, 23న నిత్య హవనము, బలిహరణము, 24న కార్తీక పౌర్ణమి రోజున నిత్య హవనం, బలిహరణం, మహా పూర్ణాహుతి, యజ్ఞ పరి సమాప్తి, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ తదితర ఉత్సవ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులు నడప నున్నారని ఈఓ శ్రీనివాస్ సంకటాల వివరించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల. సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

పుట్టెడు శోకం

మట్టి మనుషులు ఇప్పుడు మస్తు గోస పడ్తాండ్రు
ఏ తనువును తాకినా కన్నీటి సాగరాలే ఉప్పొంగుతున్నాయి
ఏ గుండెను తడిమినా గాయాల వీణలై మోగుతున్నాయి
ఏ కర్షకున్ని కదిలించినా పుట్టెడు శోకమై
పలకరిస్తున్నాయి

ఎల్ నినో దెబ్బకు పచ్చటి పైరు కండ్ల ముందే కందిపోతాంటే
కట్టుకున్న ఆశలు దూది పింజల్లా ఎగిరిపోతున్నాయి
చినుకు లేక కునుకు రాక రైతన్న
ఇప్పుడు బగ్గ రంది పడ్తాండ్రు
మట్టిని నమ్ముకున్న మనిషి ఇప్పుడు
మనాది తోటి మంచాన పడ్తాండు

ముఖం చాటేసిన మేఘం తోటి వరి చేను
కుతికలలొచ్చి నిలువునా కూలబడ్తాంటే
రైతన్న గుండెలు నెర్రబారిన నేలలవుతున్నాయి
పాలకొచ్చిన మక్కచేను మాడిపోతాంటే

రైతన్న తనువులు తగలబడుతున్నాయి
పత్తి చేను నిలువునా వక్కిపోతాంటే
రైతన్న ప్రాణం అంపశయ్యపై ఆవిరైతాంది

ఓట్ల కోసం పాట్లు పడే ఏలికలు
కర్షకుల కోసం కాపిశ్శడైనా కనికరం చూపిస్తలేదు
రైతన్నను కరువు నీడలా వెంటాడుతుంటే
ఏలికలు నిట్టాడై నిలబడకుండా
నీటిపై అబద్ధపు రాతలు రాస్తున్నారు
బండెడు బాధల్లో ఉన్న రైతన్నకు
ధైర్యపు లేపనాలను రాయకుండా
పేర్చుకున్న కాసుల్లో కునుకు తీస్తున్నారు

రైతన్న జీవితం ఎప్పుడూ ఎండమావే
ఎగుసం ఎప్పుడూ జూదపు గవ్వలే
రైతన్న జీవితం ఎప్పుడూ తెగిన ముప్వలే

తాటిపాముల రమేష్ (తార)
7981566031

జగమెరిగిన శాస్త్రవేత్త జగదీశ్ చంద్ర

నవంబర్ 23.. జగదీశ్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా

మన దేశ ఔన్నత్యాన్ని విదేశాలకు చాటి చెప్పిన మేటి శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్. రేడియో విజ్ఞానంలో పితామహునిగా పేర్కొంటారు. ఒక అసాధారణ వ్యక్తి. భౌతిక శాస్త్రవేత్తగా, జీవ శాస్త్రవేత్తగా, జీవ భౌతిక శాస్త్రవేత్తగా, వృక్ష శాస్త్రవేత్తగా, పురావస్తు శాస్త్రవేత్తగా జగద్విఖ్యాతి పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి, విజ్ఞానఅఖని బోస్. సైన్స్ ఫిక్షన్లను కూడా రచయిత కూడా. రేడియో, మైక్రోవేవ్ ఆప్టిక్స్ తో వృక్షశాస్త్రంలో గణనీయ ఫలితాల్ని సాధించిన బోస్ 1904లో అమెరికా నుంచి పేటెంట్ హక్కులు పొందిన తొలి శాస్త్రవేత్త, 1858 నవంబర్ 30న బెంగాల్ ప్రావిన్స్ (నేటి బంగ్లాదేశ్)లోని మున్సిగంజ్ లో 1858 నవంబర్ 30 న బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్‌లో ప్రభుత్వంలో అసిస్టెంట్ కమిషనర్, బ్రహ్మ సమాజ్ సభ్యుడు భగవాన్ చంద్రబోస్‌కు ఆయన జన్మించాడు. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా పెరిగిన అతని తండ్రి ఇంగ్లీష్ నేర్చుకునే ముందు బెంగాలీ నేర్చుకోవాలని అనుకున్నాడు. అతను ఒక స్థానిక పాఠశాలలో చదివాడు, అక్కడ అతని క్లాస్‌మేట్స్ విభిన్న వర్గాలు మరియు మతాలకు చెందినవారు. అతను కలకత్తాలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో చేరాడు. అక్కడ జెస్యూట్ పూజారి ఫాదర్ యూజీన్ లాఫాంట్ ద్వారా సహజ శాస్త్రాలపై ఆసక్తిని పెంచు కున్నాడు. ప్రాథమిక విద్య సమయంలో బోస్ వద్ద – ముస్లిం నౌఖరు కుమారుడు కుడివైపున, మత్స్య కార్మికుని కుమారుడు ఎడమ వైపున కూర్చునే వారు. వారు చెప్పే పశు పక్ష్యాదుల కథలను బోస్ శ్రద్ధగా వినేవాడు. ప్రకృతిలోని జీవాలపై పరిశోధనాసక్తి కలగడానికి తన స్నేహితుల కథలే అంకురార్పణ చేశాయని ఆయన చెప్పేవారు.

కలకత్తాలోని సెయింట్ జేవియర్ కళాశాల నుండి డిగ్రీ పూర్తి చేసి, వైద్య విద్య అభ్యసించేందుకు ఆయన లండన్ వెళ్లాడు. ఆరోగ్యం సహకరించని కారణంగా అక్కడ విద్యాభ్యాసం కొనసాగించలేక తిరిగి భారత దేశానికి చేరు కొ న్నారు. తర్వాత బోస్ ఇంగ్లాండ్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయాలని అనుకున్నాడు. కాని మనసు మార్చుకుని తన బావ ఆనందమోహన్ బోస్ సిఫార్సుపై కేంబ్రిడ్జ్‌లో నేచురల్ సైన్స్ చదివాడు. అక్కడ ఆయనకు ప్రముఖ ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్ డార్విన్, జేమ్స్ దేవర్ మరియు మైఖేల్ ఫోస్టర్ బోధించాడు. ఆయన ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో, ప్రఫుల్లా చంద్రరేతో స్నేహం చేశాడు. తరువాత ఆయన రసాయన శాస్త్రవేత్తగా కీర్తిని పొందాడు.



కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతికశాస్త్ర ఆచార్యునిగా చేరాడు. జాతి వివక్ష పరాకాష్ఠకు చేరిన ఆ విద్యాసంస్థలో తన ఉద్యోగంలో జాత్యహంకారాన్ని ఎదుర్కొన్నాడు, అయన జీతం బ్రిటిష్ సహచరుల కంటే చాలా తక్కువ. బోస్ మూడేళ్లపాటు జీతం తీసుకోకుండా బోధించడం ద్వారా నిరసన తెలుపుతూ, తగినన్ని సౌకర్యాలు ఆర్థిక సాయం అందకున్నప్పటికీ పట్టుదలతో పరిశోధనలను కొనసాగించాడు. తరువాత, కళాశాల ఆయన నియామకాన్ని శాశ్వతంగా రద్దు చేసింది. జీతం బకాయిలను చెల్లించింది. 1917 లో, కలకత్తాలో బోస్ ఇన్స్టిట్యూట్ను స్థాపించాడు. అక్కడ శాస్త్రవేత్తలు మొక్కలపై పరిశోధనలు జరిపారు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్ధవాహక జంక్షన్లను మొట్టమొదటి సారిగా వాడిన బోస్ వైర్లెస్ సిగ్నలింగ్ పరిశోధనలో అత్యద్భుత ప్రగతిని సాధించ గలిగాడు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్ధవాహక జంక్షన్ లను మొట్టమొదటి సారిగా వాడింది బోసే. 1901 లో రాయల్ సొసైటీ ఆఫ్ లండన్‌లో బోస్ నిర్వహించిన ఒక ప్రసిద్ధ ప్రయోగం, మనుషుల మాదిరిగానే మొక్కలకు కూడా భావాలు ఉన్నాయని తేలింది. ఆయన ఒక మొక్కను బ్రోమైడ్ ద్రావణాన్ని కలిగి ఉన్న పాత్రలో ఉంచాడు, ఇది విషపూరిత మైనది. తన పరికరాన్ని ఉపయోగించి, మొక్క విషానికి ఎలా స్పందిస్తుందో తెరపై చూపించాడు. తెరపై వేగంగా, కదలికను చూడగా, అది చివరికి చనిపోయింది. ఒక జంతువును విషంలో ఉంచితే ఇలాంటిదే జరిగి ఉండేది. విషం కారణంగా మొక్క చనిపోయింది. బోస్ తన ఇన్స్ట్రుమెంట్ ను క్రెస్కోగ్రాఫ్ అని పిలిచాడు. మరిన్ని ప్రయోగాలు చేశాడు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది శాస్త్రవేత్తలు ఆయన కనుగొన్న వాటిని ప్రశంసించారు.

వ్యాపార దృష్టి ఏ మాత్రం లేని బోస్ తన పరిశోధనలను ఇతర శాస్త్రవేత్తలు వినియోగించుకుని, వాటి ఆధారంగా మరిన్ని కొత్త ఆవిష్కరణలు జరగాలనే సదుద్దేశంతో తన పరిశోధనలను బహిర్గత పరిచాడు. ప్రధానంగా తాను కను గొన్న క్రెస్కోగ్రాఫ్ సాయంతో వివిధ పరిస్థితులలో మొక్కల స్పందనను పరి శోధనాత్మకంగా నిరూపించాడు. జంతువుల, వృక్షాల కణజాలాలలో సమాంతర పరిశోధనలు చేసి ఉపయోగ కరమైన ఫలితాలు సాధించాడు. రేడియో తరంగాలను గుర్తించడానికి ఉపయోగించే కోహెరర్ అనే పరికరాన్ని మెరుగు పరిచాడు. 1887 లో, బ్రహ్మ సమాజ్ సంస్కర్త దుర్గా మోహన్ దాస్ కుమార్తె అబాలాను వివాహం చేసుకున్నాడు. 1896 లో, రేడియో తరంగాలపై పరిశోధన చేస్తున్న గుగ్లిఎల్మో మార్కోనిని కలిశాడు. జగదీష్ చంద్రబోస్ వైర్‌లెస్ టెలిగ్రాఫీని కనుగొన్నాడు. 1895 లో ప్రదర్శనను కూడా నిర్వహించాడు, కాని ఆయన పేటెంట్ కోసం దాఖలు చేయలేదు. మరోవైపు ఇటాలియన్ శాస్త్రవేత్త గుగ్లిఎల్మో మార్కోనీ 1897 లో బోస్ ప్రదర్శన తరువాత రెండు సంవత్సరాల అనంతరం ఇదే విధమైన ప్రదర్శన చేసాడు, కాని మార్కోని 1896 లో పేటెంట్ కోసం దాఖలు చేశాడు. కాబట్టి, బోస్ ఈ రంగంలో మార్గదర్శక పని చేసినప్పటికీ, మార్కోనీ ఈ ఆవిష్కరణకు ఘనత పొందాడు.
1937 నవంబర్ 23న తన 78వ ఏట బోస్ అవిభక్త భారతావని లోని బెంగాల్ ప్రావిన్స్ లోని నేటి జార్ఖండ్‌లోని గిరిడీలో కన్ను మూశాడు. బోస్ మరణించిన 80 సంవత్సరాల అనంతరం కూడా ఆయన చేసిన కృషి అందించిన గణనీయ సేవలు, సాధించిన ఫలితాలను ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది అనునిత్యం గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

జాబ్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సమావేశం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 22 (సింగిడి):



సిరిసిల్ల పట్టణం జిల్లా జాబ్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జాబ్‌సోర్సింగ్ జేఏసీ చైర్మన్ పులి లక్ష్మయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర మున్సిపల్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన తాళ్లపల్లి అంజా గౌడ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన బొల్లి రమేష్ అధ్యక్షులు వేముల లక్ష్మి రాజాం జిల్లా జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది.జాబ్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధన, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి, కార్యవర్గ సభ్యుల అభిప్రాయాలు, సూచనల మేరకు పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

జాబ్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు
ఉద్యోగ గుర్తింపు హక్కులు

1. ప్రతి ఉద్యోగికి నియామక పత్రం, గుర్తింపు కార్డు అందించాలి. సర్వీస్ సర్టిఫికెట్, అనుభవ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి. ఉద్యోగుల సర్వీసును అధికారికంగా గుర్తించి నమోదు చేయాలి. 2. ఉద్యోగుల సంక్షేమం. ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత కల్పించాలి. ప్రసూతి ప్రయోజనాలు, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలి. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలి. 3.అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం. వైద్య ఆరోగ్య శాఖ: పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ, ల్యాబ్ సిబ్బందిపై అధిక పనిభారం తగ్గించాలి. తగిన వేతనాలు, భద్రత కల్పించాలి. మున్సిపల్ శాఖ: పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు, ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత కల్పించాలి. ఇరిగేషన్ , ఇతర ఫీల్డ్ శాఖలు: గ్రామస్థాయి సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నప్పుడు తగిన గుర్తింపు, వేతనాలు, ప్రయాణ ఖర్చులు కల్పించాలి. అటవీ శాఖ: ఫారెస్ట్ వాచర్లు, ఫీల్డ్ సిబ్బందికి ప్రమాద భద్రత, రక్షణ పరికరాలు, బీమా కల్పించాలి. సంక్షేమ శాఖలు: హాస్టళ్లు, గురుకులాలు, వసతి గృహాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పని గంటలు, వేతనాలు, సెలవులు, ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇతర ఫీల్డ్ సిబ్బంది: క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రయాణ భత్యం, పని భద్రత, గుర్తింపు, న్యాయమైన వేతనాలు కల్పించాలి. 4. IFMS సమస్యల పరిష్కారం అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు ఉన్నప్పటికీ పేర్లు నమోదు కాని ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. 5. న్యాయమైన వేతన విధానంకే రకమైన పని చేస్తున్న ఉద్యోగులకు సమానమైన పనికి తగిన న్యాయమైన వేతన విధానం అమలు చేయాలి. 6. ఉద్యోగ భద్రత మరియు సర్వీస్ గుర్తింపు10, 15 సంవత్సరాలుగా నిరంతరంగా పనిచేస్తున్న జాబ్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణకు చట్టబద్ధమైన విధానం రూపొందించాలి. 7. ఏజెన్సీ వ్యవస్థలో పారదర్శకతఏజెన్సీల ద్వారా జీతాల చెల్లింపుల్లో జరుగుతున్న కోతలు, జాప్యాలు, అక్రమాలను అరికట్టేందుకు పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఏజెన్సీ వ్యవస్థ నుంచి ఉద్యోగులకు విముక్తి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. 8. జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీప్రతి జిల్లాలో జాబ్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలి.మన ఆవేదన మన పోరాటంప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తూ ఎండైనా, వానైనా, పగలైనా, రాత్రైనా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నది జాబ్‌సోర్సింగ్ ఉద్యోగులే.కానీ దురదృష్టవశాత్తు మనం చేస్తున్న పనికి తగిన గుర్తింపు రావడం లేదు.

బాధ్యతలు పెద్దవి..జీతాలు చిన్నవి

పని ఒత్తిడి ఎక్కువ ఉద్యోగ భద్రత తక్కువ.ఒక ఉద్యోగి తన జీవితంలో పది సంవత్సరాలు, 15 సంవత్సరాలు ప్రభుత్వ శాఖల్లో పనిచేసినా, అతని భవిష్యత్తుకు ఎలాంటి భరోసా లేకపోవడం అత్యంత బాధాకరం.మన కుటుంబాలను పోషించుకుంటూ, ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ప్రభుత్వ వ్యవస్థలో కీలకమైన సేవలు అందిస్తున్నాం. అయినప్పటికీ మన హక్కుల కోసం ఇంకా పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకే మనం కోరుతున్నది దానం కాదు. మన శ్రమకు తగిన న్యాయం, మన కుటుంబాలకు భద్రత, మన జీవితాలకు గౌరవం. పని మాది బాధ్యత మాది గౌరవం కూడా మాకే కావాలి. ఏజెన్సీ విముక్తి ఉద్యోగ భద్రత మా హక్కు. మన ఐక్యతే మన బలం మన హక్కులే మన లక్ష్యం.

వేముల లక్ష్మి రాజాం అధ్యక్షులు
రాజన్న సిరిసిల్ల జిల్లా
జాబ్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ

పెద్దపల్లిలో శబరిమల సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆపాలి

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 22 (సింగిడి):

శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల ప్రయాణ కష్టాలను తీర్చేందుకు పెద్దపల్లి జంక్షన్‌లో అదనపు రైలు హాల్ట్లు కల్పించాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ గడ్డం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ప్రతి ఏటా మకరవిళక్కు, మండల పూజల సీజన్‌లో పెద్దపల్లి నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది అయ్యప్ప మాలధారులు కేరళలోని శబరిమల యాత్రకు తరలివెళ్తుంటారని ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు. శబరిమల చేరుకోవడానికి కీలకమైన చెంగన్నూర్, తిరువల్ల, కొట్టాయం స్టేషన్లకు నేరుగా వెళ్లే రైళ్లకు పెద్దపల్లిలో స్టాప్ లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అదనపు ప్రయాణ భారంతో పాటు ఆర్థికంగానూ నష్టపోతున్నారని వివరించారు.భక్తుల సౌకర్యార్థం పెద్దపల్లి జంక్షన్మీదుగా వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్ (12626), హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ (16318), కోర్బా–తిరువనంతపురం నార్త్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22647) రైళ్లకు తక్షణమే హాల్ట్ మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి, రైల్వే బోర్డు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మంత్రికి ఎంపీ వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

‘పూలే’ చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేయాలి



కరీంనగర్, నవంబర్22(సింగిడి)

మహాత్మా జ్యోతిబా పూలే జీవిత చరిత్ర, సామాజిక పోరాటాల ఆధారంగా రూపొందించిన ‘పూలే’ చిత్రాన్ని ప్రజలంతా ఆదరించాలని నిర్మాత డాక్టర్ పొన్నం రవిచంద్ర కోరారు. ఈ నెల 27న తెలంగాణలో విడుదల కానున్న ఈ చిత్రం మహిళలు, దళితులు, బహుజనులు, విద్యార్థులకు పూలే ఆశయాలు, పోరాట చరిత్రను తెలుసుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు.కరీంనగర్ ఫిలిం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పూలే చేసిన పోరాటం, మహిళా విద్య కోసం ఆయన సాగించిన కృషిని ఈ చిత్రంలో చూపించామన్నారు. సామాజిక సంస్కరణలు, బహుజన ఉద్యమాలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఈ చిత్రాన్ని చూడాలని కోరారు.ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ, నేటి తరం పూలే చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ కార్యదర్శి లక్ష్మీ గౌతమ్ చిత్ర బృందానికి అభినందనలు తెలిపి, సినిమాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాచకొండ చక్రధర్ రావు, పులి ఆంజనేయులు, రాకేష్, బోనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మైనర్లకు వాహనాలు ఇచ్చినా కఠిన చర్యలు తప్పవు

వేములవాడ నవంబర్ 22 (సింగిడి)

వేములవాడ పట్టణ పరిధిలో కొందరు యువకులు మరియు మైనర్లు తమ ద్విచక్ర వాహనాలు, కార్లకు కంపెనీ ఇచ్చిన ఒరిజినల్ సైలెన్సర్లను తొలగించి, అధిక శబ్దం వచ్చే (మాడిఫైడ్) సైలెన్సర్లను అమర్చుకుని అతి వేగంతో (రాష్ డ్రైవింగ్) తిరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనివల్ల రోడ్లపై వెళ్లే సామాన్య ప్రజలు, వృద్ధులు, చిన్నపిల్లలు మరియు ఆసుపత్రుల వద్ద ఉండే రోగులు తీవ్ర అసౌకర్యానికి, భయభ్రాంతులకు గురవడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ ఎస్ఐ. సముద్రాల రాజు ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం చేసే సైలెన్సర్లు అమర్చిన వాహనాలను, అతివేగంగా నడిపే వారి వాహనాలను గుర్తించి సీజ్ చేయడం జరుగుతోంది.వాహనదారులు మరియు తల్లిదండ్రులకు ముఖ్య సూచనలు: మైనర్ డ్రైవింగ్ నిషేధం డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లకు (18 ఏళ్ల లోపు పిల్లలకు) ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వరాదు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే, మోటార్ వాహన చట్టం ప్రకారం వాహన యజమానిపై (తల్లిదండ్రులపై) కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానాలు మరియు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. అతివేగం పట్టణ రహదారులపై అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుని వాహనాలను సీజ్ చేస్తాము. మాడిఫైడ్ సైలెన్సర్లు: వాహనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చరాదు. ధ్వని కాలుష్యాన్ని కలిగిస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై కేసులు నమోదు చేయబడతాయి. ★ తల్లిదండ్రుల బాధ్యత: తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను మరియు వారి వాహనాల స్థితిగతులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా బాధ్యత వహించాలి.పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ పోలీసు వారికి సహకరించాలని కోరుతున్నాము అని తెలిపారు

దొంగతనం ఆరోపణ.. డబ్బుల ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య!

గాంధారిలో విషాద ఘటన..
22 ఏళ్ల యువకుడి మృతి
దొంగిలించిన వస్తువులు తిరిగి ఇచ్చినా ఆగని ఒత్తిడి? ఘటనపై పోలీసుల విచారణ

(కామారెడ్డిగాంధారి ప్రతినిధి: నవంబర్ 22)

చిన్నపాటి దొంగతనం ఆరోపణ.. ఆ తర్వాత ఎదురైన ఒత్తిడి ఓ యువకుడి ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రం శివారులో వెలుగుచూసింది. దొంగతనం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న యువకుడిని నిలదీయడంతో పాటు, నగదు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారికి చెందిన కొండంగి ప్రకాష్ (22) గత వారం రోజుల క్రితం దుర్గానగర్ కాలనీలోని ఓ ఇంటి ఆవరణలో ఉన్న పాత ఇనుము సామగ్రిని దొంగిలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ సామగ్రిని ఓ పాత ఇనుము దుకాణదారుడికి విక్రయించినట్లు సమాచారం.ఈ విషయం తెలుసుకున్న ఇంటి యజమాని ప్రకాష్‌ను నిలదీశారు. దొంగిలించిన సామగ్రిని తిరిగి తీసుకురావడంతో పాటు అదనంగా నగదు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు పోలీసుల కథనం. ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రకాష్ గాంధారి మండల కేంద్రం శివారులో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ వెల్లడించారు.ఘటనపై విచారణయువకుడి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. చిన్నపాటి దొంగతనం ఆరోపణ నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. అసలు ఏం జరిగింది? యువకుడిపై ఎంత మేరకు ఒత్తిడి వచ్చింది? అనే అంశాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని చట్టప్రకారం పోలీసులకు అప్పగించాల్సి ఉండగా, స్వయంగా ఒత్తిడి చేయడం వల్ల ఇలాంటి విషాద పరిణామాలు చోటుచేసుకోకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన

మనుషులు దగ్గరవుతున్నారా..దూరమవుతున్నారా?

(ఓ మంచి పాడుపు కథ)

రాత్రి రెండు గంటలకు రాఘవ ఫోను మోగింది. అవతల అమ్మ గొంతు వణుకుతోంది. “నాన్నకు గుండెల్లో నొప్పిగా ఉందిరా, ఒళ్లంతా చెమటలు పడుతున్నాయి” అంది.రాఘవ ఉండేది హైదరాబాదులో. అమ్మానాన్న ఉండేది కందుకూరు దగ్గరి పల్లెలో. తను ఇప్పటికిప్పుడు బయలుదేరినా, చేరేసరికి తెల్లారిపోతుంది. ఈలోపు ఎవరో ఒకరు నాన్నను ఆసుపత్రికి తీసుకెళ్లాలి. రాఘవ ఫోనులో పేర్ల జాబితా తెరిచాడు. అందులో పద్దెనిమిది వందల పేర్లున్నాయి. ఫేస్‌బుక్‌లో అతనికి రెండు వేల మంది మిత్రులున్నారు. మొన్న పుట్టినరోజుకు మూడు వందల మంది శుభాకాంక్షలు చెప్పారు.ఆ జాబితాను పైనుంచి కిందికి, కిందినుంచి పైకి జరుపుతూ పోయాడు. ఆఫీసు మిత్రులు, కాలేజీ మిత్రులు, అపార్ట్‌మెంట్ సంఘం సభ్యులు, బీమా ఏజెంట్లు, ఎప్పుడో ఒకసారి కలిసిన బంధువులు అందరూ అందులో ఉన్నారు. కానీ అర్ధరాత్రి నిద్ర లేపి “మా నాన్నను ఆసుపత్రికి తీసుకెళ్లు” అని అడగగలిగిన పేరు ఒక్కటీ అతనికి వెంటనే తట్టలేదు.చివరికి ఆ పని చేసింది ఆ జాబితాలో లేని మనిషి. పక్కింటి సుబ్బారావు గోడ మీదుగా అమ్మ కేక విని, లుంగీ సర్దుకుంటూ పరిగెత్తుకొచ్చాడు. తన ట్రాక్టరు మీద నాన్నను పడుకోబెట్టి కందుకూరు ఆసుపత్రికి చేర్చాడు. సుబ్బారావు దగ్గర స్మార్ట్‌ఫోను లేదు. రాఘవ అతనితో మాట్లాడి పదేళ్లు దాటింది.నాన్న గుండం గడిచింది. కానీ ఆ రాత్రి రాఘవకు ఒక లెక్క మాత్రం తేలలేదు. రెండు వేల మంది మిత్రులున్న తనకు, ఆ రెండు గంటల వేళ ఒక్క మనిషీ ఎందుకు గుర్తుకు రాలేదు?కొద్ది తేడాలతో ఇది మనలో చాలామంది కథ.మనిషి చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఈరోజు మనం ఒకరికొకరం అందుబాటులో ఉన్నాం. అమెరికాలో ఉన్న కొడుకు ముఖం అమ్మకు రోజూ కనబడుతోంది. ముప్పై ఏళ్ల కిందట విడిపోయిన పదో తరగతి మిత్రులంతా ఒక వాట్సాప్ గ్రూపులో మళ్లీ కలిశారు. ఒకప్పుడు పండక్కి పది ఉత్తరాలు రాయడానికి ఒక పూట పట్టేది. ఇప్పుడు వెయ్యి మందికి ఒక్క వేలి నొక్కుతో శుభాకాంక్షలు వెళ్లిపోతున్నాయి. అయినా ఒంటరితనం తగ్గిందా అని అడిగితే చాలామంది జవాబు చెప్పడానికి తడుముకుంటారు. పెద్ద నగరాల్లో మనస్తత్వ నిపుణుల దగ్గరికి వచ్చేవాళ్లలో ఎక్కువమంది చెప్పే మాట “నాతో మాట్లాడేవాళ్లు ఎవరూ లేరు” అనేదేనట. చుట్టూ వందల మంది ఉండి కూడా మనిషికి ఈ మాట అనిపిస్తోందంటే, లోపం సంఖ్యలో లేదు.దీనికి కారణం వెతకడానికి పెద్ద పరిశోధన అక్కర లేదు. అందుబాటులో ఉండటం వేరు, అందగా ఉండటం వేరు. మొదటిదానికి నెట్‌వర్క్ ఉంటే చాలు. రెండోదానికి సమయం కావాలి, ఓపిక కావాలి, తన సుఖాన్ని కొంత వదులుకునే మనసు కావాలి. బ్రిటన్‌కు చెందిన మానవ శాస్త్రవేత్త రాబిన్ డన్‌బార్ ఒక ఆసక్తికరమైన అంచనా వేశాడు. ఒక మనిషి అర్థవంతమైన సంబంధాలను నిలుపుకోగలిగేది సుమారు నూటయాభై మందితోనేనని ఆయన లెక్క. అందులోనూ కష్టం వస్తే పరిగెత్తుకొచ్చే ఆంతరంగికులు అయిదారుగురికి మించరట. మన మెదడుకున్న ఈ పరిమితిని ఏ ఫోనూ మార్చలేదు. ఫోను పెంచింది పరిచయాల సంఖ్యను మాత్రమే. మనం వేల మంది మీద పల్చగా పరుస్తున్న శ్రద్ధ ఎక్కడినుంచో ఊడిపడటం లేదు. ఆ అయిదారుగురికీ దక్కాల్సిన వాటాలోంచే అది పోతోంది.నా చిన్నప్పుడు మా ఊళ్లో ఎవరికైనా జ్వరం వస్తే సాయంత్రానికల్లా వీధంతా ఆ ఇంటి అరుగు మీద చేరేది. ఒకరు కషాయం కాచి తెచ్చేవారు. ఇంకొకరు “డాక్టరు దగ్గరికి బండి కట్టమంటావా?” అని అడిగేవారు. అందులో ప్రేమ ఎంత ఉండేదో, కుతూహలం ఎంత ఉండేదో నేను చెప్పలేను. కానీ మనిషి మాత్రం ఒంటరిగా మిగిలేవాడు కాదు.ఆ దగ్గరితనానికి ఒక వెల కూడా ఉండేదని ఒప్పుకోవాలి. నీ ఇంట్లో ఏ కూర వండారో, నీ కూతురు ఎవరితో మాట్లాడిందో, నీ కొడుక్కి ఎన్ని మార్కులొచ్చాయో ఊరంతటికీ తెలిసేది. ఆ ఊపిరాడనితనం నుంచి తప్పించుకోవడానికి కూడా చాలామంది పట్నం దారి పట్టారు. అపార్ట్‌మెంట్‌లో ఎదురింటివాళ్ల పేరు కూడా తెలియకపోవడం మొదట్లో మనకు స్వేచ్ఛలాగే అనిపించింది. ఆ స్వేచ్ఛకు మరో పేరు ఒంటరితనమని తెలియడానికి రాఘవ లాంటి వాళ్లకు ఒక అర్ధరాత్రి ఫోను రావాల్సి వచ్చింది.అలాగని సాంకేతికతను బోనులో నిలబెట్టడం తేలికే గాని, అది న్యాయం కాదు.మా జిల్లాలోని ఒక ఉన్నత పాఠశాలలో ఎనభైల్లో చదివిన బ్యాచ్ ఒకటి నాకు తెలుసు. వాళ్లలో ఒకతను ఆటో నడుపుతాడు. అతని కూతురికి గుండె ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది. ఆ సంగతి వాళ్ల గ్రూపులో ఒక చిన్న సందేశంగా వచ్చింది. మూడు రోజుల్లో నాలుగు లక్షల రూపాయలు పోగయ్యాయి. డబ్బు పంపినవాళ్లలో సగం మంది అతన్ని ముప్పై ఏళ్లుగా చూడనే లేదు. వాట్సాప్ లేకపోతే ఆ కష్టం ఆ మిత్రుల చెవికి చేరేదే కాదు. ప్రవాసంలో ఉన్న నాలాంటి వాళ్లకు ఈ సంగతి ఇంకా బాగా తెలుసు. ఇరవై ఐదేళ్ల ఏళ్ల కిందట ఇంటికి ఫోను చేయాలంటే కాలింగ్ కార్డు కొని, నిమిషాలు లెక్కపెట్టుకుంటూ మాట్లాడేవాళ్లం. “బాగున్నావా” అంటే “బాగున్నాం” అనడంతో సంభాషణ ముగిసేది. ఇప్పుడు అమ్మ పొయ్యి మీద పప్పుకు తాలింపు వేస్తుంటే ఆ చిటపట వేల మైళ్ల దూరంలో వినబడుతోంది. దూరాన్ని ఇంతగా కరిగించిన సాధనాన్ని పట్టుకుని దూరం పెంచిందని నిందించడం కృతఘ్నత అవుతుంది.అంటే సాధనం ఒకటే. అది కొందరిని దగ్గర చేస్తోంది, కొందరిని దూరం చేస్తోంది. మరి తేడా ఎక్కడుంది?నాకు తోచిన జవాబు ఇది... మనిషిని చేరుకోవడానికి వాడినప్పుడు ఫోను వంతెన అవుతోంది. మనిషిని తప్పించుకోవడానికి వాడినప్పుడు అదే ఫోను గోడ అవుతోంది. పరామర్శకు వెళ్లగలిగిన దూరంలో ఉండి కూడా ఒక పూలగుత్తి బొమ్మ పంపి చేతులు దులుపుకుంటే అది గోడ. పెళ్లికి వెళ్లలేని దూరంలో ఉండి వీడియోలోనైనా అక్షింతలు వేస్తే అది వంతెన. చేతిలో ఉన్న తెర ఒకటే. మనసులో ఉన్న ఉద్దేశమే వేరు.మరో మార్పు కూడా చప్పుడు చేయకుండా జరిగిపోయింది. ఒకప్పుడు సంబంధాలు అవసరం మీద నిలబడేవి. నీ పొలంలో కోతకు నేను వస్తే, నా పొలంలో నాట్లకు నువ్వు రావాలి. పెళ్లి జరగాలంటే పంటపాత్రలు నాలుగిళ్ల నుంచి రావాలి. మనిషికి మనిషి అవసరం ఉండేది కాబట్టి మనస్పర్థలు వచ్చినా మళ్లీ కలిసిపోక తప్పేది కాదు.ఇప్పుడు ఆ అవసరాలన్నిటినీ డబ్బు తీరుస్తోంది. వంటకు క్యాటరింగ్ ఉంది. ఆసుపత్రికి అంబులెన్సు ఉంది. అప్పుకు బ్యాంకు ఉంది. ఎవరి దయ మీదా ఆధారపడకుండా బత కగలగడం చిన్న విషయం కాదు, అది నిజంగా గొప్ప సౌకర్యం. కానీ ఒకరి అవసరం ఒకరికి లేనప్పుడు ఒకరినొకరు కలిసే కారణాలూ తగ్గిపోతాయి. అవసరం తీరిపోయిన చోట అనుబంధం తనంతట తాను నిలబడదు. దాన్ని కావాలని, ప్రయత్నపూర్వకంగా నిలబెట్టుకోవాలి.మనుషుల మధ్య దూరాన్ని కిలోమీటర్లలో కొలిచే రోజులు పోయాయి. పదివేల మైళ్ల దూరంలో ఉన్న కూతురు రోజూ అరగంట మాట్లాడుతూ దగ్గరగా ఉండవచ్చు. పక్క గదిలో ఉన్న కొడుకు నెలల తరబడి దూరంగా ఉండిపోవచ్చు. ఇప్పుడు దూరానికి కొలమానం మనం ఒకరికొకరం ఇచ్చుకునే సమయం, శ్రద్ధ.రాఘవ సంగతికి మళ్లీ వద్దాం. నాన్న ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చాక అతను ఒక పని చేశాడు. సుబ్బారావు ఇంటికి వెళ్లి, అరుగు మీద కూర్చుని గంటసేపు మాట్లాడాడు. పొలం సంగతులు, పిల్లల చదువులు, ఈ ఏడు వానలు అన్నీ మాటల్లో వచ్చాయి. ఆ గంటలో అతను ఒక్కసారి కూడా జేబులోంచి ఫోను తీయలేదు. తిరిగి వస్తుంటే సుబ్బారావు, “అప్పుడప్పుడూ ఇట్లా వస్తుండు నాయనా. మీ నాన్న సంగతి మేం చూసుకుంటాంలే” అన్నాడు.“మేం చూసుకుంటాం” అనే ఆ రెండు మాటల బరువుకు రెండు వేల లైకులు సరితూగవని రాఘవకు ఆ రోజు అర్థమైంది. ఆ మాట ఫోనులో పుట్టేది కాదు. ఏళ్ల తరబడి ఒకే వీధిలో బతికిన బతుకులోంచి, ఒకరి కష్టానికి ఒకరు నిలబడిన జ్ఞాపకాల్లోంచి పుట్టేది.అతను ఇంకో పని కూడా చేశాడు. హైదరాబాదు తిరిగి వెళ్లాక ఎదురింటి తలుపు తట్టి తనను తాను పరిచయం చేసుకున్నాడు. అయిదేళ్లుగా ఒకే అంతస్తులో ఉంటున్నా వాళ్లిద్దరూ ఒకరి పేరు ఒకరు తెలుసుకోవడం అదే మొదటిసారి.మనుషులు దగ్గరవుతున్నారా, దూరమవుతున్నారా అన్న ప్రశ్నకు అందరికీ సరిపోయే ఒకే జవాబు నా దగ్గర లేదు. కానీ ఎవరికి వారు వేసుకోగలిగిన ఒక చిన్న పరీక్ష ఉంది.ఈ రాత్రి రెండు గంటలకు మీకు కష్టం వస్తే మీరు ఎవరికి ఫోను చేస్తారు? అంతకంటే ముఖ్యమైన ప్రశ్న ఇంకొకటుంది. ఈ రాత్రి రెండు గంటలకు ఇంకెవరికైనా కష్టం వస్తే, వాళ్ళు ఫోను చేసే పేర్లలో మీ పేరు ఉంటుందా?



రచన రవీందర్
కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 22 సింగిడి

కవి వైరాగ్యం ప్రభాకర్‌కు ఆకాశవాణి సత్కారం

కరీంనగర్, నవంబర్22(సింగిడి)



కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, విమర్శకుడు, శతాధిక గ్రంథాల ప్రచురణకర్త వైరాగ్యం ప్రభాకర్‌కు ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం ఘనంగా సత్కరించింది.శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం నిర్వహిస్తున్న ‘కవితా కుసుమాలు’ కార్యక్రమంలో ప్రభాకర్ తన కవితలను ఆలపించే అవకాశం పొందారు. ఈ కార్యక్రమం త్వరలో ఆకాశవాణి ద్వారా ప్రసారం కానుంది.ఈ సందర్భంగా కేంద్రం డైరెక్టర్ కొలిపాక శంకర్రావు, కట్ట రామకృష్ణ, స్టేషన్ సిబ్బంది ప్రభాకర్‌ను సత్కరించి, ఆయన సాహిత్య సేవలను అభినందించారు. ఆకాశవాణి వేదికపై కవి తాగానం చేసే అవకాశం లభించడంపై కరీంనగర్‌కు చెందిన కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

సిరిసిల్ల వెంకటమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మానకొండూర్, నవంబర్22(సింగిడి)

మండలం లోని లింగాపూర్ గ్రామానికి చెందిన సిరిసిల్ల పరశురాములు తల్లి సిరిసిల్ల వెంకటమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పరామర్శించారు.ఈ సందర్భంగా వెంకటమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు రవి, రుద్రారం అనిల్ కుమార్, డి. అశోక్, సిరిసిల్ల అనిల్, సిరిసిల్ల అరుణ్ కుమార్, హరికృష్ణతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ మహాపాదయాత్రను విజయవంతం చేయండి

కరీంనగర్, నవంబర్22(సింగిడి)



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న వ్యతిరేక ప్రచారాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర పిలుపునిచ్చారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ అనవసర ఆందోళనలు సృష్టిస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ‘భారత్ సమ్మిట్–2026’లో విదేశీ ప్రతినిధి జియాకోమో ఫిలిబెక్‌తో ‘ఓట్ చోర్.. గద్దీ ఛో

పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠ మహోత్సవం

గద్వాల ప్రతినిధి నవంబర్ 22 (సింగిడి)

జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలోని పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన నూతన అలమేలుమంగా నాయకి సమేత దశావతార విగ్రహాలు, ధ్వజస్తంభం, నవగ్రహాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో జి. రాఘవేంద్ర రెడ్డి, బీచుపల్లి, పటేల్ జనార్దన్ రెడ్డి, ఆంజనేయులు, సోమశేఖర్ రెడ్డి, చక్రిధర్ రెడ్డి, మహాదేవప్ప, జాంపల్లి భరత్ సింహారెడ్డి, శ్రీరాములు, నక్క రవి, కావలి గోపి, నరసింహులు, గోవిందు, మున్నూరు వీరారెడ్డి, రఘు నాయుడు, సుభాష్ రంగారెడ్డి, వెంకటేష్ యాదవ్, రాము, గొనేల స్వామి, యోగేంద్ర, ప్రహ్లాద్, అంజి, జంగిలప్ప, అంపన్న, లక్ష్మన్న, హనుమంతు, ఆంజనేయులు, రవి, పర శురాముడు, రంగస్వామి, తిమ్మప్ప, వీరేష్, రామాంజనేయులు, శంకర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేవెళ్లలో మహిళ దారుణ హత్య

చేవెళ్ల, నవంబర్ 21 (సింగిడి):-

చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరా కాలేజీ ఎదురుగా ఉన్న రేకుల ఇంటి సమీపంలో పద్మ అనే మహిళ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం,భక్తుల గురువులు (45) గత ఎనిమిది నెలలుగా చేవెళ్లలో సెంట్రింగ్ పనులు చేసుకుంటూ నివసిస్తున్నాడు. అతని వద్ద నర్సింహా, అతని భార్య పద్మ (28-30), అలాగే కెతావత్ శివ శంకర్ వరప్రసాద్ నాయక్, శివ కలిసి పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు.తేదీ 20.11.2026న గురువులుకు చెందిన మొబైల్ ఫోన్ కనిపించకపోవడంతో పాటు, అతని బ్యాంకు ఖాతా నుండి రూ.45,000 మరో ఖాతాకు బదిలీ అయినట్లు గుర్తించాడు. దీంతో శివపై అనుమానం వ్యక్తం చేసిన గురువులు, పద్మతో కలిసి తేదీ 21.11.2026న పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. విచారణలో శివ మొబైల్ ఫోన్ తీసుకుని, దాని ద్వారా డబ్బులు బదిలీ చేసినట్లు అంగీకరించి, మొబైల్ ఫోన్ తిరిగి ఇస్తానని చెప్పడంతో ముగ్గురూ తమ నివాస ప్రాంతానికి వెళ్లారు.అక్కడ మొబైల్ ఫోన్ దాచిన ప్రదేశం వద్దకు తీసుకెళ్లిన శివ, తనపై పోలీసులకు అనుమానం వ్యక్తం చేసిన విషయమై గురువులు పద్మతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో గురువులు తన ద్విచక్ర వాహనం తీసుకురావడానికి వెళ్లగా, కొద్దిసేపటి తరువాత తిరిగి వచ్చి చూడగా పద్మ మృతి చెంది ఉంది. నిందితుడు శివ అక్కడి నుండి పరారయ్యాడు.సమాచారం అందుకున్న చేవెళ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కెతావత్ శివ శంకర్ వరప్రసాద్ నాయక్ శివ ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

ఆర్మూర్ పట్టణంలో బాలాజీ లాడ్జిపై పోలీసుల దాడి

ఆర్మూర్, నవంబర్ 22 (సింగిడి) :

ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్మూర్ ఎస్.ఐ. రజనీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు చేశారు. శనివారం సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో జరిగిన ఈ దాడిలో, లాడ్జిలోని రెండు వేర్వేరు గదులలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు పట్టుబడ్డారని ఎస్సై ఆదివారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు.పోలీసుల విచారణలో అశోక్ నగర్‌కు చెందిన దేవరాజు అనే వ్యక్తి 15 రోజుల క్రితమే ఈ లాడ్జిని అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నట్లు తేలిందన్నిరు. ఒక్కొక్కరి నుండి రూ. 400 చొప్పున వసూలు చేస్తూ, గదులను వ్యభిచారానికి అద్దెకు ఇస్తున్నట్లు నిర్వాహకుడు దేవరాజు అంగీకరించాడని ఎస్సై తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి లాడ్జి నిర్వాహకుడు దేవరాజుతో పాటు, విటుడిని పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.

మాట నిలబెట్టుకున్న ఉపసర్పంచ్

ఆర్మూర్, నవంబర్ 22 (సింగిడి) :

71వ, తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన నిజామాబాద్ జిల్లా జట్టు క్రీడాకారుల విద్యార్థులకు ఆదివారం క్రీడల దుస్తులను మోర్తాడ్ గ్రామ సర్పంచ్ భోగ ఆనంద్, గ్రామ ఉపసర్పంచ్ సామ శ్రీనివాస్ అందజేశారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైతే సొంతంగా క్రీడా దుస్తులను అందిస్తానని గ్రామ ఉపసర్పంచ్ సామ శ్రీనివాస్ విద్యార్థులకు మాట ఇచ్చారు. హనుమకొండ జిల్లా కమలాపూర్లో జరిగే 71వ, తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు తన వంతు సహకారంగా క్రీడా దుస్తులను అందించారు. నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, నిర్వాణ కార్యదర్శి. నగేష్, వ్యాయమ ఉపాధ్యాయులు శివ, మహేష్ పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో గీత కార్మికుడికి తీవ్ర గాయాలు..

కల్వకుర్తి నవంబర్ 22 (సింగిడి)

వెల్దండ మండల పరిధిలోని బండోనిపల్లి గ్రామంలో అడవి పంది దాడి ఘటన కలకలం రేపింది. సత్తూరి జంగయ్య గౌడ్ అనే గీత కార్మికుడు అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు కల్లుగీత పనుల నిమిత్తం వెళ్లాడు. సమీప పొలాల్లో ఉన్న అడవి పందిని కొన్ని కుక్కలు వెంబడించాయి. దీంతో భయంతో పరుగులు తీసిన అడవి పంది అటుగా వెళ్తున్న జంగయ్య గౌడ్‌పై ఒక్క సారిగా దాడి చేసింది. అడవి పంది దాడితో జంగయ్య గౌడ్ తీవ్రంగా గాయపడగా, ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. కర్రల సహాయంతో అడవి పందిని అక్కడి నుంచి తరిమివేశారు. అనంతరం గాయపడిన జంగయ్య గౌడ్‌ను 108 అంబులెన్స్ సహాయంతో వెల్దండ సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు

ఆర్మూర్, నవంబర్ 22 (సింగిడి) :

బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండలంలో అభివృద్ధి పనులకు జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క నిధులు విడుదల చేశారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి కృషి ఫలితంగా మెండోరా మండలానికి నిధులు వచ్చాయి. మెండోరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బడాల సాయి రెడ్డి ఆదివారం మాట్లాడుతూ పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.90 లక్షలు , దూదిగాం పంచాయతీ భవన నిర్మాణానికి 30 లక్షలు, కోడిచర్లకు రూ.30 లక్షలు, మెండోరాకు రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయని వారన్నారు. మెండోరా గ్రామ జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో 5 అదనపు గదుల నిర్మాణానికి రూ.75 లక్షలు, జడ్పీహెచ్ఎస్,ఎస్సారెస్పీ లో 3- అదనపు గదుల నిర్మాణానికి రూ.45 లక్షలు, ఎం.పీ.పీ.ఎస్. ఎస్సారెస్పీ – రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ.30 లక్షలు, ఎం.పీ.పీ.ఎస్. ఎస్సారెస్పీ ఉర్దూ మీడియం కు రూ.15 లక్షలు, ఎంపీయూపీఎస్,చాకిర్యాల్ గ్రామంలో రూ.15 లక్షలు, ఎంపీపీఎస్ కోడిచర్ల గ్రామంలో రూ.15 లక్షలు మెండోరా మండలంలో పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల అదనపు గదుల నిర్మాణం కోసం రూ.2.85 కోట్ల నిధులు మంజూరు కావడం పై మెండోరా మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దళితుల భూములకే రక్షణ కరువు.. కాంగ్రెస్‌ది దళిత చైతన్యమా?

దళిత కుటుంబాలకు అన్యాయం చేస్తూ
చైతన్య సభలు నిర్వహించడం విడ్డూరం..
రెడ్డపాకుల శివశంకర్
నాగర్‌కర్నూల్ నవంబర్ 22 (సింగిడి)

దళిత కుటుంబాలకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీ దళిత చైతన్య సభలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని బహుజన నాయకుడు రెడ్డపాకుల శివ శంకర్ విమర్శించారు. తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన వడ్డేమాన్ కృష్ణయ్యకు సంబంధించిన 1.27 గుంటల భూమిని అప్పు పేరుతో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అనుచరుడు నారాయణరెడ్డి అన్యాయంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ తెలకపల్లి మండల బహుజన నాయకులు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడుతూ.. గతంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను చట్టసభల్లోకి రాకుండా చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించిందని, ఎన్నికల్లో ఆయన ఓటమికి కారణమై తీవ్రంగా అవమానించిందని విమర్శించారు. నేడు అదే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, దళితులపై దాడులు జరుగుతున్నా, వారి భూములు కబ్జాకు గురవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా మౌనం పాటిస్తోందని మండిపడ్డారు. మరోవైపు దళిత చైతన్య సభల పేరుతో దళిత సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతోనే వంజ నారాయణరెడ్డి పేరు మీద ఉన్న భూమిని తాళ్లపల్లి గ్రామానికి చెందిన మందునాగుల సుధాకర్ పేరు మీదకు మార్చారని ఆరోపించారు. వడ్డేమాన్ కృష్ణయ్యకు అన్యాయం చేయకపోతే భూమి రికార్డుల్లో పేర్ల మార్పిడి చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. తెలకపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండపల్లి పర్వతాలు స్వగ్రామానికి చెందిన వ్యక్తి పేరు మీదకు భూమిని మార్చడం వెనుక ఉన్న ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తం చేశారు. దళిత కుటుంబానికి చెందిన వడ్డేమాన్ కృష్ణయ్య భూమిని తిరిగి ఆయన పేరుపై నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే అన్ని దళిత సంఘాలను కలుపుకొని మండలంతో



పాటు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బహుజన నాయకులు కొమ్ము రాకేష్, గాలోటి వెంకటయ్య, వడ్డమని శివ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

సిద్దిపేట, నవంబర్ 22 (సింగిడి)

జిల్లా న్యాయ శాఖ ఉద్యోగులకు సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా బోగారి శ్రీహరి ప్రధాన కార్యదర్శిగా సుధీర్ రెడ్డి, కోశాధికారిగా రాకేష్ దేశ్పాండే, గౌరవ అధ్యక్షులుగా హనుమంత రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా శ్రీమతి కరుణ శ్రీ,,ఆర్గనైజింగ్ సెక్రటరీగా పూస వినయ్ కుమార్,ఉపాధ్యక్షులుగా మధుబాబు , శ్రీమతిపద్మ, రాజు, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్ చారి, సుమలత లక్ష్మణ్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు.కార్యవర్గ సభ్యులుగా గోపాల్, శ్రీకాంత్, యాదలక్ష్మి, రవీందర్ లో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల పట్ల నిరంతరం పోరాడుతానని అందరికీ అందుబాటులో ఉండి



సమస్యల పట్ల నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఉద్యోగులకు సొసైటీ ఏర్పాటు గురించి ఇండ్ల స్థలాల ఏర్పాటు గురించి జిల్లా కార్యాలయం గురించి కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వీరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఏ శాఖ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తామని అందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులుగా రమణారావు , నరేష్ యాదవ్ , సుల్తాన్ ఆసిఫ్ ఇక్బాల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ న్యూస్ ఛానళ్ల రిపోర్టర్లకు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి

డిపిఆర్ఓకి టీజేఎఫ్ వినతి
సానుకూలంగా స్పందించిన డీపీఆర్ఓ..
త్వరలోనే కార్డులు మంజూరు చేస్తామని హామీ
ఖమ్మం.ప్రతినిధి నవంబర్21 (సింగిడి)

కేబుల్ న్యూస్ ఛానళ్లలో విధులు నిర్వహిస్తున్న రిపోర్టర్లకు తక్షణమే అక్రెడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు, సమాచార, పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి గౌస్ పాషా ను కోరారు. ఈ మేరకు ఆయన నీ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కేబుల్ న్యూస్ ఛానళ్ల రిపోర్టర్లకు ఇప్పటికే అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసిన విషయాన్ని టీజేఎఫ్ నాయకులు డీపీఆర్ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా జిల్లాల్లో అమలవుతున్న విధానాన్ని పరిగణనలోకి తీసుకుని, తమ జిల్లాలోనూ అర్హత కలిగిన రిపోర్టర్లకు తక్షణమే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. వారితో పాటు శాటిలైట్ చానల్ లో విధులు నిర్వహిస్తున్న రిపోర్టర్ల దర ఖాస్తుల సైతం పెండింగ్‌లో ఉండటంతో సంబంధిత జర్న



లిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.అక్రెడిటేషన్ కార్డుల జారీతో పాటు ఇటీవల అక్రెడిటేషన్ కార్డులు పొందిన ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డులు సైతం తక్షణమే మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు సంబంధించి హెల్త్ కార్డులు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సదుపాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీజేఎఫ్ నాయకులు లేవనెత్తిన అంశాలపై డీపీఆర్ఓ సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న అక్రెడిటేషన్ కార్డుల మంజూరుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీపీఆర్ఓ నీ కలిసిన వారిలో ఎలెక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజనీకాంత్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి , జిల్లా నాయకులు వనం నాగయ్య, శ్రీధర్ శర్మ, కొమెర వెంకటేశ్వర్లు(కెవి), మందా మోహన్, మందుల ఉపేందర్, పిన్నెల్లి శ్రీనివాస్,సతీష్,కూరపాటి నరేష్ , మస్తాన్, ముక్కంటి, పెంటి వెంకటేశ్వర్లు, కిరణ్మయి,సంపత్ కుమార్ నాగ శేఖర్.మధు, శ్రీను,కేబుల్ చానల్ రిపోర్టర్లు నరసింహ, మోహన్, ఉపేందర్, శ్రీనివాస్,రమేష్, నరసింహారావు, అనిల్ కుమార్, లింగయ్య,భద్రం, గోపాల కృష్ణ, ఏ.సతీష్, ప్రభాకర్, మధు, జమలయ్య,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సర్పంచ్
డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి
కల్వకుర్తి నవంబర్ 22 తేదీ (సింగిడి)

తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు చురుకుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ శరణ్య, ఏఎన్ఎం డాక్టర్ విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ నాయకులు, పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ,పిల్లల ఆరోగ్యమే గ్రామ భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు.



ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమంలో మిగిలిపోకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించి, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అలాగే పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వంతో పాటు ప్రజలందరి బాధ్యత అని, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నారులకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో విజయవంతంగా కొనసాగడంతో నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, ఆశా వర్కర్లు తది తరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా 'ఉప్పల'

కల్వకుర్తి నవంబర్ 22 తేదీ (సింగిడి)

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, కష్టకాలంలో వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొంగళ్ళ అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందించారు.అంజమ్మ మృతి చెందిన విషయం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించారు. మృతురాలి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్నవారికి తమ వంతు సహాయం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తూ ఉప్పల వెంకటేష్ చేపడుతున్న సేవా కార్యక్రమాల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్ పార్టీ నాయకులు



ఐలా శేఖర్ గౌడ్, వీరపాకుల నాగరాజు, నరసింహ, శ్రీను, పరుశరామ్, లింగం, మల్లేష్, జంగయ్య, పర్వతాలు, గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాకు ఎస్సై వార్నింగ్

కొల్లాపూర్ నవంబర్ 22 తేదీ (సింగిడి)

కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండల పరిధిలో ఉన్న గ్రామాలలో యువతి యువకులు మత్తు పదార్థాలకు చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్న యువతి యువకులపై పెంట్లవెల్లి మండలం పోలీస్ శాఖ కన్నేసింది. ఎస్సై పవన్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ అలవాటు పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. గ్రామాలలో వీధుల వెంబడి హోటల్ పాను డబ్బా బావి చెరువు పొలాల దగ్గర విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థి చదువుకునే వయసులో చెడు వ్యసనాలకు బానిసగా మారుతున్న యువతను గ్రామాలలో తల్లిదండ్రులు కూడా పట్టించుకోవాలి. యువత ఒక్కసారి ఆలోచన చేయండి మీ ఇంటి దగ్గర అమ్మానాన్న తమ్ముళ్లు చెల్లెలు ఉన్నారు వారి భవిష్యత్తు నీ చేతులో ఉన్నదని మరిచిపోవద్దు. బాగా పట్టుదలతో గమ్యం వైపు నడిచి లక్ష్యం వైపు చేరుకోవాలి అంటే మీరు బాగా చదవాలి అప్పుడే భవిష్యత్తు



లో డాక్టరు, లాయర్ , ఇంజనీరు కలెక్టర్, పోలీస్ అవుతారు. తల్లి దండ్రుల కలలకు ప్రతిఫలం లభిస్తుంది. డ్రగ్స్ విక్రయించే సరఫరా చేసే వారు ఎంతటి వారైనా ఆ ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. డ్రగ్స్ సరఫరా వినియోగానికి ఉపయోగించే ప్రాంతాల ప్రదేశాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరంగా స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, మొబైల్ ఫోన్ స్నాచింగ్, కూడా పదేపదే నేరాలకు పాల్పడే వారిపై కఠినమైన శిక్షలు ఉంటాయని , ఎన్డీపీఎస్ చట్టంలోని కఠిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు గ్రామాలలో పోలీసులతో ఫ్రెండ్లీగా ఉంటూ సమాజానికి చెడు చేసే వారి పై ముందస్తు సమాచారాన్ని అందించాలని సూచించారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

కల్వకుర్తి నవంబర్ 22 తేదీ (సింగిడి)

గ్రామీణ ప్రాంత యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి, వారిని ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా కల్వకుర్తి పట్టణంలో ఐకృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 'సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీ' డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో శిక్షణ కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను ఐకృత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు.కల్వకుర్తి పట్టణంలోని తాహ సిల్వార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న పాత కృష్ణవేణి జూనియర్ కళాశాల భవనంలో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న ఉచిత ఏఐ, ఐటీ శిక్షణ తరగతుల కోసం ప్రత్యేకంగా రూపొందిస్తున్న ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థులకు కల్పించనున్న సౌకర్యాలు, శిక్షణకు అవసరమైన మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన యువత ఉన్నప్పటికీ, ఆర్థిక పరిస్థితులు, సరైన శిక్షణ సదుపాయాలు అందుబాటులో లేక చాలామంది ఆధునిక సాంకేతిక విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. పట్టణ ప్రాంత యువతకు లభిస్తున్న సాంకేతిక విద్య, ఉపాధి అవకాశాలు గ్రామీణ యువతకు కూడా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీకి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. శిక్షణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా ప్రాక్టికల్ నైపుణ్యాలను కూడా పెంపొందించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆంగ్ల సంభాషణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఇంటర్వ్యూ నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా శిక్షణ అందించాలని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలపై మార్గదర్శకత్వం, ప్లేస్‌మెంట్ సహకారం అందించే దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు.

మోటర్ సైకిల్ దొంగ అరెస్ట్

సిద్దిపేట, నవంబర్ 22 (సింగిడి)

సిద్దిపేటలోని బీఏంఆర్ కాలేజ్ పక్కన బజాజ్ పల్సర్ TS23C 8371 నెంబర్ గలదానిని పార్కింగ్ చేసి తన రూమ్ లోకి వెళ్లి భోజనం చేసి తిరిగి వచ్చేసరికి ఎవరో గుర్తుతెలియని దొంగలు తన బండిని దొంగిలించుకు పోయినారని మోతే అనిల్ అను వ్యక్తి ఫిర్యాదు చేయగా సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. తేదీ 22.11.2026 రోజున నిందితుడు వరధం యాదగిరి తండ్రి నరసింహులు వయసు 32 సంవత్సరాలు, నివాసం బి.కొండాపూర్ గ్రామము చేగుంట మండలం మెదక్ జిల్లా అను వ్యక్తిని నర్సాపూర్ చౌరస్తా వద్ద పట్టుకొని అతని వద్ద నుండి బజాజ్ పల్సర్ బండిని స్వాధీనపరచుకొని రిమాండ్కు తరలించడం జరిగింది. నిందితునిపై గతంలో చేగుంట, మెదక్, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు మోటారుసైకిళ్లు దొంగతనం, ఇతర దొంగతనాలకు కేసులు కలవు. అరెస్టయిన నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి జ్య

చలికాలం చెవి నొప్పా? ముందుగా ఈ విషయాలు తెలుసుకోండి!

శీతాకాలం రాగానే జలుబు, ముక్కు కారడం, గొంతు నొప్పి రావడం సహజం. కానీ వీటన్నింటి కంటే చెవి నొప్పి చాలా బాధాకరంగా ఉంటుంది. లోపల ఎవరో సూదితో గుచ్చినట్లుగా నొప్పి రావడం, ముఖ్యంగా రాత్రి సమయంలో తీవ్రమై నిద్రలేకుండా చేయడం పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ ఇబ్బంది పెడుతుంది.



ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త!
చెవి నొప్పిని ఎప్పుడూ తేలికగా తీసుకోకూడదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెవిలో సూది గుచ్చినట్లు నొప్పి, బరువుగా అనిపించడం, వినికిడి తగ్గడం, ఈల వేసినట్లు శబ్దం రావడం, జ్వరం లేదా పిల్లలు వదేపదే చెవి గోక్కుంటూ ఏడవడం వంటివి గమనించాలి. ఒకవేళ చెవి నుంచి చీము లేదా చీము వస్తే అది ఇన్ఫెక్షన్ లక్షణం కాబట్టి ఇంటి చిట్కాలు ప్రయత్నించకుండా వెంటనే డాక్టర్‌ను కలవాలి.

సరైన సమయంలో కారణాన్ని గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు. అసలు చలికాలంలో చెవి నొప్పి ఎందుకు పెరుగుతుంది, దీనికి ఇంటి చిట్కాలే మిటో తెలుసుకుందాం.

చలికాలంలో చెవి నొప్పికి ప్రధాన కారణాలు
చల్లని గాలి: చెవులపై కొవ్వు పొర ఉండదు. అందువల్ల చల్లని గాలి నేరుగా చెవి లోపలికి వెళ్లి నరాలు కుంచించుకుపోయి నొప్పి మొదలవుతుంది.
జలుబు: జలుబుతో ముక్కు మూసుకుపోయిన పుడు, ముక్కు–చెవిని కలిపే నాళం కూడా మూసుకు పోయి లోపల గాలి, ఒత్తిడి పెరిగి నొప్పి వస్తుంది.
చెవిలో నీరు: వేడి నీటితో స్నానం చేసేటప్పుడు చెవిలో నీరు నిలిచిపోతే ఇన్ఫెక్షన్ రావచ్చు.
చెవి గులిమి: చలికి చెవిలోని గులిమి ఎండిపోయి గట్టిపడటం వల్ల కర్ణభేరిపై ఒత్తిడి కలిగి బరువుగా, నొప్పిగా అనిపిస్తుంది.

చెవి నొప్పి తగ్గించే ఇంటి చిట్కాలు
వెచ్చని కాపడం: ఒక శుభ్రమైన గుడ్డను వేడి చేసి లేదా వేడినీళ్ల బాటిల్‌ను గుడ్డలో చుట్టి చెవిపై 10 నిమిషాలు కాపడం పెడితే నొప్పి నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుంది.
టోపీ మఫ్లర్: చలిలో బయటకు వెళ్లేటప్పుడు చెవులు పూర్తిగా కవరయ్యేలా ఉన్ని టోపీ లేదా మఫ్లర్ ధరించాలి.
పడుకునే విధానం: నొప్పి ఉన్న చెవి వైపు తిరిగి పడుకోకూడదు. నొప్పి ఉన్న చెవి పైకి ఉండేలా పడుకుంటే చెవిపై ఒత్తిడి తగ్గుతుంది.
వెల్లుల్లి నూనె: 2 చెంచాల ఆవనూనెలో 2 వెల్లుల్లి రెబ్బలు వేసి నల్లబడే వరకు వేడి చేయాలి. స్టవ్ ఆపి, నూనెను వడకట్టి గోరువెచ్చగా అయ్యాక నొప్పి ఉన్న చెవిలో 2 చుక్కలు వేయాలి. వెల్లుల్లి లోని యాంటీబయాటిక్ గుణాలు ఇన్ఫెక్షన్‌ను తగ్గిస్తాయి.
తులసి రసం: 4–5 తులసి ఆకుల నుంచి రసం తీసి 2 చుక్కలు చెవిలో వేస్తే నొప్పి, ఇన్ఫెక్షన్ రెండూ తగ్గుముఖం పడతాయి.
ఈ సహజమైన ఇంటి చిట్కాలను పాటించడం ద్వారా చలికాలంలో చెవి నొప్పి నుంచి త్వరగా ఉపశమనం పొందవచ్చు. అయితే నొప్పి రెండు మూడు రోజుల కంటే ఎక్కువగా కొనసాగితే మాత్రం తప్పనిసరిగా ఈఎన్‌టీ వైద్య నిపుణులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం శ్రేయస్కరం.

తాటిబెల్లంతో లభించే ప్రయోజనాలివే!



తాటి బెల్లాన్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో తగినన్ని పోషకాలు, ఖనిజాలు ఉన్నాయని వివరిస్తున్నారు. తాటి బెల్లాన్ని చాలామంది ఇష్టపడతారు. దీన్ని తినేందుకు ఆసక్తి చూపుతారు. తాటి రసం నుంచి తయారు చేసే ఈ బెల్లాన్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలున్నాయని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో తగినన్ని పోషకాలు, ఖనిజాలు ఉన్నాయని వివరిస్తున్నారు. ఈ బెల్లంలో ఐరన్ సహా ఇతర పోషకాలు ఉంటాయి. అయితే తయారీ విధానం, నాణ్యత బట్టి వీటి పరిమాణం మారుతూ ఉంటుంది. ఇంతకీ తాటి బెల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో చూద్దామా..

విటమిన్ బీ1, బీ2
విటమిన్ బీ1 నాడీ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. అలాగే విటమిన్ బీ2 శరీర కణాల పెరుగుదలకు సహాయపడుతుంది. ఈ రెండూ తాటి బెల్లంలో దొరుకుతాయి. కొన్నిసార్లు ఈ విటమిన్ల పరిమాణంలో తేడాలు ఉండొచ్చు.

హిమోగ్లోబిన్ ఉత్పత్తి
శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి ఐరన్ చాలా అవసరం. సాధారణంగా ఐరన్ లోపం వల్లే రక్తహీనత వస్తుంది. తాటి బెల్లంలో ఐరన్ ఉంటుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. అయితే రక్తహీనత నివారించడానికి ఇతర ఆహార పదార్థాలూ అవసరం. తాటి బెల్లంతో పాటు పాలకూర, పప్పుధాన్యాలు, నువ్వులు, నట్స్ లాంటివి తీసుకోవాలి. విటమిన్ సీ అధికంగా ఉంటే ఉసిరి, నారింజ పండ్లను తినడం ద్వారా కూడా ఐరన్ ఎక్కువ పొందొచ్చు.

ఎలా వినియోగించాలి?
తాటి బెల్లం పొడిని పాలలో కలిపి తాగొచ్చు. తీపి వంటకాల్లో కూడా ఈ పొడిని వినియోగించవచ్చు. అయితే ఆ తాటి బెల్లంలో సహజంగానే చక్కెర ఉంటుంది. మధుమేహం ఉన్న వారు దీన్ని తక్కువగా తీసుకోవాలి. వైద్యులను సంప్రదించిన తరువాతే వినియోగించడం మరీ మంచిది.

అతివ Athiva Singidi

మడమ పగుళ్లకు చేయండి ఇలా!

చలి కాలంలో చాలా మంది కాళ్ల పగుళ్లతో ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలంలో ఈ సమస్య మరీ ఎక్కువ అవుతుంది. కాళ్లకు పగుళ్లు రావడం, వాటి నుంచి నొప్పి రావడం వంటివి ఇబ్బందికరంగా ఉంటాయి వాటిని ఎలా తగ్గించుకోవాలి? బయట దొరికే క్రీములు వాడకుండా, ఇంటి చిట్కాలతోనే, మన ఇంట్లో ఉండే పదార్థాలతో కాళ్ల పగుళ్లను ఎలా తగ్గించుకోవాలో చూద్దాం..



కాళ్ల పగుళ్లు అసలు ఎందుకు వస్తాయంటే, పాదాలు బాగా పొడిబారిపోవడం వల్ల ఈ సమస్య వస్తూ ఉంటుంది. శరీరంలో నీటి శాతం తక్కువగా ఉండటం కూడా ఒక కారణం కావచ్చు. కాబట్టి మనం రోజుకు రెండు నుంచి మూడు లీటర్ల నీటిని తాగాలి. ఈ విధంగా మన ఇంట్లోనే అందుబాటులో ఉండే వాటితోనే ఈ సమస్యను తగ్గించుకోవచ్చు. కాళ్ల పగుళ్లు ఎక్కువగా ఉండి, రక్తం రావడం లేదా తీవ్రమైన నొప్పి ఉంటే వైద్యుడిని సంప్రదించాలి.

కాళ్ల పగుళ్లు ఎక్కువగా ఉన్నప్పుడు ఎక్కువసేపు నీటిలో పాదాలను ఉంచకూడదు. సబ్బు నీటిలో ఎక్కువసేపు నిలబడటం వంటివి తగ్గించాలి. రాత్రిపూట పాదాలను శుభ్రంగా కడుక్కొని, మెత్తని బట్టతో తుడుచుకోవాలి. ఆ తర్వాత పాదాలకు వాసెలిన్ రాసుకుని, సాక్సులు వేసుకుని పడుకోవాలి. ఇలా ప్రతిరోజూ రాత్రి చేసినట్లయితే క్రమంగా కాళ్ల పగుళ్లు తగ్గడానికి సహాయపడుతుంది.

వారానికి ఒకసారి గోరువెచ్చని నీటిలో పాదాలను కొద్దిసేపు ఉంచి, పాదాలను బాగా మర్దన చేసి శుభ్రం చేసుకోవాలి. రెండు స్పూన్ల బియ్యప్పిండిలో కొద్దిగా పచ్చిపాలు, ఒక స్పూను తేనె వేసి బాగా కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకోవాలి. ఆరిన తర్వాత శుభ్రంగా కడుక్కోవాలి. ఇలా చేస్తే ఒకసారి చేసుకోవచ్చు.

ఒక స్పూన్ మంచి పసుపు తీసుకుని దానిలో ఒక స్పూన్ నెయ్యి కలిపి పాదాలకు రాసుకోవాలి ఇలా చెయ్యడం వల్ల కాళ్ల పగుళ్లు త్వరగా తగ్గుతాయి ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఒక స్పూను కొబ్బరి నూనెలో రెండు, మూడు నిమ్మచుక్కలు కలిపి పాదాలకు మృదువుగా మర్దన చేసుకోవాలి. ఆ తర్వాత సాక్సులు వేసుకుని పడుకోవాలి. ఇలా చేయడం వల్ల పాదాలు పొడిబారకుండా ఉండటానికి సహాయపడుతుంది.

స్టాక్ మార్కెట్ Stock Market

జీవితం మనం ఊహించిన మార్గంలో అరుదుగా సాగుతుంది. ఎన్నో ఎత్తుపల్లాలు ఎదురవుతుండటం సహజం. ఒకరోజు చాలా సజావుగా గడిచిపోతుంది. మర్నాడు ఎలా ఉంటుందో ఊహించలేము. ఏదైనా అనుకోని, అత్యవసర పరిస్థితి ఏర్పడవచ్చు. వైద్యపరమైన అత్యవసర పరిస్థితి లేదా ఉద్యోగం కోల్పోవడం లేదా ఇల్లు, వాహనానికి మరమ్మతు చేయాల్సిన పరిస్థితి ఎదురుకావొచ్చు. అయితే ఇలాంటి వాటికయ్యే ఖర్చులను ఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధపడి ఉండకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ తరహా అత్యవసర ఖర్చుల కోసం మీరు ఒక అత్యవసర నిధిని గానీ ఏర్పాటు చేసుకుని ఉంటే మీరు అప్పుల కోసం ఇతరుల ముందు చేయి చాచాల్సిన పరిస్థితి గానీ లేదా మీ దీర్ఘకాలిక పొదుపును వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడ కుండా ఉంటుంది.

అత్యవసర నిధి ఉందా?



ఎంత నిధి ఉండాలి?
ఒక నెలలో మీ కుటుంబాన్ని నడిపించడానికి, ఇతరాలకు ఎంత ఖర్చు అవుతుందో మీకు ఒక అంచనా ఉంటుంది కదా. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూడు నుంచి ఆరు నెలల అవసరాలకు సరిపడేలా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. నెలవారీ కుటుంబ వ్యయాలు, ఇంటి అద్దె లేదా గృహ రుణ చెల్లింపులు, యుటిలిటీ బిల్లులు, పిల్లల ఫీజులు, బీమా ప్రీమియంలు వంటి వాటికి ఎంత మొత్తం అవుతుందో ఒక అంచనా ఉంటుంది. కాబట్టి ఇందుకు అనుగుణంగా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. మీ ఆదాయంలో ఏవైనా అవాంతరాలు ఏర్పడిన సందర్భంలో ఈ డబ్బు మీకు నేనున్నానంటూ అండగా నిలుస్తుంది.

జీవన వ్యయాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఆర్థిక పరిస్థితులు మారుతున్నాయి. ఆర్థిక బాధ్యతలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి తరుణంలో అత్యవసర నిధికి మరింత ప్రాధాన్యం ఏర్పడుతోంది. అయితే అత్యవసర నిధి అంటే ఏంటి? దీన్ని ఎలా ఏర్పాటు చేసుకోవాలి? దీనివల్ల ప్రయోజనం ఎంత? అన్న విషయాల గురించి చూద్దాం..

భరోసా కోసం..
ఊహించని, అత్యవసర వ్యయాల కోసం మీరు సంపాదించే మొత్తంలో కొంత భాగాన్ని పక్కకు పెడుతూ డబ్బును పోగోసుకోవడాన్ని అత్యవసర నిధిగా చెప్పవచ్చు. దీనివల్ల మీకు చాలా భరోసా ఏర్పడుతుంది. మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడిన సందర్భంలో లేదా ఉద్యోగం పోయినప్పుడు లేదా ఆదాయంలో తాత్కాలికంగా అవరోధాలు ఏర్పడినప్పుడు, వాహనానికి అత్యవసరంగా రిపేర్లు చేయాల్సి వచ్చినప్పుడు, అనుకోకుండా ప్రయాణించాల్సి వచ్చినప్పుడు ఇది మీకు ఆర్థిక దన్నును ఇస్తుంది. ఈ నిధి ఉన్నట్టయితే మీరు ఊహించని ఖర్చులు ఎదురైనా అంత ఆందోళన చెందాల్సిన అవసరం ఏర్పడదు. మన అత్యవసరానికి డబ్బు అప్పటికప్పుడు కావాలంటే కొన్ని సందర్భాల్లో దొరక్కపోవచ్చు. ఒకవేళ డబ్బు లభించే మార్గం కనిపించినా అందుకు మీరు ఎక్కువ వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఇలాంటి పరిస్థితి ఎదుర్కోకుండా ఉండేందుకు అత్యవసర నిధి దోహదపడుతుంది.

ఏం చేయాలంటే?
అత్యవసరం కోసం పోగేసుకునే డబ్బును మీ ఇతర డబ్బులో కలపొద్దు. ఎమర్జెన్సీ నిధి కోసం ప్రత్యేకంగా ఒక ఎక్కువ.
ఇక శుక్రవారంతో ముగిసిన ట్రేడింగ్ సెషన్ లో భారతీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ట్రేడ్ అవ్వడం జరిగింది. దీనిలో భాగంగా శుక్రవారంతో ముగిసిన ట్రేడింగ్ సెషన్ లో నిఫ్టీ 286 పాయింట్లు అనగా 1.12 శాతం లాభపడి 25,800 పాయింట్ల వద్ద ముగియగా, సెన్సెక్స్ 897 పాయింట్లు అనగా 1.08 శాతం లాభపడి 83,919 పాయింట్ల వద్ద ముగిసింది.

సేవింగ్స్ ఖాతాను తెరవడం మంచిది. ఒక నెలలో ఇంత మొత్తం పొదుపు చేయాలన్న లక్ష్యంతో ఉంటే ఇంకా బెటర్. పెద్ద మొత్తంతోనే ఈ నిధి ఏర్పాటు చేసుకోవాలన్న నియమమేమీ లేదు కాబట్టి ఎంతో కొంత మొత్తంతో ముందు నిధిని మొదలుపెట్టండి. క్రమంగా పెంచుకుంటూ వెళ్లండి. అయితే మీకుండే బాధ్యతలు, వృత్తిపరమైన ఒత్తిడులు వంటి వాటి మూలంగా మీరు ప్రత్యేకంగా తెరిచిన సేవింగ్స్ ఖాతాకు సొమ్మును బదిలీ చేయడం ఒక్కోసారి మరిచిపోయే అవకాశం ఉండవచ్చు. అలా జరగకుండా ఉండేందుకు మీ ఇతర ఖాతా నుంచి ఆటోమెటిక్ ట్రాన్స్‌ఫర్ సదుపాయాన్ని వినియోగించుకోండి. మీ చేతికి వార్షికంగా బోనస్‌లు లేదా ప్రోత్సాహకాలు వచ్చినా లేదా మీకు పన్ను రిఫండ్స్ గానీ వచ్చినా ఆ మొత్తాన్ని ఎమర్జెన్సీ నిధికి బదిలీ చేసుకుంటే బాగుంటుంది. అత్యవసర నిధి అనేది మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకునే విధంగా ఉండేలా చూసుకోవాలి. సేవింగ్స్ ఖాతా అయితే మంచిది. మీరు దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టాలనుకునే ముందు మీకు సరిపోయేంతగా అత్యవసర నిధి ఉందో లేదో ఒకసారి చూసుకోండి. ఈ నిధి విషయంలో నిర్లక్ష్యం వహించకుండా క్రమశిక్షణతో ఉండాలి. అత్యవసరాల కోసమే ఈ నిధిని వాడుకోవాలన్న నియమం పెట్టుకోండి. ఒకవేళ మీరు అత్యవసర నిధి నుంచి సొమ్మును తీసుకుంటే మళ్లీ దాన్ని వీలైనంత త్వరగా భర్తీ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వండి. ఏడాదికి ఒక సారైనా మీ నిధిని సమీక్షించుకోండి. మీ జీవన శైలికి అనుగుణంగా నిధి ఉన్నదా లేదా చూసుకోండి.

ఇలా చేయొద్దు..
మీ రోజువారీ వ్యయాలతో అత్యవసర నిధిని కలపకండి. ఈ నిధిలో డబ్బులు జమచేయడం పట్ల అశ్రద్ధ వహించొద్దు. అత్యవసరం కాని అవసరాల కోసం వాడొద్దు.

20రోజుల్లోనే రూ.1 లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఫారిన్ ఇన్వెస్టర్లు

ఫారెన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ నవంబర్ నెలలో మన భారతీయ స్టాక్ మార్కెట్లలో భారీగా పెట్టుబడులు పెట్టడం జరిగింది, దీనిలో భాగంగా నవంబర్ లో దాదాపు రూ. 1.10 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయడం విశేషం. గత నెలలో అనగా అక్టోబర్ నెలలో ఏకంగా రూ. 45,162 కోట్లు భారత మార్కెట్స్ నుంచి ఉపసంహరించుకున్న ఎఫ్ఐఐలు, యూఎస్ ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లని పెంచే అవకాశం ఉండడం, AI సంబంధిత అనిశ్చితి నెలకొనడంతో మళ్ళీ మన దేశీయ మార్కెట్ల లో పెట్టుబడులు పెట్టడానికి మొగ్గు చూపారు.

నవంబర్ లో భారత మార్కెట్ లో రూ. 1 లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టిన ఫారిన్ ఇన్వెస్టర్లు

ఇతర దేశాలకి చెందిన ఇన్వెస్టర్లు మన దేశంలోని స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టినట్లయితే వారిని ఫారెన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ (FIIs) అంటారు. ఈ ఫారెన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ మన స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టినట్లయితే మన స్టాక్ మార్కెట్లు మంచి లాభాల్లో ట్రేడ్ అవుతాయి. ఒకవేళ వారు తమ షేర్లని విక్రయించినట్లయితే, మన మార్కెట్లు కూడా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

అయితే గత కొన్ని నెలలుగా తమ షేర్లని భారీగా విక్రయిస్తూ వచ్చిన ఫారెన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్, నవంబర్ నెలలో అనగా ఈ నెలలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెట్టడం జరిగింది. దీనిలో భాగంగా ఈ నెలలో ఎఫ్ఐఐలు మన స్టాక్ మార్కెట్స్ లో ఏకంగా రూ. 1,11,900 కోట్లు పెట్టుబడి పెట్టడం జరిగింది. దీని కారణంగా ఈ నెలలో మన దేశీయ స్టాక్ మార్కెట్లు మంచి లాభాల్లో ట్రేడ్ అవ్వడం జరిగింది.వరుసగా నాలుగు వారాల నుంచి ఫారిన్ ఇన్వెస్టర్లు మన స్టాక్ మార్కెట్స్ లో పెట్టుబడులు పెట్టడాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా AI సంబంధిత అనిశ్చితి కొనసాగుతూ ఉండడంతో పాటు యూఎస్ ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లని పెంచే అవకాశం ఉండడం, ఆదాయాలపై ఆందోళనలు ఉండడంతో ఫారిన్ ఇన్వెస్టర్లు రానున్న వారాలల్లో ఈ పెట్టుబడులని కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ డేటా ప్రకారం, నవంబర్ 20 అనగా శుక్రవారం రోజున ఫారిన్ ఇన్వెస్టర్లు నికరంగా రూ. 10,308.42 కోట్ల విలువైన ఈక్విటీలని కొనుగోలు చేయడం జరిగింది, ఇది ఈ వారంలోనే అతిపెద్ద కొనుగోలుగా నిలిచింది. అలాగే గత వారంలో ఐదు రోజుల పాటు ఫారిన్ ఇన్వెస్టర్లు దాదాపు రూ. 32,600 కోట్ల విలువైన ఈక్విటీస్ ని కొనుగోలు చేయడం జరిగింది. దీంతో నవంబర్ నెలలో ఫారిన్ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు రూ. 1,11,900 కోట్లకి చేరుకున్నాయి. ఇది అక్టోబర్ నెలలో ఫారిన్ ఇన్వెస్టర్లు అమ్మిన రూ. 45,162 కోట్ల కంటే దాదాపు రెండున్నర రేట్లు ఎక్కువ.

పిట్టలదొర వేషంలో.. సామాజిక చైతన్య గళం!



సూర్యాపేట జిలా ప్రతినిధి (సింగిడి):
పిట్టలదొర వేషధారణతో ప్రజలను నవ్విస్తూనే సామాజిక బాధ్యతపై చైతన్యం కల్పిస్తున్నారు సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్. ఆదివారం కోదాడ వారసంతతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల్లో ఆయన చేపట్టిన వినూత్న ప్రచారం ప్రజలను ఆకట్టుకుంది. హాస్యభరితమైన మాటలతో సందడి చేస్తూనే యువతకు ఆలోచన రేకెత్తించే సందేశాలిచ్చారు.గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటికి బానిసలైతే ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తు దెబ్బతింటాయని వివరించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే సామాజిక, ఆర్థిక, మానసిక, శారీరక, చట్టపరమైన అనర్థాలను తనదైన శైలిలో ప్రజలకు తెలియజేశారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.మరుగున పడుతున్న జానపద కళలకు జీవం పోస్తూ.. యువతను చెడు వ్యసనాల నుంచి దూరం చేయడమే తన ప్రచార ఉద్దేశమని ప్రభాకర్ తెలిపారు. వినోదంతో పాటు విలువైన సందేశాన్ని అందిస్తున్న ఆయన ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

అదుపులేని టిప్పర్లు.. ఆగని మృత్యుఘోష!

- జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు.. అమాయకుల బలి
- ఇటీవల ఘటనల్లో భార్యాభర్తలు, ఇద్దరు ఉపాధ్యాయురాళ్లు మృతి
- ఓవర్‌లోడ్, అతివేగంతో దూసుకెళ్తున్న భారీ వాహనాలు
- టిప్పర్ల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్





సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
సూర్యాపేట జిల్లాలో టిప్పర్ల బీభత్సం కొనసాగుతోంది. ఇసుక, కంకర, మట్టి, ఇతర నిర్మాణ సామగ్రి రవాణా పేరుతో రహదారులపై దూసుకెళ్తున్న భారీ వాహనాలు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో అమాయకులు మృత్యువాత పడుతుండగా, మరికొందరు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. కళ్లముందే కుటుంబ సభ్యులను కోల్పోతున్న బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటుతున్నాయి. అయినా టిప్పర్ల వేగ నియంత్రణ, రవాణా నిబంధనల అమలుపై అధికారుల చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.వరుస ప్రమాదాలు.. విషాదాలుగరిడేపల్లి మండలం అప్పన్నపేట వద్ద టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా మారింది. నేరేడుచర్ల పట్టణ నడిబొడ్డున జరిగిన మరో ప్రమాదంలో టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తల్లో భార్య ప్రాణాలు కోల్పోగా, భర్త గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాజాగా శుక్రవారం చివ్వెంల వద్ద స్కూటీపై వెళ్తున్న ఇద్దరు ఉపాధ్యాయురాళ్లను టిప్పర్ ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. వరుస ఘటనలు ఆయా ప్రాంతాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.అతివేగం.. ఓవర్‌లోడ్‌జిల్లాలో ఇసుక, కంకర, మట్టి, సిమెంట్ రవాణా చేసే టిప్పర్లు నిబంధనలు పట్టించుకోకుండా రాకపోకలు సాగిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అధిక లోడుతో ప్రయాణించడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అనుభవం లేని డ్రైవర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి అంశాలపైనా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాలు, పట్టణాల మధ్య నుంచి భారీ వాహనాలు ప్రయాణిస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.నివారణ చర్యలు ఎక్కడ?ప్రమాదం జరిగిన ప్రతిసారీ పోలీసులు కేసులు నమోదు చేయడం, డ్రైవర్లపై చర్యలు తీసుకోవడంతోనే సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్న పరిస్థితులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టిప్పర్ల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గవర్నర్లు ఏర్పాటు చేయడం, ఓవర్‌లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడం, తరచూ తనిఖీలు నిర్వహించడం అవసరమని సూచిస్తున్నారు.సమయ పాలన తప్పనిసరిగ్రామాలు, పట్టణాల మధ్య టిప్పర్ల రాకపోకలకు నిర్దిష్ట సమయాలు నిర్ణయించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిఘా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై జరిమానాలతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరో ప్రాణం బలికాకముందే పోలీసు, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన





అమీన్‌పూర్, నవంబర్ 22:(సింగిడి) :
బీరంగూడ డివిజన్ పరిధిలోని బీరంగూడ గుట్టపై కొలువుదీరిన శ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వేలాది మంది భక్తులు, అయ్యప్ప స్వాముల మధ్య అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బసవకళ్యాణ్ శ్రీ సదానంద మఠాధీశ్వరులు, శ్రీగురు మదనానంద సరస్వతీ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి దివ్య కరకమలముల మీదుగా ఉదయం 9:49 గంటలకు వేద మంత్రోచ్ఛారణల మధ్య యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక అలంకరణ భక్తులను మంత్రముగ్ధులను చేసింది.విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు, మాలధారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. క్యూలైన్లలో సుమారు రెండు నుండి మూడు గంటల పాటు ఓపికగా వేచి ఉండి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ 'స్వామియే శరణం అయ్యప్ప' అనే శరణు ఘోషతో మారోగాయి.ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. "సమాజంలో ధర్మం వర్ధిల్లాలన్నా, లోక కళ్యాణం జరగాలన్నా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరం. మంచి చెడుల విచక్షణతో ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి. బీరంగూడ గుట్టపై అయ్యప్ప స్వామి కొలువుదీరడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం" అని ఆశీర్వదించారు.కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీరంగూడ గుట్ట ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతోందని, ఇంత పెద్ద ఎత్తున విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.మహోత్సవంలో భాగంగా నిర్వహించిన హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 10,000 మంది వరకు భక్తులు, అయ్యప్ప స్వాములు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్స్ కృష్ణ, బోయిన బాలమణి,ఆలయ కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు, బోయిని బాల్ రాజ్, కొల్లూరు గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత



ఆర్మూర్, నవంబర్ 22 (సింగిడి) :
71వ, తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన నిజామాబాద్ జిల్లా జట్టు క్రీడాకారుల విద్యార్థులకు ఆదివారం రోజున క్రీడల దుస్తులను మోర్తాడ్ గ్రామ సర్పంచ్ భోగ ఆనంద్, గ్రామ ఉపసర్పంచ్ సామ శ్రీనివాస్ లు అందజేశారు. క్రీడాకారుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోర్తాడ్ గ్రామ సర్పంచ్ భోగా ఆనంద్, గ్రామ ఉపసర్పంచ్ సామ శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మోర్తాడు ఉపసర్పంచ్ సామ శ్రీనివాస్ జిల్లాస్థాయి క్రీడలలో రాణించి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైతే అట్టి క్రీడాకారులకు సొంతంగా క్రీడా దుస్తులను క్రీడాకారుల విద్యార్థులకు అందిస్తానని గ్రామ ఉపసర్పంచ్ సామ శ్రీనివాస్ క్రీడాకారుల విద్యార్థులకు మాట ఇచ్చారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి క్రీడాకారుల విద్యార్థులు ఎంపిక కావడంతో, గ్రామ ఉప సర్పంచ్ సామ శ్రీనివాస్ ఇచ్చిన మాట మేరకు, క్రీడాకారుల విద్యార్థులకు తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులను క్రీడాకారుల శిక్షణ ముగింపు సందర్భంగా ఉప సర్పంచ్ సామా శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ భోగా ఆనంద్ చేతుల మీదుగా అందజేయించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ లో జరిగే 71వ, తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టుకు మోర్తాడు ప్రభుత్వ పాఠశాలలో సన్నద్ధత శిబిరాన్ని నిర్వహించి ముగింపు కార్యక్రమాన్ని మోర్తాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్ లో ముగింపు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోర్తాడు గ్రామ సర్పంచ్ భోగా ఆనంద్, ఉప సర్పంచ్ సామ శ్రీనివాస్ లు విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకోవడం జరిగింది. మోర్తాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జిల్లా క్రీడాకారులకు సన్నద్ధత శిబిరాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని బాల్ బ్యాడ్మింటన్ సంఘానికి గ్రామ ప్రజా ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపితే క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తానని గ్రామ ఉపసర్పంచ్ హామీని ఇచ్చారు. దీంతో ముగింపు క్రీడాకారుల శిక్షణ శిబిరంలో ఇచ్చిన హామీ మేరకు,మోర్తాడ్ గ్రామ ఉపసర్పంచ్ సామ శ్రీనివాస్, తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులను క్రీడా కారుల విద్యార్థులకు సర్పంచ్ భోగా ఆనంద్ చేతుల మీదుగా దుస్తులను అందజేయించారు. నిజామాబాద్ జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపేందుకు, క్రీడలలో క్రీడా విద్యార్థులు రాణించే విధంగా తాము కృషి చేశామన్నారు. క్రీడాకారులకు తన వంతు సహకారంగా క్రీడా దుస్తులను అందించారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, నిర్వాణ కార్యదర్శి. నగేష్, వ్యాయామ ఉపాధ్యాయులు శివ, మహేష్, తదితరులు, పాల్గొన్నారు.

సాయం అందించండి సమాజంలో బతుకుతాం

- ఇందిరమ్మ ఇల్లుకు నోచుకోని పేద కుటుంబం
- మానవత్వంతో ఆదుకోండని వేడుకోలు





నారాయణపేట, నవంబర్ 22, (సింగిడి):
పెద్ద దిక్కును కోల్పోయి, అండగా నిలిచే ఆత్మీయులు ఎవరూ లేక, ఏ క్షణాన కూలిపోతుందో తెలియని శిథిలావస్థకు చేరిన ఇంట్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న ఒక నిరుపేద రైతు కుటుంబం దీనగాథ ఇది. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం బాపన్ పల్లి గ్రామానికి చెందిన బసపొల్ల రాజు అనే రైతు గత సంవత్సరం అక్టోబర్ 14వ తేదీన తన కంది పంటకు పురుగు మందు తీసుకువస్తూ రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన విషయం విధితమే అయినప్పటికీ, ఇందిరమ్మ ఇళ్ల సంబరాల్లో ఆ నిరుపేద రైతు కుటుంబానికి చోటు దక్కకపోవడం విచారకరం. రాజుకు భార్య ఓ కుమారుడు, ఓ కుమార్తె సంతానం, కనీసం తలదాచుకోవడానికి గూడు కూడా లేక ఆ తల్లి, ఇద్దరు చిన్నారులు పడుతున్న వేదన చూస్తే ఎవరికైనా కళ్లు చెమర్చక మానవు.రోడ్డు ప్రమాదంలో చెదిరిన జీవితం.. బసపొల్ల రాజు కు ఒక ఎకరం పొలం ఉండడంతో దానిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉన్న క్రమంలో గత సంవత్సరం 14 అక్టోబర్ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇంటికి ఆధారమైన భర్త అకాల మరణంతో ఆ భార్య, ఇద్దరు చిన్న పిల్లలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అత్తమామలు, తల్లిదండ్రులు కూడా ఎవరూ లేకపోవడంతో కష్టసుఖాలు చెప్పుకోవడానికి కూడా ఆ కుటుంబానికి తోడు లేకుండా పోయింది. రాజు పేరా పొలం పట్టా లేకపోవడంతో రైతు బీమా కూడా లభించలేదని రాజు భార్య బసపొల్ల లక్ష్మి వాపోయింది.చాలీచాలని పించన్.. కరువైన ఉపాధి..ప్రస్తుతం ఆ మహిళకు ప్రభుత్వం నుండి వచ్చే వితంతు పించన్ నెలకు 2 వేల రూపాయలు మాత్రమే ఆధారంగా మారిందని, అయితే, ఆ డబ్బులు ఆమె అనారోగ్య సమస్యలకు, ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి మందులు తెచ్చుకోవడానికే సరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, వర్షాలు లేక పంట పొలాలు ఎండిపోవడంతో కూలి పనులు కూడా దొరకడం లేదని అన్నారు. దీంతో ఇద్దరు పిల్లలను పోషించడం, వారిని చదివించడం ఆ తల్లికి తలకు మించిన భారంగా మారిందని కన్నీటి పర్యంతమయ్యారు.ఏ క్షణాన కూలుతుందో తెలియని ఇల్లు...వీరు నివసిస్తున్న ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు రేకులు, దూలాలు విరిగిపోయి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వర్షం వస్తే ఇల్లు ఎప్పుడు తమపై కూలిపోతుందోనని ప్రాణభయంతో వణికిపోతున్నారు. మా నాన్న లేడు, మా ఇల్లు కూలిపోయింది. మాకు ముందు వెనుక ఎవరూ లేరు మీరే ఎలాగైనా చేసి మాకు ఇల్లు కట్టించండి సారు అంటూ ఆ చిన్నారి కన్నీళ్లతో వేడుకుంటున్న తీరు అందరినీ కదిలిస్తోంది.పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద తమకు ఒక ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఆ వితంతు మహిళ చేతులు జోడించి ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటోంది. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి కనీసం ఇంటికి రేకులైనా వేయించి సాయం చేస్తే జీవితాంతం రుణపడి ఉంటామని ఆ కుటుంబం ఆశగా ఎదురుచూస్తోంది. నిజమైన అర్హులైన ఈ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, ఆ చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలన

మక్తల్ నవంబర్ 22 (సింగిడి):
ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ అల్కూరి రవికుమార్, నాయకులు కల్కూరి గోవర్ధన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నియోజకవర్గ కేంద్రంలో దాదాపు 230 కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయని అన్నారు, మంత్రి డాక్టర్ వాకర్ శ్రీహరి పర్యవేక్షణలో పనులు వేగంగా సాగుతుండగా అతి త్వరలో పూర్తిచేసుకుని వచ్చే విద్య సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టనున్నారు అని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యంత వేగంగా అనుమతులు తీసుకొని రావడమే కాకుండా పనులను సైతం సకాలంలో పూర్తిచేసే వచ్చే విద్యా సంవత్సరం నుంచి,వేలాదిమంది విద్యార్థులకు నాణ్యమైన చదువును ఒకే చోట చదువుకునేలా చర్యలు చేపట్టారు అని తెలిపారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్న మంత్రి డాక్టర్ వాకర్ శ్రీహరి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపా. రాబోయే రోజుల్లో మరిన్ని విద్యాసంస్థలో పనులను సైతం ప్రారంభించి మక్తల్ ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చేందుకు మంత్రి కృషి చేస్తున్నారని కొనియాడు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి తోడ్పాటును అందించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



ఆర్మూర్, నవంబర్ 22 (సింగిడి) :
బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మెండోరా గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం రోజున స్థానిక సర్పంచ్ బి. ప్రమోద్ కుమార్, పాలకవర్గ సభ్యుల కోరిక మేరకు ఏ.జి.ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బి.ప్రమోద్ కుమార్ ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంలో ఏ. జి. ఆస్పత్రి వైద్యులు బీపి, షుగర్, జ్వరం, దగ్గు, జలుబు, థైరాయిడ్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, కడుపు నొప్పి, రక్తహీనత, వంటి నొప్పులు పలు వివిధ వైద్య చికిత్సలు గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులను సైతం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఉచిత శిబిరం ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు నిర్వహించిన ఏ. జి.ఆస్పత్రి వైద్యులకు, వైద్య సిబ్బందికి , గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో స్థానిక జిపి పాలకవర్గ సభ్యులు రోగులకు సేవా కార్యక్రమాలు అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మందమర్రి, నవంబర్ 22 (సింగిడి)
పట్టణంలోని 24 వార్డులకు సంబంధించి ఎస్సీ సెల్ పట్టణ కమిటీ నియామకం జరిగింది దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ హాజరై కమిటీ నియమించడం. జరిగింది ఈ కమిటీలో నలుగురు ఉపాధ్యక్షులు నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఐదుగురు కార్యదర్శులు ఐదుగురు, సంయుక్త కార్యదర్శులు, ఒక అధికార ప్రతినిధి ఒక సోషల్ మీడియా ఇన్చార్జి నియమించడం జరిగింది . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 24 వార్డులకు సంబంధించి ఏ సమస్య ఉన్న కార్మిక మైనింగ్ శాఖమంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అలాగే పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి పట్టణాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తానని అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి సారథ్యంలో పనిచేస్తామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు కనకం రాజు ,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు లక్ష్మణ్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సోముల ఉపేందర్ గౌడ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు నిరువట్ల శ్రీనివాస్ , సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సోతుకు ఉదయ్, పట్టణ ఉపాధ్యక్షులు బండి శంకర్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సోదారి తిరుపతి ,పట్టణ ఉపాధ్యక్షులు వీరన్న తుంగ పిండి విజయ్, బూడిద శంకర్ ఎర్రరాజు, ఎండి యాకూబ్ అలాగే కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

దివ్యాంగ విద్యార్థులకు అండగా నిలిచిన కౌన్సిలర్



సుల్తానాబాద్, నవంబర్ 21 (సింగిడి):
పదవి అనేది హోదా కోసం కాదు.. ప్రజలకు సేవ చేయడానికి లభించిన బాధ్యత అని నిరూపిస్తు న్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు కౌ న్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్.ప్రజాసమస్య లపై స్పందించడ మే కాకుండా, అవసరంలో ఉన్న వారికి తన వంతు సహాయం అందిస్తూ సేవా మా ర్గంలో ముందుకు సాగుతున్నారు.సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మార్కండేయ కాలనీలోని క్యాడర్ దివ్యాంగులపాఠశాలలో విద్యనభ్యసిస్తు న్న విద్యార్థుల అవసరాలను గుర్తించిన ఆయన, తన ఆధ్వర్యంలో పాఠశాలకు 50 కిలోల బియ్యా న్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. చి న్నారుల అవసరానికి తన వంతు తోడ్పాటు అం దించడం ద్వారా వారి పట్ల తనకున్న ఆప్యాయ తను, సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఎ న్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకే పరిమితం కా కుండా, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందడం ఆయన ప్ర త్యేకతగా నిలుస్తోంది. పదవిని అలంకారంగా భావించకుం డా.. ప్రజలకు అండగా నిలిచే అవకాశంగా మలు చుకుంటూ, పేద విద్యార్థుల ముఖాల్లో చిరున వ్వులు చూడాలనే సంకల్పంతో ముందుకు సాగు తున్న భాకం సాయి కిరణ్ యాదవ్ సేవా దృక్పథం అభినందనీయం. నిజమైన నాయకత్వం

మత్తుకు దూరంగా ఉండండి

పెద్దపల్లి, నవంబర్ 22 (సింగిడి):
యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు. క్రీడాకారులను ప్రోత్సహించడం, యువతను క్రీడా మైదానాల వైపు నడిపించడం నాయకుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నవంబర్ 8న తన జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకుడు, తన అభిమాని కర్రె నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞన్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ విజయరమణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన పెద్దపల్లి ఆర్.జే. 11 జట్టుకు రూ.లక్ష నగదు బహుమతితో పాటు విన్నర్ ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన సిరిసిల్ల రాజన్న జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి, రన్నరప్ ట్రోఫీని అందించారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులకు మెమెంటోలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ.. తన జన్మదినాన్ని పురస్కరించుకుని కర్రె నరేష్ తన పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి యువతను క్రీడా మైదానాల వైపు నడిపించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి ప్రాంతంలో క్రీడాకారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నామని వెల్లడించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.
అంబేద్కర్ యువజన సంఘం స్వర్ణోత్సవ సభకు హాజరు అనంతరం పెద్దపల్లి పట్టణంలోని ఆర్.ఆర్. గార్డెన్స్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్వర్ణోత్సవ మహాసభకు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ



రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

అయ్యప్ప సన్నిధిలో ఎంపీ ప్రత్యేక పూజలు



సుల్తానాబాద్, నవంబర్ 22 (సింగిడి):
సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుల్ల రోడ్డులో గల శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో పె ద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ప్ర త్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరు కున్న ఎంపీకి అయ్యప్ప స్వాములు ఘన స్వాగ తం పలికి, శాలువాలతోసత్కరించారు.అనం తరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి న ఎంపీ, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు పుష్కలంగా పండాలని, ప్రజలందరూ సుఖసంతో షాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామి వారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ప్రార్థిం చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తోర్రికొండ ప్ర భాకర్, అయ్యప్ప స్వాములు గరిగే శ్రీనివాస్, గం గయ్య, ఆరేపల్లి రత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో మూగ జీవి మృతి

మంథని నవంబర్ 22 (సింగిడి):
విద్యుత్ షాక్ తో మూగ జీవి మృతి చెందిన సంఘటన మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఖానాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి ధర్మేందర్ కు చెందిన పాడిపశువు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్ఫారం వద్ద షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన పాడిపశువు ధర సుమారుగా 70 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు. తన కళ్ళ ముందు కలియతి రిగినటువంటి పాడిపశువు మృతి చెందడంతో ధర్మేందర్ తీవ్ర బాధను వ్యక్తం చేశారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన దళిత బహుజన నాయకులు

మంథని, నవంబర్ 22 (సింగిడి)
ప్రతి ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ బహుజన నాయకులు, ప్రముఖ న్యాయవాది కొరివి వేణుగోపాల్ ఇచ్చిన పిలుపునకు మంథనిలో స్పందన లభించింది. ఆ పిలుపు మేరకు ఆదివారం మంథని పట్టణంలో దళిత బహుజన నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ జీవితం, ఆశయాలు, రాజ్యాంగ నిర్మాణంలో చేసిన కృషి గురించి మాట్లాడారు. కార్యక్రమంలో బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు, పెద్దపల్లి జిల్లా ఇంచార్జి తగరం శంకర్ లాల్, బీసీ నాయకులు ఆకుల రాజబాపు, సీనియర్ దళిత నాయకులు అప్పాల పోచమల్లు, ఎడ్ల కిష్టయ్య, మంథని లక్ష్మణ్, కన్నూరి బాపన్న, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య, జంజర్ల గట్టయ్య, లింగయ్య, దర్మేందర్, కోటయ్య, గడ్డం లక్ష్మీ నారాయణ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మహాహారతి కరపత్రాలు ఆవిష్కరణ

మంథని, నవంబర్ 22 (సింగిడి)
ఈ నెల 27వ తేదీ శుక్రవారం గౌతమేశ్వర దేవాలయ గోదావరి తీరాన నిర్వహించే మహా హారతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను లక్ష్మీనారాయణ స్వామివారి దేవాలయం లో ఆవిష్కరించారు. గోదావరి తీరంలో శుక్రవారం నాడు సాయంత్రం నిర్వహించే గోదావరి మహా హారతి కార్యక్రమం కరపత్రాన్ని గోదావరి హారతి ఉత్సవ సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ, సకల చరాచర జీవరాశికి జలమే జీవనాధారమని, పంచభూతములలో ప్రముఖమైనదని పేర్కొన్నారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో క్యాతం వెంకటరమణ తో పాటు మండల కన్వీనర్ బోయిని నారాయణ, గర్రెపల్లి వెంకటేశ్వర్లు, కొత్త శ్రీనివాస్ గుప్తా, రావుల సతీష్, మేడగొని రాజమౌళి గౌడ్, కొమరవెల్లి హరీష్ గుప్తా, రేపాక శంకర్, నూక శ్రీనివాస్, నామిని నగేష్, గాజుల సురేష్, సుదర్శన్, జంగం రాజు, బండారి సునీత, మైథిలి, అనురాధ, రేపాల భాగ్యమ్మ, కొంజర్ల రాధా తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

మంథని, నవంబర్ 22(సింగిడి)
తెలంగాణ రాష్ట్ర వార్డ్ మెంబర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశానుసారం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ అధ్యక్షతన, మంథని నియోజకవర్గ ఇన్చార్జ్ సంతోష్ కుమార్ సొప్పరి ఆధ్వర్యంలో మంథని మండల వార్డ్ మెంబర్స్ ఫోరం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంథని మండల వార్డ్ మెంబర్స్ ఫోరం అధ్యక్షులుగా జంగం సుమన్ ను, మండల మహిళా అధ్యక్షురాలిగా కొత్త మౌనిక ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జంగం సుమన్ మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన మంథని మండల వ్యాప్తంగా ఉన్న 34 గ్రామాల సహచర వార్డు సభ్యులందరికీ ధన్యవాదములు తెలిపారు. వార్డు సభ్యుల హక్కులు, గ్రామాల అభివృద్ధి కోసం అందరితో కలిసి పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కాలభైరవ జయంతికి ముమ్మర ఏర్పాట్లు

రెబ్బెన, నవంబర్ 22 (సింగిడి) :
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవి స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానంలో డిసెంబర్ 1న నిర్వహించనున్న శ్రీ కాల భైరవ స్వామి జయంతి (కాలాష్టమి) వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా సామూహిక కాలభైరవ, అష్టభైరవ హోమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ దేవార వినోద్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులు క్రమపద్ధతిలో స్వామివారిని దర్శించుకునేలా చర్యలు చేపడుతున్నారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాలభైరవ స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

జీవిత బీమా సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ ప్రతినిధి, నవంబర్ 22 (సింగిడి):
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గాజుల రవి కుమార్, సోన్ మండల అధ్యక్షుడు మొహినుద్దీన్, గంజాల్ గ్రామ సర్పంచ్ వెంకటరమణ, ఎస్సీ సెల్ సోన్ మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మందమర్రి, నవంబర్ 22 (సింగిడి)
పట్టణంలోని 24 వార్డులకు సంబంధించి ఎస్సీ సెల్ పట్టణ కమిటీ నియామకం జరిగింది దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ హాజరై కమిటీ నియమించడం. జరిగింది ఈ కమిటీలో నలుగురు ఉపాధ్యక్షులు నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఐదుగురు కార్యదర్శులు ఐదుగురు, సంయుక్త కార్యదర్శులు, ఒక అధికార ప్రతినిధి ఒక సోషల్ మీడియా ఇన్చార్జి నియమించడం జరిగింది . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 24 వార్డులకు సంబంధించి ఏ సమస్య ఉన్న కార్మిక మైనింగ్ శాఖమంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట స్వామి అలాగే పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి పట్టణాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తానని అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి సారథ్యంలో పనిచేస్తామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు కనకం రాజు ,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు లక్ష్మణ్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సోముల ఉపేందర్ గౌడ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు నిరువట్ల శ్రీనివాస్ , సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సోతుకు ఉదయ్, పట్టణ ఉపాధ్యక్షులు బండి శంకర్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సోదారి తిరుపతి ,పట్టణ ఉపాధ్యక్షులు వీరన్న తుంగ పిండి విజయ్, బూడిద శంకర్ ఎర్రరాజు, ఎండి యాకూబ్ అలాగే కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

పేదల ఇంటి కలకు పెద్దన్నగా విజ్ఞన్న

సుల్తానాబాద్, నవంబర్ 22 (సింగిడి):
పేదల సొంతింటి కలను నిజం చేస్తూ.. సంక్షేమ పథ కాలను ప్రజల ముం గిటకు తీసుకెళ్లడంలో ముందుంటున్న ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మరోసారి తన ప్రజాసేవా నిబద్ధతను చాటుకున్నారు. నిరుపేదల సొంతింటి కల సాకారం కావాలన్న ప్రభుత్వ సంక ల్పానికి అండగా నిలుస్తూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ప్రాధాన్యతనిస్తున్నారు.సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు స్వప్న కాల నీలో కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో నూతనంగా నిర్మించిన ఇందిర మ్మ ఇంటిని ఆదివారం ప్రభుత్వ విప్ విజయ ర మణ రావు ప్రారం భించారు. ఈ సందర్భంగా ల బ్ధిదారుల కుటుంబంతో ఆత్మీయంగా ముచ్చటిం చి, నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడు తూ.. పేద ప్రజల సొంతింటి కలను సాకారం చే యడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్ప ష్టం చేశారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇ ళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబా నికి సొంత ఇల్లు ఉండాలనే ఆశయంతో ముఖ్య మంత్రి నాయక త్వంలోని ప్రభుత్వం సంక్షేమ పథ కాలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రజల అవ సరాలు, పేదల సంక్షేమమే ప్రాధాన్యంగా పనిచే స్తూ, ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులకు అందే లా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, స్థానిక కౌన్సిలర్ అమీరిశెట్టి శ్రావణి రాకేష్, మాజీ మార్కె ట్ చైర్మన్ మిసుపాల ప్రకాష్ రావు, కాంగ్రెస్ శ్రేణు లు అమ్మిరి శెట్టి రాజలింగు, తిరుపతి కాంగ్రెస్ నా యకులు, లబ్ధిదా రులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయాలి

మందమర్రి, నవంబర్ 22,(సింగిడి)
సమాచార హక్కు చట్టం 2005లోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మండల కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల వరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు అవసరమైన 17 అంశాల సమాచారాన్ని తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సమాచార హక్కు వికాస సమితి నాయకులు డిమాండ్ చేశారు. వెల్లడించాల్సిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని, సెక్షన్ 26 ప్రకారం ప్రజలకు సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు చట్టప్రకారం అందాల్సిన సమాచారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా సమాచార హక్కు వికాస సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పుల రామకిషన్, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆంగ్ల నైపుణ్యాలకు ఎల్టా చక్కటి వేదిక



సుల్తానాబాద్, నవంబర్ 22 (సింగిడి):
విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు,ఆత్మవిశ్వాసం, భా వ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) చేస్తున్న కృ షి అభినందనీయమని మండల విద్యాధికారి ఏ. రాజయ్య అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ ను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంత గానో దోహదపడతా యని పేర్కొన్నారు.ఎల్టా పెద్దపల్లి జి ల్లా ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత బాలికల పా ఠశాలలో నిర్వహించిన సుల్తానాబాద్ మండల స్థా యి ఆంగ్ల పోటీలను ఆయన ప్రారంభించారు. ఎ నిమిది పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పా ల్గొనడం అభినందనీయమన్నారు. గెలుపోటము లను పక్కనపెట్టి ప్రతి విద్యార్థి ఇలాంటి వేదిక ల ను సద్వినియోగం చేసుకోవాలని, ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించి భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అంది పుచ్చుకోవాలని సూచించారు.ఈ పోటీల్లో సీనియర్ ఒలింపియాడ్ విభాగంలో గర్రె పల్లికి చెందిన ఎన్. సుగంధ్, సీనియర్ స్టూడెంట్ టాక్‌లో గర్రెపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఎం. అక్షర, జూనియర్ ఒలింపియాడ్‌లో సుల్తానాబాద్ బాలికల పాఠశాలకు చెందిన ఎ. కృత్విక, జూని యర్ స్టూడెంట్ టాక్‌లో గర్రెపల్లి మోడల్ స్కూల్ కు చెందిన బి. వర్షిణి ప్రతిభ కనబరిచి జిల్లా స్థా యి పోటీలకు ఎంపిక య్యారు.విజేతలకు పాఠ శాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దివాకర్ జ్ఞా పికలు, ప్రశంసాపత్రాలు అంద జేశారు. డిసెంబ రులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటి మండలానికి మంచి పేరు తీసుకు రావాలనిఎంఈఓకాంక్షించారు.ఈకార్యక్రమంలో ఎల్టా మండల కన్వీనర్ ఎం. విజయరావు, కో-కన్వీనర్ వి. అంజయ్య, జిల్లా అధ్యక్షుడు గడ్డం జ గదీశ్వర్, కార్యదర్శి డి. నాగరాజు తదితరులు పా ల్గొని విజేతలను అభినందించారు.

మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన రోటరీ సేవలు



సుల్తానాబాద్, నవంబర్ 22 (సింగిడి):
మహనీయుల శతజయంతి వేడుకలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా, పేదల జీవి తాల్లో వెలుగులు నింపే సేవా కార్యక్రమాలతో ని ర్వహించడం అభినందనీయమని గర్రెపల్లి గ్రామ సర్పంచ్ వీరగొని రమేష్ గౌడ్ అన్నారు. మహిళల కు స్వయం ఉపాధి కల్పిస్తూ, విద్యార్థులను ప్రోత్స హించడం ద్వారా రోటరీ క్లబ్ సమాజం పట్ల తన బాధ్యతను చాటుకుందని కొనియాడారు.శ్రీ మడి శెట్టి మల్లేశం శతజ యంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ సైనిక్‌పురి ఆధ్వర్యం లో ఆదివారం సుల్తానా బాద్ మండలం గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పా ఠశాలలో సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా 100 మంది నిరుపేద మహి ళలకు కుట్టు మిషన్లు, ఆరుగురు ప్రతిభావంతులై న విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు.ఈ కార్య క్రమాన్ని మల్లేశం కుమారుడు రోటేరియన్ ఎం. శ్రీ హరి, కోడలు, క్లబ్ అధ్యక్షురాలు రోటే రియన్ విజ యలక్షి మడిశెట్టి దంపతులు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కుట్టు మిషన్లు మహిళలకు కేవలంయంత్రాలు మా త్రమే కాదు, ఆత్మగౌరవంతో జీవించేందుకు ఆర్థిక భరోసాకల్పించేసాధనాలనిపేర్కొన్నారు.విద్యార్థులకు సైకిళ్లు అందించడం వారి చదువుకు తోడ్పడ టమే కాకుండా, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనే స్ఫూర్తిని నింపుతుందని అన్నారు. గ్రామంలో ఇం తటి గొప్ప సేవా కార్యక్రమం నిర్వహించడం సంతో షంగా ఉందని, మడిశెట్టి కుటుంబం చూపిన సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని ప్రశం సించారు.ఈ కార్యక్రమంలో రోటరీ జిల్లా 3150 అ సిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ శారద ప్రక్కి, క్లబ్ కా ర్యదర్శి శ్రీకాంత్ చీపురుపల్లి, కోశాధికారి కల్నల్ పి. కామేష్, క్లబ్ సభ్యులు, పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు, గ్రామస్తు లు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు సమాజానికి మార్గదర్శకం

మంచిర్యాల, నవంబర్ 22 (సింగిడి):
ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత, కుటుంబాల్లో సంతోషం, సమాజంలో సోదరభావం వెల్లివిరియాలని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంథని జగన్‌మోహన్‌రావు ఆకాంక్షించారు. ఆదివారం మంచిర్యాల నియోజకవర్గంలోని కార్పొరేషన్ 6వ డివిజన్‌లో బెతేలు దర్శన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 27వ ఆధ్యాత్మిక క్రైస్తవ ఉజ్జీవ పండుగలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యేసుక్రీస్తు కృపతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సోదర సోదరీమణులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తుల్లో సంతోషాన్ని నింపింది. పండుగలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలే కాకుండా ప్రేమ, సేవ, ఐక్యతను చాటే వేదికలని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ వనపర్తి కేత రాజేష్, 5వ డివిజన్ కార్పొరేటర్ తోటపల్లి రాజేశ్వరి రాజు, నస్పూర్ మాజీ చైర్మన్, ప్రస్తుత కార్పొరేటర్ సురిమిల్ల సౌమ్య వేణు, కార్పొరేటర్లు మేకల రాము, పుట్ట యశోద, మంచిర్యాల మున్సిపాలిటీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అండగా నిలిచిన కౌన్సిలర్

సుల్తానాబాద్, నవంబర్ 21 (సింగిడి):
పదవి అనేది హోదా కోసం కాదు.. ప్రజలకు సేవ చేయడానికి లభించిన బాధ్యత అని నిరూపిస్తు న్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు కౌ న్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్.ప్రజాసమస్య లపై స్పందించడ మే కాకుండా, అవసరంలో ఉన్న వారికి తన వంతు సహాయం అందిస్తూ సేవా మా ర్గంలో ముందుకు సాగు తున్నారు.సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మార్కండేయ కాలనీలోని క్యాడర్ దివ్యాంగులపాఠశాలలో విద్యనభ్యసిస్తు న్న విద్యార్థుల అవసరాలను గుర్తించిన ఆయన, తన ఆధ్వర్యంలో పాఠశాలకు 50 కిలోల బియ్యా న్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. చి న్నారుల అవసరానికి తన వంతు తోడ్పాటు అం దించడం ద్వారా వారి పట్ల తనకున్న ఆప్యాయ తను, సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఎ న్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకే పరిమితం కా కుండా, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందడం ఆయన ప్ర త్యేకతగా నిలుస్తోంది. పదవిని అలంకారంగా భావించకుం డా.. ప్రజలకు అండగా నిలిచే అవకాశంగా మలు చుకుంటూ, పేద విద్యార్థుల ముఖాల్లో చిరున వ్వులు చూడాలనే సంకల్పంతో ముందుకు సాగు తున్న భాకం సాయి కిరణ్ యాదవ్ సేవా దృక్ప థం అభినందనీయం. నిజమైన నాయకత్వం

ముగ్గురికి మూడు హెల్మెట్లు.. పోలీసులు ప్రశంసలు

మంచిర్యాల, నవంబర్ 22(సింగిడి):
రహదారిపై ప్రయాణం అంటే కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకోవడం మాత్రమే కాదు.. క్షేమంగా గమ్యస్థానానికి చేరుకుని కుటుంబ సభ్యుల మధ్యకు తిరిగి వెళ్లడం కూడా. ఇందుకు ద్విచక్ర వాహనదారులు తీసుకునే చిన్నపాటి జాగ్రత్తలే కొండంత భరోసాగా నిలుస్తాయి. ప్రమాదం ఎప్పుడు, ఏ రూపంలో ముంచుకొస్తుందో తెలియని పరిస్థితుల్లో హెల్మెట్ ధరించడం ప్రాణరక్ష ణకు ఎంతో కీలకం. ఈ విషయాన్ని గుర్తించిన ముగ్గురు ప్రయాణికులు బాధ్యతాయుత ప్రవర్తనతో అందరికీ ఆదర్శంగా నిలిచారు. మంచిర్యాల–బెల్లం పల్లి చౌరస్తా మీదుగా స్కూటీపై ప్రయాణిస్తున్న ముగ్గురూ హెల్మెట్లు ధరించి వెళ్లడాన్ని ట్రాఫిక్ ఎస్ఐ రాములు గమనించారు. సాధారణంగా ద్విచక్ర వాహనదారుల్లో కొందరు హెల్మెట్ వినియోగంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండగా.. ఈ ముగ్గురూ భద్రతకు ప్రాధాన్యమిస్తూ హెల్మెట్లు ధరించడం ఆయనను ఆక ట్టుకుంది. దీంతో వారిని ఆపి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాములు మాట్లాడుతూ.. హెల్మెట్ అనేది ట్రాఫిక్ నిబంధనల కోసం ధరించే వస్తువు మాత్రమే కాదని, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని వివరించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చున్నవారు సైతం భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ఒకరి బాధ్యతాయుత ప్రవర్తన మరొకరికి స్ఫూర్తినివ్వాలనే ఉద్దేశంతో ముగ్గురు ప్రయాణికులను పోలీసులు



అభినందించడం విశేషం.పోలీసుల ప్రశంసలు పొందిన ఈ ముగ్గురి ప్రయాణం ఓ చిన్న సందేశాన్ని అందిస్తోంది. హెల్మెట్ ధరించడం జరిమానా నుంచి తప్పించుకోవడానికి కాదు.. మన కోసం ఎదురు చూసే కుటుంబ సభ్యుల ముఖాల్లో చిరునవ్వు నిలి పేందుకు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా మారినప్పుడే ప్రమాదాలను తగ్

ఆర్.బి.ఎస్.కె కార్యక్రమాలపై

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమీక్షా



ఖమ్మం, (సింగిడి): ఖమ్మం జిల్లా సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయం లోని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో శు క్రవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం పై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖా ధికారి డాక్టర్ రామారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆర్.బి.ఎస్.కె బృందాలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. చిన్నారులలో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, రక్తహీనత , ఇతర అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు.అలాగే, గుర్తించిన బాధిత చిన్నారులను తదుపరి చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రిలోని (జిల్లా సత్వర చికిత్స కేంద్రం) లేదా ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసి, వారు పూర్తిస్థా యిలో కోలుకునే వరకు నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఆర్.బి.ఎస్.కె మొబైల్ హెల్త్ టీమ్స్ మరింత సమర్థ వంతంగా పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి

5 లక్షల బీమా రక్షణ..

సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి..



కల్వకుర్తి (సింగిడి): తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామంలో ప్రారంభించారు. సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసు కోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ గొప్ప అవకాశాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబ పెద్దకు అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేలా ఈ బీమా పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం, కుటుంబాల ఆర్థిక భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంపై గ్రామస్థులందరికీ అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా పరిధిలోకి వచ్చేలా కృషి చేస్తామని సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఉపసర్పంచ్ నిజాముద్దీన్, పంచాయతీ కార్యదర్శి గణేష్, వార్డు సభ్యులు ఆదిరాల యాదయ్య, పలుస అనురాధ, జంగయ్య గౌడ్, డొక్కా రజిత మల్లేష్, బిజినేపల్లి స్వాతి, బాలరాజు, అలివేలు, జంగమయ్య, ఎండీ సికిందర్, పర్వత్ రెడ్డి, అక్షయ, విశ్వేశ్వర్, సుమంత్, రాజశేఖర్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు

9వ వార్డు కౌన్సిలర్ శివకు ఘన సన్మానం



గద్వాల ప్రతినిధి (సింగిడి): జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ ఏ. శివ 41 రోజుల అయ్యప్ప స్వామి దీక్షలో భాగంగా మహా పాదయాత్ర చేపట్టి కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకుని పట్టణానికి తిరిగి చేరుకున్నారు. గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 17వ తేదీ వరకు పాదయాత్ర కొనసాగించారు.
ఈ సందర్భంగా అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ ఏ. శివను ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. పూలమా లలు వేసి, శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీవైస్ చైర్మన్ మాల నర్సింహులు, మాజీవైస్ చైర్మన్ నాగన్నగౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, కౌన్సిలర్లు తిరుమలేష్, రజకు, కోఆప్షన్ సభ్యుడు మౌల పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు మేస్త్రి శ్రీను, అశ్వ పెద్దయ్య, పీజీకే రఘు, అశోక్, వీరేష్, నరేష్, మైబు, మహేంద్ర తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

బీమా పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్



కోదేరు (సింగిడి): కోదేరు మండలంలోని బావాయి పల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ పోడేండ్ల పరుశరాముడు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుం బ జీవిత పథకాన్ని సద్వినియోగంచేసుకోవాలని గ్రామ ప్రజలకు ఆయన సూచించారు. 18 నుండి 59 సంవత్సరాలలోపు ఉన్నవారు రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు ఆధార్ కార్డులో ఉన్న వయసు ప్రకారంగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజుమా పాలన అధికారి కే భాస్కర్ గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో ఆసరా మంజూరు పత్రాల పంపిణీ



ఆర్మూర్, (సింగిడి): బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం రోజున ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను స్థానిక గ్రామ సర్పంచ్ పుప్పాల నరేష్, ఉపసర్పంచ్ సదానంద్ గౌడ్, వార్డు సభ్యులు, స్థానిక కార్యదర్శి, బాస నరేందర్ లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుప్పల నరేష్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందానే లక్ష్యంతో పథకాలను అందించడం జరుగుతుం దని పేర్కొన్నారు. లబ్ధిదారులు పెన్షన్ మంజూరు పత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు, అర్హులైన పేదలకు చేయూత అందించడానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుండి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు,పాల్గొన్నారు.

చౌట్పల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

డిప్యూటేషన్లు రద్దు చేయాలని డీఎంహెచ్ఓకు ఆదేశం

నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):
కమ్మ ర్పల్లి మండలం చౌట్పల్లిలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి లోని ఆయా విభాగాలను సందర్శించి, పీ. హెచ్.సీ నిర్వహణ తీరును పరిశీలించారు. అందు బాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. స్టాఫ్ నర్సు, స్వీపర్ మినహా ఇతర వైద్యులు, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో కలెక్టర్ వారి గురించి ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్, మరికొందరు సిబ్బంది డిప్యూటేషన్ పై ఇతర చోట్ల పని చేస్తున్నారని చెప్పడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ కి ఫోన్ చేసి రౌండ్ ది క్లాక్ పీ. హెచ్.సీలో వైద్యులు, సిబ్బంది లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే డిప్యూటేషన్ లను రద్దు చేయాలని ఆదేశించారు. పీ. హెచ్.సీ లోని రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్,, జనరల్ వార్డులు, ఫార్మసీ, ల్యాబ్, వ్యాక్సినేషన్ గది తదితర విభాగాలను



సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. మందులను నిల్వ ఉంచే డ్రగ్ స్టోర్ రూం అస్తవ్యస్తంగా ఉండడం పట్ల స్టాఫ్ నర్సును మందలిం చారు. మధుమేహం, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నిర్ధారణ, వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్స ల గురించి స్టాఫ్ నర్సును ప్రశ్నిస్తూ సమాధానాలు రాబ ట్టారు. కొన్ని రకాల ఔషధాల కాల పరిమితి ముగియ నున్నట్లు గమనించిన కలెక్టర్, తక్షణమే ఇండెంట్ పంపించి అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. శీతలీకరణలో



ఉంచాల్సిన ఔషధాలను ఫ్రిడ్జ్ లలోనే భద్రపరచాలని అన్నారు. గర్భిణీలకు ఏ.ఎన్.సీ చెకప్ లు క్రమం తప్ప కుండా నిర్వహించాలని, హై రిస్క్ కేసులను ఏరియా హాస్పిటల్ కు రిఫర్ చేయాలని, ఈ.డీ.డీ క్యాలెండర్ ను పక్కాగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుప త్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని సూచించారు. తాను మళ్లీ ఆకస్మిక తనిఖీకి వస్తానని, పరిస్థితిలో మార్పు కనిపించకపోతే చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్

గద్వాల ప్రతినిధి, (సింగిడి): జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విషయాన్ని ఐజ మున్సిపల్ కమిషనర్ పి. చంద్రశేఖర రావు తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న 18 నుంచి 59 సంవత్స రాల వయస్సు గల వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబానికి రూ. 5 లక్షల బీమా పరిహారం అందుతుందని వివరిం చారు. ఈ బీమాకు సంబంధించిన పూర్తి ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని, లబ్ధిదారులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు మున్సి పల్ సిబ్బంది భరత్, ఆర్పీల ఆధ్వర్యంలో ఐజ మున్సిపాలిటీ 19వ వార్డుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తు న్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నమోదు కేంద్రంలో ప్రజల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దరఖాస్తు చేసుకునే వారు బీమా పొందే వ్యక్తి ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలు, రేషన్ కార్డు నంబర్, మొబైల్ నంబర్, నామినీ వివరాలను సమర్పించాలని సూచించారు. 19వ వార్డు పరిధిలోని అర్హులైన కుటుంబాలన్నీ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

మత్స్య సంపద అభివృద్ధికి కృషిచేయాలి!

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా జిల్లా మత్స్యకారులకు అచ్చన్న శుభాకాంక్షలు

నాగర్ కర్నూల్, (సింగిడి): ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లాలోని మత్స్యకారులందరికీ మత్స్యశాఖ సీనియర్ అసిస్టెంట్ అచ్చన్న శు భాకాంక్షలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, మత్స్య సంపద అభివృద్ధి, వారి ఆర్థిక అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 21న నిర్వహిస్తున్నామని, 1997 నవంబర్ 21న తొలిసారిగా ఈ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, చేపల ఉత్పత్తిని పెంచడం, జలవనరులను సంరక్షించడం, మత్స్య రంగం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తిని పెంచడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నీలి విప్లవం దిశగా మత్స్య రంగం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. జలవనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. చేపల పెంపకం, విక్రయాలు, మార్కెటింగ్ ద్వారా మత్స్యకారుల ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మత్స్య రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై), ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ-యోజన (పీఎం-ఎంకేఎస్‌ఎస్‌వై), మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు. చేపల పెంపకానికి సబ్సిడీలు, ఆర్థిక సహాయం, చేపల విత్తన కేంద్రాల అభివృద్ధి, కోల్డ్ స్టోరేజ్, రవాణా, మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు ఈ పథకాలు దోహదపడతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మత్స్య రంగం మరింత అభివృద్ధి చెందాలంటే జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలను మత్స్యకార సహకార సంఘాలకు కేటాయించాలని, న్యాయమైన చేప పిల్లలను విడుదల



చేయాలని సూచించారు. మత్స్యకారులకు ఆధునిక చేపల పెంపకం పద్ధతులపై శిక్షణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు మహిళా మత్స్యకారులకు చేపల విక్రయానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. మత్స్య రంగం కేవలం ఆహార ఉత్పత్తికే పరిమితం కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ఉపాధి కల్పనకు, పోషకాహార భద్రతకు కీలకంగా నిలుస్తోందని అచ్చన్న పేర్కొన్నారు. చేపల సంపదను కాపాడుదాం మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుదాం మత్స్యరంగాన్ని అభివృద్ధి చేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా మత్స్యశాఖ జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఫిషర్మెన్ రాజకుమార్ నాగర్ కర్నూల్ అధ్యక్షులు తేప్పబాబు నాగనూలు అధ్యక్షులు తిరుపతయ్య సంఘ సభ్యులు తవిటి నిరంజన్ తెప్ప రుద్రయ్య తవిటి నరసింహ తవిటి నిరంజన్ తవిటి శంకర్ సోప్పరి యాదయ్య రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఎంతో ప్రయోజనకరం

సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా

ఖమ్మం, (సింగిడి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తూ అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశపెట్టిం దని దీన్ని అందరూ సద్వినియోగ పరచుకోవాలని సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, గ్రంధా లయ చైర్మన్ ఖాదర్ బాబులు అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలో ప్రతి డివిజన్లలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో జరు గుచున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం నమోదు శిబిరాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుం బానికి ఆర్థిక భరోసా కల్పించా లనే లక్ష్యంతో ప్రవేశపె ట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దేశం లో మొట్ట మొదటి సారిగా మన రాష్ట్రము ప్రవేశ పెట్టిన ఈ పథకం



గురించి వివరించి ప్రతి డివిజన్ లో మున్సిపల్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలలో ఉచితంగా ప్రజలు నమోదు చేసుకోవాలని పిలుపుని చ్చారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డు ఉన్నప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పిం చడం అభినందనీ యమని పేర్కొన్నారు. పేద, మధ్యత రగతి కుటుంబా లకు ఆర్థిక భద్రత కల్పించ డంతో పాటు, కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని సంఘ టన జరిగినప్పుడు ఆ కుటుంబానికి అండగా నిలవడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఇరువురు తెలిపారు.ప్రజల సంక్షేమం, కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల ప్రజలు అవగాహన కల్గించి, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకం ప్రయోజనాలను పొందేలా సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కోరారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని ఎం.డి. ఖాదర్ బాబా పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో యం వెంకటేశ్వర్లు, మాలిదు మనీష్, కొట్టే సుధాకర్, పల్లెబోయిన చంద్రం, రజనీ, శశి, ఏలూరు శ్రీను వివిధ డివిజన్ల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

శతాబ్ది వైభవానికి శాంతినగర్ హైస్కూల్ ముస్తాబు

వందేళ్ల విద్యా ప్రస్థానానికి ఘనమైన వేడుకలు..

పూర్వ విద్యార్థులు, గురువుల ఆత్మీయ సమ్మేళనానికి సర్వం సిద్ధం.

ఖమ్మం, (సింగిడి): ఖమ్మం నగరంలోని శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వందేళ్ల విద్యా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతోంది. 1927లో ప్రారంభమైన ఈ విద్యాలయం 2026 -27 విద్యా సంవత్సరం నాటికి వంద సంవత్సరాల మైలురాయిని చేరుకోవడం విశేషం. ఎన్నో తరాల విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా తీర్చిదిద్దిన ఈ పాఠశాల చరిత్రలో శతాబ్ది వేడుకలు చిరస్మరణీయ ఘట్టంగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా ఈ నెల 29వ తేదీ ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులం దరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం, గతంలో విద్యాబోధన చేసిన గురువులను సాదరంగా ఆహ్వానించి సత్కరించడం, పాఠశాల వందేళ్ల ప్రస్థానాన్ని స్మరించుకోవడం ఈ వేడుకల ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక, పూర్వ మరియు ప్రస్తుత ఉపాధ్యాయులకు ఘన సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధు లను



గౌరవ అతిథులుగా ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వందేళ్ల విద్యా ప్రస్థానం అంటే కేవలం ఒక పాఠశాల చరిత్ర మాత్రమే కాదు, వేలాది మంది విద్యార్థుల బాల్య జ్ఞాపకాలు, గురువుల త్యాగాలు, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యా బోధనకు నిలువెత్తు నిదర్శనం. ఒకప్పుడు ఒకే తరగతి గదిలో చదువుకున్న స్నేహితులు, నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిర పడిన వారు మళ్లీ కలుసుకునే అరుదైన అవకాశం ఈ శతాబ్ది వేడుకలు కల్పించను న్నాయి. ఈ చారిత్రాత్మక వేడుకలను విజయవంతం చేయడానికి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు కోరుతున్నారు. కార్యక్ర మానికి ముఖ్యఅతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , తుమ్మల నాగేశ్వరరావు, పొం గులేటి శ్రీనివాస్ రెడ్డి , కలెక్టర్ , జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ , మున్సిపల్ కమిషనర్ గార జిల్లా విద్యాశాఖ అధికారి, పూర్వ/ ప్రస్తుత ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొం టు న్నారని, శాంతి నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లగాని కృపా బాలానందం, పూర్వ విద్యార్థి కొప్పుల నరేశ్, కుంచకర్ర నగేశ్, పాస్యం బ్రహ్మారెడ్డి, భోగా గిరి, పుల్లఖండం రామ కృష్ణ, రాఘవాచార్యులు, శ్రీగాధ శ్రీనివాస్ , విద్యార్థులు, డీ. నాగ భూషణం, రాములు, బొమ్మిసెట్టి శ్రీనివాస్, కే.రాంబాబు, ఏ. ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చేయూత పెన్షన్ల పంపిణీ

ఆర్మూర్, (సింగిడి): నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని సుంకేట్ గ్రామంలో శనివారం సుంకేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.సీ.గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ వనజ గౌడ్, ఉప సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, పాలకవర్గ సభ్యులు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.సీ. గంగాధర్ సుంకేట్ గ్రామానికి నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 21 మంది వితంతువులకు, వికలాంగులకు 9 మంది లబ్ధిదారులకు, 8 మంది ఒంటరి మహిళలకు, ఆరు గీత కార్మిక లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంజూరుకు కృషి చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫామ్స్

కొనుగోలుకు ఓపెన్ టెండర్లు..

నవంబర్ 23 నుంచి 27 వరకు టెండర్ల స్వీకరణ..



నాగర్‌కర్నూల్, (సింగిడి): జిల్లాలోని 20 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పీఎం శ్రీ (PM SHRI) పథకంలో భాగంగా హబ్ అండ్ స్పోక్ మోడల్ కింద అమలు చేస్తున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమానికి అవసరమైన యూనిఫా మ్స్ కొనుగోలు చేసేందుకు ఓపెన్ టెండర్లు ఆహ్వానించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో పాటు స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు అవసరమైన యూనిఫామ్స్ సరఫరా చేసేందుకు అర్హత కలిగిన సంస్థలు, ఫర్మ్‌ల నుంచి టెండర్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు 2026 నవంబర్ 23 నుంచి 27వ తేదీ వరకు తమ టెండర్లను సమర్పించవచ్చని తెలిపారు. టెండర్లకు సంబంధించిన పూర్తి వివరాలు, యూనిఫామ్స్ స్పెసిఫికేషన్లు, సరఫరా నిబంధనలు, ఇతర మార్గదర్శకాలను నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొందవచ్చని వెల్లడించారు. అర్హత కలిగిన సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్ణీత గడువు లోగా టెండర్లను సమర్పించి కొనుగోలు ప్రక్రియలో పాల్గొనా లని జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రమేష్ కుమార్ కోరారు.

సంపత్ కుమార్‌ను తొలగించారంటూ

తప్పుడు ప్రచారం మానుకోవాలి

బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారంపై కాంగ్రెస్ నేతల మండిపాటు



గద్వాల ప్రతినిధి (సింగిడి): ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్‌ను ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించారంటూ బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ షాపలి ఆచారి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, 16వ వార్డు కౌన్సిలర్ మద్దిలేటి తీవ్రంగా ఖండించారు. ఒక రాష్ట్రానికి ఇన్‌చార్జిగా నియమించకపోవడం అంటే ఏఐసీసీ కార్యదర్శి పదవి నుంచి తొలగించినట్లు కాదని, ఏఐసీసీ సెక్రెటరీ ఎక్కడికి పోదని, స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల ఇన్‌చార్జిల నియామక సమయంలో సంపత్ కుమార్‌ను ఏ రాష్ట్రానికి బాధ్యతలు తీసు కుంటారని అడగగా, తెలంగాణలోనే పార్టీకి సేవ చేయాలనే ఉద్దే శంతో ఇక్కడ బాధ్యతలు కోరుకున్నారని తెలిపారు. అంతమా త్రాన ఆయనను పదవి నుంచి తొలగించినట్లు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. తెలంగాణలో సంపత్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ తప్పకుండా

నల్లటి తాటిపత్ర.. చీకట్లో రోడ్డుగా భావించి!

వడ్ల కుప్పను ఢీకొట్టిన బైక్.. యువకులకి తీవ్ర గాయాలు





మల్లాపూర్, (సింగిడి): మల్లా పూర్ మండలం వాల్గొండ గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫార్మ్ సమీపంలో రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వాల్గొండ నుంచి మల్లా పూర్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులు రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పల వద్ద ప్రమాదానికి గురయ్యారు. వడ్ల కుప్పలపై నల్లటి తాటిపత్ర కప్పి ఉండటంతో రాత్రి చీకటిలో దానిని రహదారిగా భావించి బైక్‌పై వచ్చిన యువకులు నేరుగా ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకులు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఓ యువకుడి తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగినట్లు సమాచారం. గాయపడిన యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. రహదారి పై ధాన్యం ఆరబోసి నల్లటి తాటిపత్ర కప్పి ఉంచడం వాహనదారులకు ప్రమాదకరంగా మారిం దని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా రాత్రివేళల్లో ఎదురుగా ఉన్నది వడ్ల కుప్పా.. రహదారి అన్నది గుర్తించలేని పరిస్థితి నెలకొంటోందని అంటున్నారు. రహదారులు ధాన్యం ఆరబెట్టేందుకా.. వాహనాల రాకపోకలకా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పంటను ఆరబెట్టుకునేక్రమంలో రోడ్డుపై అడ్డంకులు సృష్టించ డం వల్ల అమాయక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఇలాంటి అడ్డంకులు కనిపించకపోవడం మరింత ప్రమా దకరంగా మారు తోందని అంటున్నారు.రోడ్లపై ధాన్యం ఆరబెట్టే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాదానికి దారితీ సిన పరిస్థితులపై విచారణ చేపడుతున్నారు. రోడ్డుపై రాళ్లు ఏర్పాటు చేసిన వారు ఎవరు? ప్రమాదానికి వారి నిర్లక్ష్యం కారణమా? అనే అం శాలపై పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులపై కేసు నమోదు

– యువత గంజాయికి దూరంగా ఉండాలి.. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

– ఎస్సై మహేందర్ కుమార్



మల్హర్ , (సింగిడి): మండలంలోని తాడిచెర్ల గ్రామా నికి చెందిన బూడిది సుదర్శన్, మల్లారం గ్రామానికి చెందిన ఎండి రియాజ్ అనే ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తున్న ట్లు సమాచారం అందడంతో కొయ్యూరు పోలీస్ సిబ్బంది వారిని పరీక్షించారు. పరీక్షల్లో వారు గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కొయ్యూరు పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పి. మహేందర్ కుమార్ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ మండలంలోని యువకుల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎవరైనా యువకులు గంజాయికి అలవాటు పడినట్లు గుర్తిస్తే వారిని కొయ్యూ రు పోలీస్ స్టేషన్‌కు తీసుకురావాలని కోరారు. వారికి కౌన్సెలింగ్ నిర్వ హించి గంజాయి అలవాటు నుంచి బయటపడేలా కృషి చేస్తామని తెలిపారు.అలవాటు తీవ్రంగా ఉన్నవారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపించి, వారు తిరిగి సాధారణ జీవితం గడిపేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొ న్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదం డ్రులు ఈ విషయాన్ని గమనించి పోలీ సులకు సహకరించాలని ఎస్సై మహేందర్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

జాతీయ, రాష్ట్ర కమిటీకి ఎన్నికైన
జర్నలిస్టులకు ఘన సన్మానం...



మంథని, (సింగిడి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్లూజే హెచ్-143) ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మరోసారి ఎన్నికైన నమస్తే తెలంగాణ పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అంకరి ప్రకాష్‌తో పాటు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన మంథని 10టీవీ ప్రతినిధి పినగాని శ్రావణ్ కుమార్ లను శనివారం మంథని డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ లో సహచర జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంథని డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జంజర్ల శంకర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు మరింత అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర కమిటీకి ఎన్నికైన ప్రకాష్, శ్రవణ్ కుమార్ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంథని డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మాచిడి కిరణ్ గౌడ్, కార్యదర్శి బండ లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు చిట్టిమెల్ల సంతోష్ తోపాటు పెరుగు రాకేష్, బండారి సురేష్, తంబూరి తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

చెన్నూరు లోక్ అదాలత్‌కు విశేష స్పందన
86 కేసుల పరిష్కారం



చెన్నూరు(సింగిడి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో చెన్నూరు జూనియర్ సివిల్ జడ్జి న్యాయ స్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి పి. రవి ఆధ్వర్యంలో ఇరువర్గాల రాజీ మార్గం ద్వారా మొత్తం 86 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి పి. రవి మాట్లాడుతూ, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృధా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకోవడం ఎంతో ప్రయోజన కరమని పేర్కొన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమైనదని, దీనికి అప్పీలు ఉండదని, తద్వారా ఇరువర్గాల మధ్య శాశ్వత సత్సంబం ధాలు ఏర్పడతాయని వివరించారు.చిన్నపాటి తగాదాలు, సివిల్, క్రిమినల్ (రాజీ పడదగిన), మోటారు వాహన ప్రమాద కేసులు, మరియు బ్యాంకు రికవరీ వంటి మొత్తం 86 కేసులను అక్కడికక్కడే పరిష్కరించి కక్షిదారులకు ఉపశమనం కలిగించారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్, సభ్యులు న్యాయవాదులు, లోక్ అదాలత్ సభ్యులు, పోలీసు అధికారులు, బ్యాంకు ప్రతినిధులు మరియు కోర్టు సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా





నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): జాతీయ బాలల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ గ్రామంలో గల బాలసదనాన్ని సందర్శించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన బాలసదనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ, పిల్లలందరికీ అన్ని వసతులు కల్పించాలన్నారు.



చిన్నారులతో నేరుగా మాట్లాడి వారి వివరాలు, బాలస దనం లో సౌకర్యాలు, ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉన్నా యేమో అని, వారి జీవిత లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పిల్ల లకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే అధికారు లకు తెలియజేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని తెలిపారు. బాలసదనం అధికారులతో మాట్లాడు తూ, చిన్నారులకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే పరిష్క రించాలన్నారు. ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ వహించాల న్నారు. అందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాల న్నారు. విద్యార్థులను ఇతర రాష్ట్రాలకు విమానాల్లో సందర్శ నకు తీసుకువెళ్లాలని సూచించారు. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో వారికి సందేశాత్మకమైన, వారి మనోస్థైర్యం నింపేలా మంచి మంచి సినిమాలను ప్రదర్శించాలన్నారు. ఆటలు ఆడించాలన్నారు. వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి వారిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. త్వర లోనే సొంత భవనంలోనికి బాలసదనాన్ని మారుస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులతో కేకు కట్ చేయించి, వారికి కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వినూత్న, అధికారులు మురళి, వైష్ణవి, రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువత భవితకు ఉద్యోగ వారధిగా ట్రినిటీ మెగా జాబ్ మేళా !

45 ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం.. వెయ్యికి పైగా నిరుద్యోగ యువత హాజరు

నేటి చిన్న ఉద్యోగమే రేపటి గొప్ప భవిష్యత్తుకు పునాది: మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి





పెద్దపల్లి, (సింగిడి): యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి భవిష్యత్తును బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వ హించిన మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువతకు ఉద్యోగ వారధిగా నిలిచింది. పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్‌లో ఉన్న ట్రినిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 45 ప్రముఖ కంపెనీలు భాగ స్వామ్యం కాగా, వెయ్యికి పైగా నిరుద్యోగ యువతీ యువ కులు ఉద్యోగ అవకాశాల కోసం భారీగా తరలివచ్చారు. ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో, సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సంద ర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి నియో జకవర్గంలోని యువతీ యువకులందరినీ తమ కుటుంబ సభ్యులుగానే భావిస్తామని తెలిపారు. ఈ ప్రాంతానికి చెం దిన ఒక్క యువకుడికి ఉద్యోగం లభించినా తమ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చినంత ఆనందంగా ఉం టుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరికి ఉపాధి లభిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు.నేటి చిన్న ఉద్యోగమే రేపటి గొప్ప భవిష్యత్తుకు పునాది అని, ఉద్యోగం చిన్నదా పెద్దదా అని ఆలోచించకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. ఉద్యోగంలో పొందే అనుభవం, నేర్చుకునే నైపుణ్యాలే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరేందుకు మార్గం చూపుతాయని వివరించారు. మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉద్యోగాలు సాధించి ఆర్థిక స్వావలంబన పొందాలని ఆకాంక్షించారు.ప్రాంత అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, నాణ్యమైన విద్య అందితే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సైతం ఉన్నత స్థానాలకు చేరుకోగలరని అన్నారు. ట్రినిటీ విద్యాసంస్థల్లో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు నేడు దేశవిదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడటం గర్వకార ణమని పేర్కొన్నారు. ముఖ్యంగా అమెరికా, యూరప్ వంటి దేశాల్లో పలువురు పూర్వ విద్యార్థులు మంచి స్థానాల్లో కొనసాగుతున్నారని తెలిపారు.గతంలో పోలీస్, పారా మిలటరీ తదితర ఉద్యోగాల కోసం యువతకు ప్రత్యేక శిక్షణ అందించి వందలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి నట్లు గుర్తుచేశారు. అదే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కేవలం తమ కళాశాల విద్యార్థులకే పరిమితం కాకుండా పెద్దపల్లి నియోజకవర్గం లోని అన్ని కళాశాలల విద్యార్థులు, ఇతర ప్రాంతాల నిరుద్యోగ యువతకు కూడా అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.ఈ జాబ్ మేళాలో సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, ఫార్మాస్యూటికల్, మేనేజ్‌మెంట్ తదితర రంగాలకు చెందిన 45 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, డిప్లొమా వరకు వివిధ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు వారి అర్హతలు, నైపుణ్యాలు, అనుభవం ఆధా రంగా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిం చారు.పెద్దపల్లి ప్రాంతంలోని ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదువుకొని ఉద్యోగం సాధించి తన కుటుంబానికి అండగా నిలవాలన్నదే తమ లక్ష్యమని దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు మరిన్ని అవకాశాలు కల్పిం చేలా భవిష్యత్తులోనూ ఇలాంటి ఉపాధి కార్యక్రమా లను కొనసాగిస్తామని వెల్లడించారు. నాణ్యమైన విద్య తో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ట్రినిటీ విద్యా సంస్థల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పూట్ల అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్, ఎస్ఆర్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సమ్మయ్య, అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ రాజిరెడ్డి, చొప్పరి వంశీ, విభాగాది పతులు స్వాతి, ప్రభాకర్, లక్ష్మి, వంశీ, డాక్టర్ ఆరిఫ్, నరేందర్, విజయ్, వివిధ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, కంపెనీల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

మహాదేవపూర్ కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలి..

40 శాతానికి పైగా గిరిజన జనాభా ఉన్న గ్రామాలకు షెడ్యూల్డ్ హోదా ఇవ్వాలి

జిల్లా రెండో మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్





కాటారం, (సింగిడి): ఆదివాసీల సమగ్ర అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. మహాదేవపూర్ కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, 40 శాతానికి పైగా ఆదివాసీ జనాభా ఉన్న గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియా పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అడవులు, సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను విరమించుకోవాలని స్పష్టం చేశారు.కాటారం డివిజన్ కేంద్రంలోని అయ్యప్ప టెంపుల్ ఫంక్షన్ హాల్‌లో శనివారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రెండో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పూసం సచిన్ మాట్లాడుతూ.. ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు మహాదేవపూర్ కేంద్రంగా సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ను తక్షణమే ఏర్పాటు చేయాలని అన్నారు.ఏళ్లుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు అర్హులైన వారందరికీ పట్టాలు అందించాలని, అటవీ హక్కుల చట్టం కింద ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు సాగులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పట్టా భూముల్లో బోర్లు వేసుకోవడం, ట్రాక్టర్లతో దున్నుకోవడంపై అటవీశాఖ అధికారులు అడ్డంకులు సృష్టించకూడదని, రైతులకు పంట రుణాలు కూడా అందించాలని డిమాండ్ చేశారు.జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జయ శంకర్ భూపాలపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. ఆదివాసీ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. నెట్‌వర్క్ సౌకర్యం లేని గ్రామాలకు తక్షణమే సమాచార సదుపాయాలు కల్పించాలని కోరారు. నాయకపోడు తెగకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి, అత్యంత వెనుకబడిన గిరిజన తెగల జాబితాలో చేర్చడంతోపాటు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీల అడవి, భూమి, సహజ వనరుల హక్కులను కాపాడుతూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని పూసం సచిన్ డిమాండ్ చేశారు.ఈ మహాసభల్లో సుదర శంకర్, పొలం రాజేందర్, మేకల రాజు, తైనేని సతీష్, పెద్ది రాజు, పెద్ది శేఖర్, పొలం చిన్న రాజేందర్, మద్ద మనోజ్, దయ్యం వినోద్, పొలం సంజీవ్, శ్రీను, చింతల ఎర్రయ్యతోపాటు మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంగ్ల నైపుణ్యాలకు విద్యార్థుల ప్రతిభ

ఒలింపియాడ్, ఎడ్యుటాక్‌లో విద్యార్థులు జిల్లా స్థాయికి పలువురి ఎంపిక





కాటారం, (సింగిడి):
ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే విద్యార్థులకు భవిష్యత్తులో విస్తృత అవకాశాలు లభిస్తాయని మండల విద్యాధికారి (ఎంఈఓ) శ్రీదేవి అన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచిం చారు. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం సాధించడం ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు దోహద పడుతుందని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు యు.సోమలింగం పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, ఆంగ్ల భాషపై ఆసక్తిని పెంపొందిం చడమే పోటీల లక్ష్యమని ఎల్టా మండల కన్వీనర్ బొల్లం సతీష్ తెలిపారు.తెలంగాణ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా), రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), భారతీ ఎయిర్‌టెల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్, ఎడ్యుటాక్ ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు.
జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక
సీనియర్ విభాగంలో జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి ఒలింపియా డ్‌లో కాటారం పాఠశాలకు చెందిన బి.ప్రవంతి, ఉపన్యాస పోటీలో దేవారంపల్లి పాఠశాలకు చెందిన సీహెచ్.దుర్గశ్రీ ఎంపికయ్యారు. కేజీబీవీ, మోడల్ పాఠశాలల నుంచి గంగారం మోడల్ స్కూల్‌కు చెందిన బి.స్పందన, కాటారం కేజీబీవీకి చెందిన నికిత జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.జూనియర్ విభాగంలో కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.దీక్షిత్, పి.జెస్సి, గంగారం మోడల్ స్కూల్‌కు చెందిన ఏ.ప్రజ్ఞశ్రీ, కాటారం కేజీబీవీకి చెందిన శరదీపిక జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యు.సోమలింగం బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎల్టా మండల కన్వీనర్ బొల్లం సతీష్, ఉపాధ్యాయులు సుజాత, శైలజ, సంధ్య, స్వప్న, రాజయ్య, అనిత, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా నమోదు శిబిరాన్ని సందర్శించిన డీఆర్డీఓ బాలకృష్ణ



కాటారం, (సింగిడి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహి స్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు శిబిరాన్ని డీఆర్డీఓ బాలకృష్ణ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో కొనసాగుతున్న నమోదు ప్రక్రియను, లబ్ధిదారుల వివరాల సేకరణను పరిశీలించారు. అర్హులైన కుటుంబాల వివరాలను క్షుణ్ణంగా సేకరించి, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో అర్హులైన వారందరికీ పథకంపై అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా కార్యాలయానికి
ప్రభుత్వ స్థలం కేటాయించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బండారి సునీల్ గౌడ్



పెద్దపల్లి, (సింగిడి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించా లని కోరుతూ ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు బండారి సునీల్ గౌడ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండారి సునీల్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనం తరం పెద్దపల్లి జిల్లా కేంద్రంగా అవతరించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ సొంత కార్యాలయం లేకపో వడంతో పార్టీ కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల జిల్లా కార్యాల యాల నిర్మాణానికి ప్రభుత్వ భూమిని కేటాయించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెద్ద పల్లి మండలం బంధంపల్లి శివారులోని సర్వే నంబర్ 183లో ఉన్న ప్రభుత్వ భూమిలో 2 ఎకరాల 16 గుం టల స్థలాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణా నికి కేటాయించాలని కోరారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం రుసుము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి అవసం మైన స్థల కేటాయింపుపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని బండారి సునీల్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

అర్హులకు చేయూత..
సంక్షేమ పథకాలకు శ్రీకారం

పింఛన్ల మంజూరు పత్రాల అందజేత.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్ లో శనివారం అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను అందజే శారు. అలాగే ఇందిర మ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, సర్పంచ్ బాల్యాల రేఖ సుదర్శన్, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ సవితా రెడ్డి, ఉప సర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి, తాటిపాముల లింబాద్రి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బిక్కనూర్, (సింగిడి): ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా జంగంపల్లిలోని వనదుర్గ పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు పున్న రాజేశ్వర్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు బిక్షపతి ముదిరాజ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నంద రమేష్ ముదిరాజ్, జంగంపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీల్వాయి కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన సదస్సు





వేమనపల్లి (నీల్వాయి) (సింగిడి): వేమనపల్లి మండల పరిధిలోని నీల్వాయి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (KGBV)లో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన, ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చెన్నూరు రూరల్ సీఐ ఆర్. కృష్ణ, నీల్వాయి ఎస్ఐ జి. నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థినులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసంతో చదువులో రాణించాలని సూచించారు. అనంతరం సోషలిస్ట్ నరేష్ మాట్లాడుతూ.. సమాజం లోని మూఢనమ్మకాలు, అశాస్త్రీయ ఆచారాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు ప

singidinews@gmail.com

పాక్ మాజీ క్రికెటర్లతో

భజ్జీ కామెంట్రీ

హర్భజన్ దేశ ద్రోహి అంటూ సోషల్ మీడియాలో విమర్శలు



భారత్--పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ వివాదంలో చిక్కుకున్నాడు. పాకిస్తాన్ మాజీ క్రికెటర్లతో కలిసి కామెంట్రీ చేయడం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఇంటర్నేషనల్ లీగ్ టీ20--2026 టోర్నీ సందర్భంగా పాక్ మాజీలు షోయబ్ అక్తర్, షోయబ్ మాలిక్‌తో కలిసి హర్భజన్ కనిపించాడు. అంతేకాదు.. అక్తర్‌తో కలిసి కామెంట్రీ బాక్స్‌లోనూ సందడి చేశాడు. ఈ కార్యక్రమంలో నవజ్యోత్ సింగ్ సిద్ధూ, వకార్ యూనిస్ కూడా పాల్గొన్నారు.

అయితే పహల్గామ్ ఘటన తర్వాత భారత్--పాక్ సంబంధాలు మరింత క్షీణించిన నేపథ్యంలో హర్భజన్ పాక్ మాజీ క్రికెటర్లతో కలిసి కనిపించడంపై కొందరు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భారత క్రికెటర్లు పాక్ ఆటగాళ్లతో కరచాలనం చేసేందుకు కూడా దూరంగా ఉంటున్న సమయంలో.. హర్భజన్ వారితో కలిసి కామెంట్రీ చేయడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. మరికొందరు ఆయన తీరును తప్పుబడుతూ సోషల్ మీడియాలో ఘాటైన వ్యాఖ్యలు చేస్తున్నారు. దీంతో హర్భజన్ వ్యవహారం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కివీస్ పోరాటం..



భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు ఆసక్తికరంగా మారింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 45 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. డేవన్ కాన్వే (59), రచిన్ రవీంద్ర (27) క్రీజులో ఉన్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 59 పరుగులు జోడించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకొని భారత్ నిర్దేశించిన లక్ష్యాన్ని అందుకోవాలంటే కివీస్ ఇంకా 233 పరుగులు చేయాల్సి ఉంది.

అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 720/9 వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్‌కు జస్‌ప్రీత్ బుమ్రా తొలి ఓవర్‌లోనే షాకిచ్చాడు. కెప్టెన్ టామ్ లాథమ్ (0)ను వికెట్ కీపర్ రిషభ్ పంత్ చేతికి చిక్కేలా చేశాడు. ఆ తర్వాత డేవన్ కాన్వే, హెన్రీ నికోల్స్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో నికోల్స్ (31)ను ధ్రువ్ జురెల్ అద్భుత క్యాచ్‌తో పెవిలియన్ దారిన పడ్డాడు.

భారత్ విజయానికి 8 వికెట్లు!
నాలుగో రోజు ఆట ముగిసే
సమయానికి న్యూజిలాండ్ 119/2
క్రీజులో కాన్వే, రచిన్..
ఇంకా 233
పరుగుల వెనుకంజ

కొరియాపై భారత్ ఘనవిజయం

ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో కొనసాగుతున్న జోరు

భోపాల్: మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరపున ముంతాజ్ ఖాన్ (30వ నిమిషం), సునెలిటా టొప్పో (34వ నిమిషం) చెరో గోల్ సాధించారు. కొరియా తరపున యంగెన్ హాంగ్ (56వ నిమిషం) ఏకైక గోల్ చేసింది. అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్న భారత ఫార్వర్డ్ నవ్‌నీత్ కౌర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. మరో మ్యాచ్‌లో జపాన్ 3-0తో థాయ్‌లాండ్‌ను ఓడించగా.. చైనా, మలేసియా మ్యాచ్ 2--2తో డ్రాగా ముగిసింది. ఆదివారం భారత్ తన తదుపరి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో తలపడనుంది.

సోమవారం
23-11-2026

ఓటీటీలోకి 'ఆదర్శ కుటుంబం'..

ఎందులో స్ట్రీమింగ్ కాబోతుందంటే?

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం'. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించగా, నివేదా పేతురాజ్, డింపుల్ హయాతీ, నారా రోహిత్, రావు రమేష్, నాజర్, సత్య, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో కనిపించారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 30న థియేటర్లలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. థియేటర్లలో నిరాశపరిచిన 'ఆదర్శ కుటుంబం' ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 27 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన పోస్టులు కూడా నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. అయితే, నవంబర్ 27న స్ట్రీమింగ్ అవుతుందన్న వార్తలపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



సెల్వరాజ్‌తో కలిసి...

'మంజనథి'పై ప్రియాంక మోహన్

కోలీవుడ్ యంగ్ బ్యూటీ ప్రియాంక ప్రస్తుతం మంజనథి, అరసన్ వంటి భారీ సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయారు. స్టార్ డైరెక్టర్ మారి సెల్వరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మంజనథి' సినిమాలో కాయదు లోహర్ కూడా కనిపించనున్నారు. దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజా ఈ మూవీకి సంగీతం అందిస్తుండగా, దర్శకుడు మారి సెల్వరాజ్ తన సొంత బ్యానర్ నవ్వి స్టూడియోస్‌తో పాటు స్కంద పిక్చర్స్, ఫార్చ్యూన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో.. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక సినిమా విశేషాలను పంచుకుంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మంజనథి' తనకు ఎంతో ప్రత్యేకమైన సినిమా అని ప్రియాంక తెలిపారు. మారి సెల్వరాజ్‌తో కలిసి పనిచేయాలనేది తన చిరకాల కోరిక అని.. 'మంజనథి' అది నెరవేరిందని చెప్పారు. ఇళయరాజా సంగీతం వినడం తనకు చాలా ఇష్టమని, ఆయన మ్యూజిక్ అందిస్తున్న సినిమాలో తాను నటించడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ప్రియాంక ఆనందం వ్యక్తం చేశారు. అలాగే వెట్రిమారన్-శింబు కాంబోలో రాబోతున్న 'అరసన్' గురించి మాట్లాడుతూ.. వెట్రిమారన్ సినిమాలను చూడటం తనకు ఎప్పుడూ ఇష్టమని, ఈ సినిమా కథాంశం 'వడ చెన్నై' మూవీతో సమానంగా ఉంటుందని వెల్లడించారు. ఇది 'వడ చెన్నై'కు సమాంతరంగా సాగే కథ అని ఆమె స్పష్టం చేశారు. తాను బెంగళూరుకు చెందిన అమ్మాయి కావడం వల్ల, మొదట్లో ఉత్తర చెన్నై యాసలో మాట్లాడటం కొంచెం కష్టంగా, సవాలుగా అనిపించిందని ప్రియాంక చెప్పారు. అయితే త్వరలోనే ఆ యాసకు అలవాటు పడ్డానని, ఇప్పుడు షూటింగ్‌ను, నటనను బాగా ఎంజాయ్ చేస్తున్నానని తెలిపారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737